
# భక్తి తత్త్వము

## స్వామి వివేకానంద



# భక్తితత్త్వము

## స్వామి వివేకానంద

**రామకృష్ణ మఠం**

దోమలగూడ హైదరాబాదు – 500 029

© 2018 Ramakrishna Math, Hyderabad INDIA. All rights reserved.

**Published by:**

Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad – 29
rkmath.org

**e-Book**

089v1.1.0

Date: October 6, 2018

ISBN: 9789386857408

Created by: Sriranga Digital Software Technologies Private Limited

srirangadigital.com

# మనవి

శ్రీ వివేకానంద స్వామి ఇంగ్లాండ్, అమెరికాలలో భక్తియోగం మీద గావించిన ప్రసంగాలు ఈ సంకలనంలో పొందుపరచబడినాయి. ఈ పుస్తకానికీ, స్వామీజీ భక్తియోగానికి కొద్ది తేడా ఉంది – విషయాంశంలో కాదు; విషయాంశం రెండింటిదీ ఒక్కటే. కాని దీన్లో స్వామీజీ గావించిన విషయ వివరణం విస్తృతమూ, సుబోధకముగా ఉంటుంది.

ఇంతకుముందు 'భక్తియోగోపన్యాసాలు' పేరుతో ప్రచురితమైన ఈ పుస్తకానికి 'భక్తితత్త్వము' శీర్షిక చక్కగా సరిపోతుందని కొత్త శీర్షికతో గ్రంథాన్ని మీ ముందుంచుతున్నాము.

ఈ పుస్తకం ఆంగ్లమాతృక Religion of Love పలు ముద్రణలు పొంది విశేష జనాదరణ గడించింది. తెలుగు పాఠకులకు, ముఖ్యంగా భక్తకోటికి ఈ పుస్తకంలోని విషయాంశాలు ఆచరణయుక్తం కాగలవని విశ్వసిస్తున్నాము.

**– ప్రకాశకులు**

# భక్తితత్త్వము

## ప్రాథమిక అంశాలు

భక్తియోగ నిర్వచనాలలో బహుశ అతి ఉత్కృష్టమైన నిర్వచనం ఈ వచనాలలో ఉంది: "హే భగవాన్! అస్థిరమైన లౌకిక విషయాల మీద వివేకరహితులకు ఎలాంటి ప్రగాఢమైన మమకారం ఉంటుందో – నీ సాక్షాత్కారాన్ని కాంక్షించే నా హృదయంనుంచి అలాంటి అనురాగం ఎన్నడూ వీడకుండుగాక!"* ఇంద్రియాలు కోరే వస్తువులపట్ల , ధనంపట్ల, ఆస్తులపట్ల, ఆలుబిడ్డలపట్ల, స్నేహితులపట్ల మానవులకు ఎంత ప్రగాఢమైన ప్రీతి (ఘనతరమైన ప్రేమకు అవగతులు కాకపోవడంవల్ల) ఉంటుందో మనం అవలోకిస్తున్నాం. ఈ వస్తుసముదాయంపట్ల వారికి ఎంత ప్రగాఢమైన ఆసక్తి ఉంటుందో కదా! కాబట్టే పూర్వోక్త ప్రార్థ నలో యోగి "అలాంటి ప్రగాఢ ప్రేమను, అలాంటి అద్భుతానురాగాన్ని నీ పట్ల మాత్రమే కలిగివుంటాను" అని వచిస్తూన్నాడు. ఈశ్వరుడికి సమర్పించబడేటప్పుడు ఈ అనురాగమే భక్తిగా పేర్కొబడుతుంది. భక్తి దేనినీ నాశనం చేయదు. మనకు ఇవ్వబడ్డశక్తులలో ఏదీ వ్యర్థ ం కాదనీ, కైవల్యప్రాప్తికి సహజమార్గం వాటిలోనే ఉందనీ అది మనకు బోధిస్తోంది. మన ప్రవృత్తులను భక్తి నాశనం చేయదు; ప్రకృతికి అది ప్రతికూలంగా పోదు. మహత్తరమై, ఉదాత్తమైన పథంలో అది దీన్ని నడుపుతుంది. భోగ్యవస్తువులమీద మనకెలాంటి సహజానురాగం ఉంటుంది! అవి మనకు సన్నిహితాలై, మన దృష్టిలో సత్యసందీప్తాలై ఉండటంవల్ల వాటిమీద మనకు అలాంటి అనురాగం ఉండితీరుతుంది. ఉదాత్త వస్తువుల్లోని సత్యాన్ని సాధారణంగా మనం పరికించం. ఇంద్రియాతీత వస్తువుల్లో సత్యాన్ని విలోకిస్తే, ఇంద్రియ విశ్వానికి ఆవల వెలసే యథార్థం మన హృదయాన్ని ఆకర్షిస్తే అది ఈశ్వరుడే అని మనం గుర్తించాలి. ఒకప్పుడు విషయవస్తువుల మీద చూపబడ్డ ప్రేమ భగవంతుడిపట్ల చూపబడితే, అది భక్తి అనబడుతుంది. ఈ అధికానురాగాన్ని అలవరచుకోవడం ఎలాగో శ్రీరామానుజులు ఇలా వివరించారు.

వివేకంవల్ల ఇది అలవడుతుంది. ఇది మొదటి మెట్టు . ముఖ్యంగా పాశ్చాత్యులకు ఇది వింతగా కనబడవచ్చు. శ్రీరామానుజుల దృష్టిలో ఇది "ఆహారాన్ని గురించిన వివేకమై ఉండాలి" ; మనకు శారీరక, మానసిక శక్తులను ప్రసాదించే గుణం ఆహారంలో ఉంది. ఆహారం మన కడుపులో ప్రవేశించి, పరివర్తన చెంది, మన దేహాలకు దార్ఢ్యమిచ్చి నడుపుతుంది. మనం భుజించే ఆహారానికీ, మన శరీర మనస్సులకూ ప్రధాన వ్యత్యాసం ఏదీలేదు. ప్రాకృత ప్రపంచంలో మనం అవలోకించే పదార్థశక్తులు మన శరీర మనస్సులను సృజిస్తాయి. కాబట్టి శరీరానికీ, మనస్సుకీ, మనం భుజించే ఆహారానికీ నడుమనున్న వ్యత్యాసం బాహ్యవ్యక్తీకరణంలోనే కనబడుతుంది. మన ఆహారపదార్థాంశాల నుంచి, భావసాధనం సృష్టి అవుతుంది. ఈ అంశాల్లోని సూక్ష్మశక్తులనుంచి భావం సృష్టిఅవుతుంది. కాబట్టి ఈ భావమూ, దీన్ని సృష్టి ంచే సాధనాలూ మన ఆహారాన్ని అనుసరించి మార్పు చెందుతూ ఉంటాయి. మన మనస్సులలో కొంత వికారాన్ని, మార్పును కలిగించే కొన్ని ఆహారపదార్థాలు ఉన్నాయి. ఈ విషయం ప్రతిరోజు మన అనుభూతిలో స్పష్టమవుతోంది. శరీరంలో మార్పు కలిగించే మరికొన్ని ఆహార వస్తువులున్నాయి. కాలక్రమాన మనస్సు మీద వీటి ప్రభావం విశేషంగా ప్రసరిస్తుంది. ఇది ముఖ్యంగా గ్రహించవలసిన విషయం. మనం అనుభవించే యాతనలో విశేషభాగం మనం భుజించే ఆహారంవల్లే సృష్టి అవుతూంటుంది. జీర్ణంకాని అమితాహారాన్ని భుజించిన తరువాత మన మనస్సును నిగ్రహించడం చాలా కష్టమని మీరు గ్రహించగలరు. భుక్తాయాసం ఉన్నంతవరకు అవిరామంగా అనేక విషయాలపై అది చిందులాడుతుంటుంది. ఉద్రేకాన్ని కలిగించే కొన్ని ఆహార పదార్థాలున్నాయి. ఇలాంటి పదార్థాలను భుజిస్తే, మనస్సును చెప్పుచేతలలో ఉంచడం దుస్సాధ్యమే అవుతుంది. సారా గాని, మత్తును కలిగించే మరే పానీయం గాని విశేషంగా తాగాక మనస్సును అరికట్టడం అసాధ్యమని అనుభవంతో మనిషి స్పష్టంగా తెలుసుకోగలడు. సంయమశక్తిని అది తగ్గించి చెలరేగుతుంది.

శ్రీరామానుజుల ఉద్దేశం ప్రకారం ఆహారంలో మనం విసర్జించవలసిన మూడు వస్తువులున్నాయి. అది ఏ జాతి పదార్థమో, అది ఏ రీతి ఆహారపదార్థమో మనం యోచించాలి. ఉద్రేకం కలిగించే మాంసం వంటి పదార్థాలను విసర్జించాలి. సహజంగా ఇది అశుభ్రమైన వస్తువు. మరొక ప్రాణిని సంహరిస్తేనేగాని ఈ పదార్థం లభించదు. దీనిని ఆరగించేవారికి క్షణకాలం ఆనందం కలుగవచ్చు. ఈ ఆనందం ఒకరికి కలిగించడానికై మరోజీవి ప్రాణాలను తీయాలి. ఈ సంహారక్రియ అలా ఉంచితే, ఇతర మానవులు దీనివల్ల నీతిభ్రష్టు లవుతుంటారు. మాంసాన్ని మెక్కే అతగాడు తన చేత్తో తానే ఒక జంతువును చంపి అలా చేయడం మేలు. కాని ఇలా జరగడం లేదు. తమకోసమే ఈ కార్యాన్ని జరిపే ఒక తరగతివారిని సమాజం తల ఎత్తనిస్తోంది. ఈ తరగతి వారిని అది జుగుప్సతో చూస్తూంటుంది. ఇంగ్లండ్‌లో కసాయివాడు జూరీ సభ్యులలో ఒకడవడానికి అర్హుడుకాదు.

అతడిది దుష్టస్వభావమని ఇందువల్లబోధపడుతోంది. అతణ్ణి దుష్టు డిగా చేసినదెవరు? సమాజమే. గోమాంసమూ, మేక నంజుడూ మెక్కనివారు ఎవ్వరూ లేకుంటే, కసాయివాళ్ళే ఉండరు. ఎంతో శ్రమించి పనిచేసేవారు మాంసాన్ని తిన్నా తినవచ్చునేమో! వీరిలో ఎవ్వరూ భక్తులు కాలేరు. మీరు భక్తులు కాగోరితే, మాంసాన్ని ముట్టకూడదు. మాంసాన్నే కాదు; ఉల్లి, దుర్గంధబంధురమైన ఒక రకం జర్మనీ సీమ ఊరగాయలు మొదలైన పదార్థాలను — ఉద్రేకాన్ని కలిగించే వస్తువులను విసర్జించి తీరాలి. తమ స్థితి మారేవరకు కొన్ని రోజులు నిలువలో ఉన్న పదార్థాలు, సహజ రసాలు దాదాపుగా ఆరి ఎండిన వస్తువులు, దుర్వాసనవేసే పదార్థాలు విసర్జించబడాలి.

ఆహారాన్ని గురించి విచారించదగ్గ మరో విషయం పాశ్చాత్యుల మనస్సులకు మరింత సంక్లి ష్టమై ఉంటుంది. అది 'ఆశ్రయమ' నబడుతుంది. అంటే ఎవరినుంచి ఈ ఆహారం వస్తోందో అనే అంశం ప్రధానం. ఏ ఆశ్రయం నుంచి ఆ ఆహారం లభిస్తూంది? అని యోచించాలి. ఇది హిందువులలో ప్రచలితమైన ఒక విచిత్ర సిద్ధాంతం. ప్రతీ వ్యక్తిచుట్టూ ప్రత్యేకమైన ప్రభావం ఆవరించుకొని ఉంటుంది. అతడు ఏ వస్తువును స్పృశించినా, అతడి నడతలో కొంతభాగం, అతడి ప్రవర్తనలోని ప్రభావం అతడు స్పృశించిన పదార్థానికి సోకుతుంది. ఒక శారీరక శక్తిమాదిరి ఒక వ్యక్తి గుణమహిమ ఆతడినుంచి వ్యక్తమై అతడు ముట్టినదాన్ని హత్తుకొంటుంది. వంట చేసేటప్పుడు ఆహారాన్ని ఎవరు స్పృశిస్తున్నారో మనం జాగ్రత్తగా గమనించాలి; దుష్టుడుగాని, నీతిబాహ్యుడుగాని దాన్ని అంటకూడదు. భక్తుడు కాగోరేవాడు పరమదుష్టులని తాను ఎరిగిన వ్యక్తులతో కలసి భోజనం చేయరాదు. ఎందుకంటే వారి దౌష్ట్యం అంటురోగం మాదిరి ఆహారం ద్వారా అతడికి సోకితీరుతుంది.

*నిమిత్తాలు:*ఏ వస్తువుల ద్వారా ఆహారం గ్రహించబడుతూందో అనే అంశం తరువాత గణనీయమైనది. ఆహార శుభ్రత వీటిమూలాన కూడ గ్రహించతగినది. ఆహారంలో ధూళికాని, రొచ్చుగాని ప్రవేశించ కూడదు. బజారునుంచి ఆహారాన్ని తీసుకొని రాకూడదు. కడిగి పరిశుభ్రం చేయని బల్లమీద ఆహారం ఉంచకూడదు. నోటిలో జనించే ఉమ్మి అనే పదార్థాన్ని, కడుపులో జీర్ణసమయంలో ఊరే రసాలను గురించి కూడ మనం యోచించి తీరాలి. వేళ్ళతో పెదవులను ఎన్నడూ స్పృశించకూడదు. కడుపును అంటి ఉండే పలుచని చర్మం జిగురుగా ఉండే చర్మం — శరీరంలోని అతి సున్నితమైన భాగం. నోట్లోఊరే ఉమ్మి నుంచి అనేక స్థి తులు లోపలికి వ్యాప్తి అవుతుంటాయి; లోపల నుంచి దాని ద్వారా వ్యక్తమవుతుంటాయి. వాటి సంస్పర్శవల్లచెరుపు కలుగడం తథ్యం; అది భయంకరమైనదనీ తెలుప చెల్లు తుంది. ఒకరు సగం తినగా మిగిలిన ఆహారాన్ని మనం భుజించకూడదు. పైన వర్ణించబడ్డ ఆహార నియమాలు పాటించబడినప్పుడు ఆహారం పరిశుభ్రమైవుంటుంది. పరిశుభ్ర ఆహారం వల్ల మనస్సు అవిరత మననానికీ, అవిరళ నిధిధ్యాసానికీ, నిరంతర ఈశ్వరధ్యానానికీ యోగ్యమై ఉంటుంది.

మరొక భాష్యకర్త శ్రీ శంకరాచార్యులు ఈ విషయాన్ని పరిశీలించిన విధానాన్ని వివరిస్తాను. ఈ మహనీయుడి వ్యాఖ్యానం వేరుతీరులో ఉంది. 'ఆహార' మనే సంస్కృత ధాతువుకు అర్థం 'సంగ్రహం'. సంగ్రహించబడినది ఆహారం. ఆయన వ్యాఖ్యానం ఏమిటి? 'ఆహారం పరిశుభ్రంగా ఉన్నప్పుడు మనస్సు నిర్మలమై ఉంటుంది'*అనే వాక్యానికి అర్థ ం ఇది: ఇంద్రియాలకు లోనుకాకుండటానికై ఈ క్రింది విషయాలను మనం పరిత్యజించాలి. వర్జనీయమైన ప్రథమాంశం 'విషయ

ఆసక్తి'. ఈశ్వరుడిపట్లతప్ప అన్యవిషయాలపై గాఢంగా అనురక్తులమై ఉండరాదు. ప్రతి విషయాన్ని అవలోకించండి; ప్రతి కార్యాన్ని నిర్వహించండి; కాని దేనిపట్లాఅనురక్తులై ఉండొద్దు . తీవ్రమైన ఆసక్తభావం చెలరేగినప్పుడు, వ్యక్తి మనస్సు సంయమశక్తిని కోల్పోతుంది; తన ఇంద్రియాల మీది అధికారం మనిషి విడిచివేస్తాడు; తనకు తాను దాసుడైపోతాడు. ఒక పురుషుడి పట్ల ఒక స్త్రీ విశేషంగా అనురక్తగా ఉంటే, అతడి సమక్షంలో ఆమె బానిస బతుకును గడుపుతుంది. బానిస బతుకువల్లప్రయోజనం ఏమిటి? తోటిమానవుడికి బానిస అవడంకంటే, లోకంలో గమనార్హా లైన మహత్తరాంశాలు అనేకం ఉన్నాయి. ప్రతివ్యక్తిని ప్రేమించు, ప్రతివ్యక్తికీ మేలు, సేవ ఒనరించు, కాని ఎన్నటికీ బానిస కాబోకు. అనురక్తివల్ల అధఃపతితులమవుతాం. ఈ వ్యక్తిగత అధఃపతనం మొదటి కీడు. దీనివల్ల మీలో స్వార్థ చింతన మిక్కుటమవుతుంది. ఇది రెండవ నష్టం. ఈ దోషంతో ఎవరిపట్లమనం అనురక్తులమై ఉంటామో వారికి మేలు చేయడానికై ఇతరులకు కీడుచేస్తాం. ప్రపంచంలో జరిగే దుష్ట క్రియలలో అధిక సంఖ్యాకం కొందరిపట్ల చూపబడే విశేషాసక్తభావం వల్ల చేయబడినవే. సత్క్రియలను నిర్వర్తించేటప్పుడు తప్ప తక్కిన సకల జీవిత సన్నివేశాలన్నింటిలోను అనురక్తిని విడువాలి; కాని ప్రతివారిపట్ల ప్రేమ చూపడం ముఖ్యం. ఇక ఈర్ష్య విషయం అంటారా? ఇంద్రియాలు వలచే విషయసమూహంలో వస్తుసముదాయంలో దాని తలను ఎత్తనివ్వరాదు. సర్వారిష్టాలకు మూలకారణం ఈర్ష్యే. దీన్ని జయించడం సామాన్య విషయంకాదు. భ్రాంతి లేక మోహంవల్ల మనకు చెప్పలేని హాని కలుగుతుంది. ఒక విషయంలోని సత్యంమీద దృష్టి నిలుపలేక, దాన్ని వేరే రీతిలో విలోకించి, అపోహననుసరించి ఆచరణకు పూనుకొంటాం. ఇలాంటి చేతవల్ల తలమీదికి కుంపటి నెక్కించుకొంటాం. రా! రమ్మంటూ అనర్థాన్ని ఆహ్వానిస్తాం. మేలైన వస్తువును కీడైనదని ఎంచుతాం. క్షణమాత్రం ఏదైనా మన శరీరంలోని స్నాయువుకు గిలిగింతలు పెడితే, దానివల్ల మనకు విశేషాభ్యుదయం చేకూరుతుందని ఆశపడతాం. తక్షణమే మక్కువతో దాన్ని అక్కున చేర్చుకొంటాం. తొట్రుపడక ఆ అంశంలో గభాల్లున దూకుతాం. తీవ్రాఘాతం పైబడ్డప్పుడు 'హతవిధీ' అంటూ అంగలారుస్తాం. అరిష్టపు పిడికిట చిక్కిన తరువాత విచారిస్తే ప్రయోజనం ఏమిటి? ప్రతిరోజూ మనం ఈ భ్రమలో పడిపోతూంటాం. ఆజన్మం ఈ ప్రమాదంలో పడుతూనేవుంటాం. దేనిపట్లాఅనురక్తి చూపక, ఈర్ష్య కుగాని, భ్రమకుగాని లోనుకాక ఇంద్రియాలు లోకంలో కర్తవ్యాన్ని నిర్వహిస్తూంటాయో, ఈ కర్తవ్యం లేక నిర్దుష్ట సంకల్ప సముదాయం నిర్మలాహారమవుతుంది. ఇది శంకర భగవానుల వ్యాఖ్యానం. నిర్మలోదకాన్ని గ్రహించినప్పుడు, అంటే అనురక్తిచేత, ఈర్ష్యచేత, భ్రమచేత, అపోహచేత విషపూరితం కాని విషయాలను స్వీకరించి, వాటిని మననం చేసినప్పుడు మనస్సు నిర్మలమై పునీతమై అలరారుతుంది. నిరంతరం ఈశ్వరధ్యానానికీ, ఈశ్వర సంస్మరణానికీ అది అప్పుడు అర్హత కలిగివుంటుంది.

శ్రీ శంకరుల వ్యాఖ్యానమే ఉత్కృష్టమైనదని ఎవరైనా తెలుపడం సహజమే. కాని శ్రీరామానుజుల వ్యాఖ్యానాన్ని నిరాదరణ దృష్టితో త్రోసివేయకూడదు. ఆహారంపై సాదర లక్ష్యాన్ని సారించినప్పుడే శేషించిన జీవితాంశాలు సక్రమంగా నిర్వహించబడతాయి. మనస్సు నియంత్రణకారి అని, శాసనకర్త అని తెలుపడం వాస్తవమే; చిత్తానికి అధికారం ఉండటం నిర్వివాదాంశం. కాని మనలో ఇంద్రియాలకు లొంగనివారి సంఖ్య అత్యల్పం. విషయవస్తువులు మనపై అధికారాన్ని విజృంభింపచేస్తాయి. ఇది సాగినంతకాలం విషయవస్తుగత సహకారం మనకు ఆవశ్యకమై ఉంటుంది. మనకు సత్తువ కలిగినప్పుడు మనకు ఇష్టంవచ్చిన పదార్థాలను మనం భుజించవచ్చు; కావలసిన పానీయాన్ని తాగవచ్చు. ఆహార పానీయాలను గురించి జాగరూకులమై ఉండటంలో మనం శ్రీరామానుజస్వామి హితవును శిరసావహించాలి. దానితోపాటు మానసిక ఆహార విషయంలోకూడ మనం జాగ్రత్తపడాలి. స్థూలదృష్టికి తోచే ఆహారాన్ని గురించి జాగ్రత్తపడటం కష్టం కాదు. మానసిక కర్తవ్యం కూడ వెంటవెంటనే జరగాలి. ఇలాచేస్తే, క్రమక్రమంగా మన ఆత్మశక్తి బలవత్తరమౌతూంటుంది. ఇలా అయ్యేకొద్దీశారీరక వ్యక్తిత్వం – 'అహం' యొక్క సత్తువ తగ్గు తుంది. దీని దృఢఘోష క్షీణించాక ఆహారంవల్లకీడు కలుగదు. పరమాశయంవైపు లక్ష్యం నిలిపి, దాన్ని త్రుంచి చేబూనటానికై ప్రతి వ్యక్తీ విశేషోత్కంఠతో ఉరకలు వేస్తాడు. ఈ విజృంభణం పనికిరానిది, ఇలా ఉరికే వ్యక్తి కూలబడతాడు. మనం శృంఖలాలవల్లబద్ధు లమై ఉన్నాం. మెల్లమెల్లగా మనం ఈ సంకెళ్ళను ఛేదించాలి. ఇది వివేకం వల్లనే సుసాధ్యం.

తరువాత గమనించతగ్గ విషయం విముక్తి – వాంఛలనుంచి విమోచనం. ఈశ్వరుణ్ణి ప్రేమించదలచేవాడు

తీవ్రతృష్ణకు లొంగరాదు. భగవంతుడిమీద తప్ప మరి దేనిమీదా వాంఛాబంధురదృష్టిని సారించకు. ఉత్తమలోక ప్రాప్తికి సహకారి అయినంతవరకు ప్రపంచం మంచిదే. ఉదారాశయ సిద్ధికి తోడ్పడేటంత వరకు విషయ వస్తువులు మేలైనవే! ఈ జగత్తు ఆశయసిద్ధికి తోడ్పడే ఒక సాధనం మాత్రమేగాని, ఇదే లక్ష్యంకాదని మనం అనవరతం మరచిపోతుంటాం. ఇదే లక్ష్యమైతే, ఈ శరీరాల్లోనే మనం అమరులం కావాలి. మృత్యువుపాల పడరాదు. కాని నాలుగు దిక్కులలోను మానవులు అనవరతం మరణించడం మనం చూస్తూన్నాం. మూఢులమై మనకు ఎన్నడూ చావురాదని ఊహిస్తున్నాం. నూటికి తొంభై తొమ్మిదిమంది ఇలాగే తలపోస్తుంటారు. ఈ అపోహను మన మనస్సులనుంచి తక్షణమే దూరం చేసివేయాలి. పరిపూర్ణత్వ సిద్ధికి దోహదం అయ్యేవరకు ఈ ప్రపంచం మేలైనదే. అందుకు అది తోడ్పడటం విరమించిన ముహూర్తాన అది చెరుపు తెచ్చేదని మనం విశ్వసించాలి. ఆలుమగలు, ధనధాన్యాలు, బిడ్డలు, బంధువులు, చదువుసంధ్యలు, మన పురోభివృద్ధికి సహకారులయ్యే వరకు ఆదరదృష్టిని ఆకర్షించాలి. ఈ ప్రాకృతబాంధవ్యాలు, వస్తువులు అందుకు ఉపయుక్తాలు కానప్పుడు వాటివల్లఅరిష్ట మే దాపురిస్తుందని మనం నమ్మాలి. ఈశ్వరుణ్ణిపొందడానికై అర్ధా ంగి తోడ్పడితే, ఆమె ఉత్తమ ఇల్లాలు అని చెప్పక తప్పదు. అలాగే భర్త విషయంలో, కన్నబిడ్డ విషయంలో యోచించాలి. ఇతరులకు మేలు చేయడానికై ధనం తోడ్పడితే, దానికి కొంత విలువ ఉందని, అలా కాకుంటే, అది చెరుపుల మూట అనీ, దాన్ని ఎంత త్వరగా వర్జి స్తే అంత మేలని మనం విశ్వసించాలి.

తరువాత మన దృష్టిని ఆకర్షించాల్సిన విషయం అభ్యాసం. మనస్సు అనవరతం ఈశ్వరుడి దెస సాగిపోవాలి. ఇతర విషయాలు ఏవీ దాని గమనాన్ని నిరోధించకూడదు. అవిశ్రాంతంగా అది ఈశ్వరధ్యానం సలుపుతూండాలి. ఇది కష్టంతో కూడుకొన్న పని అయినప్పటికీ స్థిరాభ్యాసంతో సాధ్యమవుతుంది. వెనుకటి అభ్యాసఫలమే మన జీవనం. ప్రస్తుతాభ్యాసంతో మన భావి జీవిత నిర్మాణం జరుగుతుంది. కొంత జీవిత చక్రపరిభ్రమణంవల్ల మనం ఈ స్థి తికి వచ్చాం. సక్రమంగా ఈ చక్రాన్ని తిరుగనిస్తే, దీని పరిభ్రమణం పూర్తవుతుంది. దీని గతి పూర్తవుతుంది. సత్వరంగా నీ ఆశయసిద్ధి ఫలించడానికై శక్తివంచనలేక ప్రయత్నించు. విషయవస్తు మననంవల్ల, ఇంద్రియ మననం వల్ల మనం ఈ స్థి తికి వచ్చాం. ఒక నిమిషం అంగలార్చి, వేరొక ముహూర్తంలో ఆనందంలో అల్లాడి, ఏ అనుభూతి ఎలా రివ్వురివ్వున వీస్తుందో, దానితో ఆనందించి, ప్రతి వస్తువుకు దాసులమై చెరలాడుతున్నాం. ఇది లజ్జాకరమైన సంగతి. అయినా మనం తేజస్వులమని తెలుపుకొంటాం. సముచితమైన ఆవలిమార్గం అనుసరించి వెళ్ళండి. ఈశ్వరుణ్ణిస్మరించండి. శారీరక మానసిక ప్రమోదాన్ని గురించి మననం చేయవద్దు; ఈశ్వరుణ్ణి గురించే ధ్యానించండి. పరచింతకు మనస్సు తావిస్తే, దానిమీద తీవ్రమైన ఆఘాతం వేయండి. దెబ్బతిని వెనక్కు తరలి అది భగవంతుణ్ణిగురించే యోచన చేస్తుంది. ఒక పాత్రనుంచి వేరొక పాత్రలో పోయబడే తైలం ఏ రీతిగా అవిరతధారగా పడుతుందో దూరంనుంచి వచ్చే ఘంటాసమూహారవం నిరంతర నినాదం మాదిరి ఎలా శ్రుతగోచరమవుతుందో అలాగే గలగలపారే నదీస్రవంతి సముద్ర ముంగిట చేరినట్లేచిత్తమూ, ఈశ్వరుడి వైపు సాగిపోవాలి.

ఈ అభ్యాసంలో చిత్తం బద్ధదీక్షితగా ఉండాలి. మనస్సును ఈ పునీత పథంలో నడిపేటప్పుడు ఇంద్రియాలకు సత్క్రమ క్రియలను కల్పించాలి. కొరగాని కథలను చెవుల్లో పడనీయక భగవంతుణ్ణి గురించిన ప్రసంగాలనే మనం వినాలి. కొరగాని పుస్తకాలమీద చూపు నిలుపక దైవీప్రసక్తిగల సద్గ్రంథాలనే మనం పఠించాలి.

ఈశ్వర సంస్మరణాభ్యాసానికి విశేషంగా తోడ్పడేది సంగీతం. భక్తి బోధకుడైన నారద దేవర్షితో భగవంతుడు ఇలా అన్నాడు: "నేను వైకుంఠంలో నివసించేవాణ్ణి కాను; యోగి హృదయంలోనూ నివసించను. కాని ఎక్కడ భక్తులు నా నామాన్ని గానం చేస్తూంటారో అక్కడ వసిస్తాను".* మానవ చిత్తంమీద గానానికున్న ప్రభావం మహత్తరమైనది. దానివల్ల క్షణంలో ఏకాగ్రదృష్టిఅల వడుతుంది. మూర్ఖు లూ, నికృష్టులూ, పశుప్రాయులా, ఒక్క నిమిషమైనా తమ మనస్సులను నిలకడగా ఉంచుకోలేని జడులూ, మధురగానాన్ని విన్నప్పుడు అకస్మాత్తుగా అంతరంగిక పరితోషంపొంది చిత్తైకాగ్రతను పొందుతారు. కుక్కలు, సింహాలు, పిల్లులను పోలిన మృగాలూ పాములూ సంగీతాన్ని వినగానే తన్మయతను పొందుతాయి.

తరువాత గణనీయమైనది క్రియ – పరోపకారం. స్వార్థపరుడికి ఈశ్వరచింత సాధ్యం కానేకాదు. సమాజంలో ప్రవేశించి, మనం సేవాధర్మాన్ని నిర్వహించినకొద్దీ మన హృదయాలు పునీతమవుతాయి – ఈశ్వరపీఠాలే అవుతాయి. ఈ

పీఠాలను భగవంతుడు అనవరతం అలంకరించి ఉంటాడు. మన శాస్త్రాలు ఐదు రీతుల క్రియలను పేర్కొన్నాయి. ఇవే పంచయజ్ఞాలు. అధ్యయనం మొదటి యజ్ఞం. మనిషి అనుదినం పవిత్రగ్రంథపఠనం చేయాలి. జ్ఞానయజ్ఞంలో అతడు దీక్షితుడై ఉండాలి. ఈశ్వరుణ్ణి, దేవతలను, యోగులను అతడు సేవించాలి. ఇది రెండవ యజ్ఞం. మూడవది పితృయజ్ఞం. ఇది గతించినవారికి చేసే సేవ. తోటిమానవులకు చేసే సేవ నాలుగవ యజ్ఞం. తన ఇంట్లో ఒంటరి బతుకు గడిపే హక్కు మానవుడికి లేదు. నిరుపేదలకు, తలదాచుకోవడానికై తహతహలాడేవారికి అతడు నివాస వ్యవస్థచేకూర్చాలి. గృహస్థు దు అన్నార్తులకూ, దుఃఖితులకూ, కష్టాలతో క్రుంగిపోయే వారికీ తన గృహద్వారాలను తెరచి ఉంచాలి. ఇలా చేసేవాడే ఆదర్శ గృహస్థుడు. తనకోసమూ, తన గృహిణి కోసమూ, స్వీయ కుటుంబ సౌఖ్యం కోసమూ మాత్రమే గృహ నిర్మాణం చేసుకొనేవాడు ఈశ్వరభక్తుడు కాబోడు. తన కోసమే, తన పొట్ట నింపుకోవడానికే ఎవ్వడూ వండుకోరాదు. ఇతరులకోసం వంటచేసి, ఇతరులకు తినిపించి మిగిలిన ఆహారాన్నే మానవుడు భుజించాలి. ఋతుఫలసాయం తొలుత విపణిమార్గంలో ప్రవేశించినప్పుడు, మామిడి పళ్ళు మొదలైన రసాల ఫలవిశేషాలు తొలుత విక్రయశాలలకు ఎక్కినప్పుడు, తన ధర్మం ఎరిగిన వ్యక్తి వాటిని కొని, పేదలకు పంచిపెడతాడు. ఇది భారతదేశంలో జరిగే సర్వసామాన్య ఆచారం. ఇతరులకు ఫలదానం చేశాకే అతడు ఫలాలను తింటాడు. ఈ దృష్టాంతం మీ దేశంలో అందరికీ సముజ్జ్వలమైన మేలుబంతి అవడం మేలు. ఈ తీరు శిక్షణవల్లమనిషి తన హృదయం నుంచి స్వార్థ చింతను దూరంచేసి, పరార్థజీవి అవుతాడు. నీతి సందీపితమైన ఈ తీరు ప్రవర్తనం తన దారాపుత్రాదులకు చక్కని గుణపాఠాన్ని బోధించగలదు. ప్రాచీనకాలంలో హీబ్రూలు తొలిఫలాలను ఈశ్వరుడికి సమర్పించేవారు. ప్రతి ద్రవ్యంలోని ప్రథమభాగం నిరుపేదలకు చేరితీరాలి; శేషించినదాన్ని గ్రహించడానికే మనకు హక్కు ఉంది. పేదలు భగవంతుడి ప్రతినిధులు — ఆర్తులందరూ ఇలాంటివారే. ఆకలితో అలమటించే నిర్భాగ్యులపై ఆదరదృష్టిసారించక, పిడికిలి విప్పి పరులకు ఇవ్వక, ఎవడు మెక్కుతాడో, కడుపార మెక్కి సంతోషంతో తబ్బిబ్బవుతాడో అతగాడి ప్రమోదానుభూతి పాపమే అవుతుంది. ఐదవ యజ్ఞం – నికృష్టపశువులపట్ల మనం నిర్వహించవలసిన ధర్మం. జంతుజాలమంతా మానవుడి పొట్టకూటికై సృష్టించబడిందనీ, మానవుడి ఆహారానికై పశువులు వధించబడాలనీ చెప్పడం అమానుష క్రియను సూచించడమే అవుతుంది. వాటిని మానవుడు తన చిత్తం వచ్చిన తీరులో ఉపయోగించుకోవచ్చు అని అనడం అలాంటిదే. ఇది పైశాచిక ప్రబోధ మవుతుందిగాని ఈశ్వర ప్రబోధం కాదు. శరీరంలోని ఫలానా భాగంలోని నరంగాని, స్నాయువుగాని చలిస్తూందో లేదో తెలుసుకోవడానికై జంతువులను కోయడం రాక్షసకృత్యమే అవుతుంది. పరాయి ప్రభుత్వాలవల్లఇలాంటి చెడుపనులకు ఎలాంటి ప్రోత్సాహం మా దేశస్థు లకు లభిస్తూన్నా, అదృష్టవశాత్తు హిందూ ధర్మానుయాయులు ఈ చెడుచేతకు చేయూత ఇవ్వరని తెలుపడానికి ఆనందిస్తున్నాను. ఒక ఇంట్లోవండిన ఆహారంలో ఒక భాగం జంతువులకు దాఖలు కావలసిందే. దానిమీద వాటికి హక్కు ఉంది. ప్రతీ రోజు వాటికి ఆహారం లభించి తీరాలి. దేశంలోని ప్రతీ నగరంలోను క్రుంగి కృశించే పశువులకోసం, కుంటివైన గుడ్డివైన గుర్రాలకోసం, ఆవులు, కుక్కలు, పిల్లులు మొదలైన జంతువులకోసం వైద్యశాలలు నిర్మించబడాలి. వాటికి అందులో తగిన ఆహార రక్షణ వ్యవస్థలు జరిగి తీరాలి.

తరువాత గమనించవలసిన విషయం కల్యాణం — పవిత్రత. ఇది సత్యబంధురమైనది. ఎవడు సత్యసందీప్త చరిత్రుడో అతడిపట్లసత్యనారాయణస్వామి ప్రసన్నుడవుతాడు. మనిషి త్రికరణశుద్ధి గా సత్యసంధుడై ఉండాలి. ఆలోచనలో, వాక్కులో, క్రియలో అతడు సత్యవంతుడై ఉండాలి. తరువాత గమనించదగ్గ విషయం ఆర్జ వం — ఋజువర్తనం, న్యాయపరాయణత. కుత్సితభావాలకు, మోసానికి హృదయంలో తావు ఇవ్వకూడదు. మనిషి సరళస్వభావుడై ఉండాలి. కాస్త కటువుగా కనబడినా, ఋజుమార్గంలోనే ముందంజ వేయండి; పెడదారిన కాలు పెట్టవద్దు.

అందరిపట్లా దయ కనబరచండి. మనోవాక్కాయాలతో జీవిని హింసించవద్దు . దానం అభ్యసించండి. దానాన్ని మించిన దొడ్డగుణం ఏదీలేదు. దేనినైనా గ్రహించడానికి చేయిచాపేవాడు మనుష్యుల్లో నికృష్ట స్థా నంలో నిలబడేవాడు. ఇతరులకు ఇవ్వడానికై చేయిచాపేవాడు మనుష్యుల్లోమహోత్కృష్ట స్థా నం అలంకరించేవాడు. అనవరతం ఇవ్వడం కోసమే చేయి రూపొందివుంది. మీరు ఆకలితో బాధపడుతున్నా మీ వద్దవున్న చివరి కబళం వరకు పరులకు ఇచ్చివేయండి. ఇతరులకు ఇచ్చేసి మీరు క్షుద్బాధవల్ల ఆత్మార్పణ చేసుకొంటే, క్షణంలో ముక్తి మీకు కరకంకణమవుతుంది; ఇలా చేసిన మంగళ ముహూర్తంలో మీకు పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది, సమగ్ర దైవసంపద మీదవుతుంది. సంతానం గలవారు

బద్ధులై ఉన్నారు. దేనినీ వారు అర్పించలేరు. వారు సంతాన సుఖాన్ని కాంక్షిస్తారు. ఈ ఉద్దేశ సిద్ధికోసం వారు కాలాన్ని వెచ్చించి తీరాలి. లోకంలో బిడ్డలకు కొదువ ఉందా? "నాకొక బిడ్డకావాలి" అనుకోవడం స్వార్థ పరత్వం కాదా?

గమనార్హమైన తరువాతి విషయం అనవసాదం, ప్రమోదం. నైరాశ్యం ఏమైనా గావచ్చునుగాని అది మతం మాత్రం కాబోదు. అనవరతం సంతోషసంభరిత స్వాంతుడైన వ్యక్తి మందస్మిత వదనుడై ఉండేవాడు ఈశ్వరుడికి సన్నిహితుడు కాగలడు. ప్రార్థనకంటే ప్రమోదమే అవలీలగా మానవుణ్ణి జగదీశుడి చరణాల చెంత చేరుస్తుంది. ఉత్సాహరహితాలై, నైరాశ్యసంభరితాలైన మనస్సులు ఎలా ప్రేమించగలవు? ఇలాంటి మనస్సులున్నవారు అనురాగాన్ని గురించి ప్రసంగిస్తే, వారు అబద్ధమే చెబుతున్నారని గ్రహించండి. వారు ఇతరుల మనస్సులను హింసిస్తారు. మతంమీద అతిశయానురక్తిని ప్రకటించేవారిని గురించి యోచించండి. వారు గంభీర వదనాలను ప్రదర్శిస్తారు. మాటల్లోను, చేతల్లోను ఇతరులతో కలహించడమే వారి మతం. వారి ధర్మం అంతా దీన్లోనే ఇమిడివుంది. ఇదివరలో వారు ఏం చేశారో, స్వేచ్ఛ కలిగిస్తే వారిప్పుడు ఏం చేస్తారో యోచించండి. అధికారం చేజిక్కితే సమస్త భూమండలాన్ని రేపు వారు రక్తపుటేరులు పారిస్తారు. అధికారాన్ని ఆరాధించి, వికృతవైఖరులు ప్రదర్శించి హృదయం నుంచి అనురాగాన్ని, అనుకంపను వారు పూర్తిగా నిర్వాసితం ఒనరుస్తారు. కాబట్టిహతాశులైనవారు ఈశ్వరుడికి దూరస్థు లై ఉంటారు. "నేను దుర్దశకు గురైపోయాను – నా బతుకు వమ్మైపోయింది" అని అనుకోవడం మతం కాదు – పైగా ఇది నిరాశావాది ప్రవర్తనమే అవుతుంది. మానవుడై పుట్టిన ప్రతి వ్యక్తీ వహించవలసిన భారం కొంత ఉండనేవుంది. దుర్దశ మిమ్మల్ని వెంటాడితే, దాన్ని అణచడానికై ప్రయత్నించండి; సుఖించడానికై ప్రయత్నించండి.

భగవంతుడు బలహీనులకు అందుబాటులో ఉండడు. ఎన్నడూ మీరు అలా ఉండవద్దు. మీరు శక్తిసమన్వితులై ఉండాలి. మీలో అనంత శక్తి ఉంది సుమా! ఈ శక్తిలేకుండా దేన్నిగాని మీరెలా జయించగలరు? ఈ శక్తి లేనిదే మీరు ఈశ్వరుడికెలా సన్నిహితులు కాగలరు? హద్దు మించిన ప్రమోదానికి మీ అంతరంగంలో చోటు ఇవ్వవద్దు సుమా! ఈ స్థితిలోవున్న మానసం ఎన్నడూ శాంతి పొందలేదు. అది ఇందందు ఉరుకులెత్తుతూనే ఉంటుంది. దుఃఖం అమిత ప్రమోదాన్ని అనుసరిస్తూనే ఉంటుంది. కన్నీళ్ళకూ, నవ్వులకూ చాలాదగ్గరి సంబంధం ఉంది. ఒక చరమపంథా నుంచి వేరొక చరమపంథాకు జనం తరచూ ఉరుకులెత్తుతూంటారు. మనస్సు సంతోషసంభరితమై ఉండాలి, శాంతి బంధురమై ఉండాలి. మనస్సును అవధులు దాటిపోనీయవద్దు. దారుణ క్రియను ప్రతిక్రియ అనుసరించే ఉంటుంది.

శ్రీరామానుజుల సిద్ధాంతం ప్రకారం భక్తి సముపార్జనలో ఇవి ప్రాథమికాంశాలని మనం గుర్తించాలి.

# భక్తిమార్గంలో తొలి సోపానాలు

భక్తిని నిర్వచించిన తాత్త్వికులు ఈశ్వరునిమీద గాఢానురాగమే భక్తి అన్నారు. భగవంతుణ్ణి మానవుడెందుకు ప్రేమించాలనే ప్రశ్న తలెత్తుతుంది. దీని ప్రత్యుత్తరం ఏమిటో తెలుసుకొంటేనేగాని, దీన్లోని అర్థం హృదయంగమమైతేనేగాని భక్తివిషయం మన ఊహకు అందనే అందదు. మానవజీవితాన్ని గురించి రెండు విభిన్న ఆశయాలు ఉన్నాయి. మనిషి ఏ దేశస్థుడైనా, మతాన్ని గురించి ఎటువంటి ఊహ గలవాడైనా తాను ఆత్మతోకూడిన శరీరమని ఎరుగును. కాని మానవజీవిత గమ్యస్థానాలను గురించి భిన్నాభిప్రాయాలున్నాయి.

పాశ్చాత్యదేశాలలో ప్రజలు సామాన్యంగా శరీరాంశానికి అధిక ప్రాధాన్యతనిస్తారు. భారతదేశంలో భక్తియోగాన్ని గురించి వ్రాసిన తాత్త్వికులు మానవుని ఆత్మవిషయంమీదే ఘనతరదృష్టిని సారించారు. ఈ వ్యత్యాసం ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల ప్రత్యేక విశిష్టతను దృష్టాంతీకరిస్తోంది. సాధారణ భాషావిషయంలో సైతం ఈ విభేదం కనపడుతుంది. ఇంగ్లండులో మరణాన్ని గూర్చి ప్రస్తావించేటప్పుడు "మనుష్యాత్మ నిష్క్రమించింది" అని అంటారు; "శరీరాన్ని విడిచాడు" అని భారతీయులు చెబుతారు. ఒక ఊహమేరకు మానవుడు దేహమని, అతనికొక ఆత్మవుందని గ్రహించవచ్చు; మానవుడు ఆత్మ అని, అతనికొక దేహముందని రెండవ ఊహ ప్రకారం గ్రహించాలి. వీటినుంచి చాలా జటిల సమస్యలు తలెత్తుతాయి. మానవుడు శరీరమే అని, అతనికి ఆత్మ ఉందని తెలిపే ఊహ శరీరానికే ప్రాముఖ్యతనిస్తుంది. ఈ ఊహగల వ్యక్తిని "మానవుడెందుకు జీవిస్తున్నా" దని ప్రశ్నిస్తే, "ఇంద్రియసుఖాలను అనుభవించడాని" కని, "ఐహిక ధన విషయభోగాలను అనుభవించడాని" కని అతడు సమాధానమిస్తాడు. ఐహిక జీవితాన్ని మించిన జీవితం ఉందని తెలిపినా, ఆ విషయాన్ని అతడు పెడచెవిన పెడతాడు. ఇహాన్ని మించినదేమైనా ఉందని కలలోనైనా అతడు విశ్వసించడు. ఇహజీవిత సుఖాలే భావిజీవనంలో అవిరామంగా ఉంటాయని అతడి ఉద్దేశం. ఎల్లకాలం తాను ప్రపంచంలో ఉండలేకపోతున్నందుకు, ఎన్నడో ఇహజగత్తు నుంచి తాను నిష్క్రమింపవలసి వస్తున్నందుకు అతడెంతో దుఃఖిస్తాడు. కాని ఈ జగత్తును విడిచి తానే జగతికి పోవనున్నా, ఇక్కడలాగే అక్కడ కూడా తాను ఉల్లాసవీచికలపై ఉర్రూతలూగవచ్చునని అతడు ఆశిస్తాడు. ఇక్కడలానే దాన్లోకూడా ఇంద్రియ సమన్వితుడై అధిక విషయసుఖాలను మరింత తీవ్రేచ్ఛతో తాను అనుభవింప వచ్చునని అతడు ఆశపడతాడు. ఈ కోరికల సిద్ధి దేవునివల్ల లభిస్తుందని ఊహించి, ఈశ్వరుణ్ణి ఆరాధిస్తాడు. అతడి జీవిత పరమావధి విషయవస్తువులవల్లల భించే సుఖాన్ని అనుభవించడమే. సుదీర్ఘ కాలం ఈ మధురానుభూతిని ప్రసాదించే సర్వశక్తిసంపన్నుడైన దేవుడున్నాడని ఎరిగి, అతడిని ఆ వ్యక్తి ఆరాధిస్తాడు.

భారతీయుడి లక్ష్యం ఈ తీరులో ఉండదు. ఈశ్వరుడే జీవిత పరమావధిగా అతడు ఊహిస్తాడు. భగవంతుడికి అతీతమైనదేదీ లేదని, కొంత ఇంద్రియసుఖానుభూతి ఇక్కడ లభిస్తున్నా, ఘనతర వస్తుసంగ్రహానికే అది నిమిత్తమని అతడి ఉద్దేశం. విషయవాంఛానుభూతి తప్ప పొందదగినదేదీ లేదనుకోవడం ప్రమాదకరం. ఇటువంటి ఊహ భయానకమూ, విధ్వంసక హేతుకమూ అని గ్రహించాలి. ఇంద్రియ సుఖానుభూతి తగ్గేకొద్దీ ఉదాత్త జీవితానుభూతి అధికమవుతుందని దైనందిన జీవితంలో మనం గ్రహిస్తూనే ఉన్నాం. తిండి తినేటప్పుడు కుక్కను తేరిపారచూడండి. అంత ఉబలాటంతో, అంత ఉత్సాహంతో మానవుడెవ్వడూ తన ఆహారాన్ని ఆరగించడు. తింటూంటే పందిని పరిశీలించండి; లొట్టలువేస్తూ తన ఆహారాన్ని అది నమిలిమింగుతుంది. తనకిష్టమైన ఆహారం లభిస్తే స్వర్గం దిగొచ్చి తన పాలబడినట్లుఆ మృగమెంచుతుంది. దేవతలలో సర్వోత్కృష్టపదవిని అలంకరించిన ఇంద్రుడు కూడా వచ్చి తనను పరిశీలిస్తున్నా, ఆ వరాహం తలెత్తి, అతణ్ణి చూడనైనా చూడదు. దాని బతుకంతా దాని ఆహారంలోనే ఉంది. ఆ రీతిగా మెక్కడానికి మానవుడు ఎప్పుడూ జన్మించలేదు. జంతువుల శ్రవణశక్తి, దృష్టిసామర్థ్యం ఎటువంటివో యోచించండి. వాటి ఇంద్రియాలన్నీ విశేషాభివృద్ధిచెందాయి. అవి అనుభవించే ఇంద్రియసుఖం మిక్కుటమైంది; అమితోత్సాహంతో, అమిత సుఖానుభూతితో వాటికి ఇంచుమించుగా పిచ్చిపడుతుంది. నికృష్టస్థితికి దిగేకొద్దీ మానవుడికి ఇంద్రియ సుఖం, విషయవస్తులాలస అధికమవుతూంటాయి.

ఉన్నతస్థితికి పోయేకొద్దీ అతని హేతుశక్తి, ప్రేమశక్తి అధికమవుతూ ఉంటాయి. ఈ మహిత శక్తులు వృద్ధి అయ్యేకొద్దీ , వాటి ఇంద్రియసుఖవాంఛా శక్తి క్షీణిస్తాయి.

ఒక దృష్టాంతాన్ని పరిశీలించండి. కొంతశక్తి మానవుడికి ప్రసాదింపబడిందనుకోండి. ఈ శక్తి శారీరక దార్ఢ్యంకోసంగాని, మానసికాభివృద్ధికోసంగాని, ఆత్మవికాసం కోసంగాని వినియోగం కావాలని ఉద్దేశింపబడింది. ఈ మూడింటిలో దేనికోసంగాని, ఆ శక్తి ఎంత అధికంగా వినియోగపడుతుందో, తక్కినవాటి వృద్ధికై వినియోగపడేటప్పుడు అది అంత తగ్గిపోతుంది. మూర్ఖఅ డవి జాతుల వారికి నాగరిక జాతుల వారికంటే అధికమైన ఇంద్రియ సుఖాలుంటాయి. ఒకజాతి నాగరికత హెచ్చయ్యేకొద్దీ దాని స్నాయునిర్మాణం సున్నితమవుతుందనీ, దానికి స్నాయవిక దౌర్బల్యం కలుగుతుందనీ కాబట్టిశారీరకమైన సత్తువ కొంత సన్నగిల్లు తుందనీ చరిత్రాధ్యయనంవల్లగ్రహించాం.

ఒక అడవిజాతికి నాగరికత ప్రసాదించండి; ఈ దృష్టాంతం ప్రత్యక్షంగా దానిలో దృగ్గోచరమవుతుంది. మరొక అనాగరకజాతి దండెత్తి ఈ జాతిని అణచి విజయధ్వజమెత్తుతుంది. అనాగరకజాతికే అనవరతం శారీరకవిజయం చేకూరుతుంది. ఇంద్రియసుఖాలనే సర్వదా మనం వాంఛిస్తే, మనం అనాగరకస్థితికి, పశువుల నికృష్టస్థి తికి దిగిపోతాం. ఇంద్రియసుఖాలను అధికంగా మక్కువపడే వ్యక్తి, తాను వాస్తవంగా ఏది అభిలషిస్తున్నాడో ఎరుగడు పాపం. తన కోరిక ఫలిస్తే తాను అధమమైన పశుపరిస్థితికి దిగిపడిపోతాడని పాపం ఆ జీవి ఎరుగడు.

విషయ సుఖసంభరిత స్వర్గం కావాలని కాంక్షించేవారికి ఎటువంటి గతిపడుతుందో నొక్కి చెప్పక్కర్లేదు. ఇంద్రియ పంకిలంలో పొర్లాడే వరాహాలు వారు. తాము పొర్లాడే బురదను దాటి ఆవలికి వారిచూపు పోలేదు. వారు వాంఛించినది ఈ సుఖమే. ఈ సుఖం పోతే, స్వర్గమే ఒడినుంచి జారిపడిందని వారు విలపిస్తారు. భక్తి శబ్దంలోని ఉదాత్తభావాన్నిబట్టి వారి ప్రవర్తనని పరిశీలిస్తే వారు భక్తులు కానేకారని, ఎప్పుడూ కాలేరని దేవునిపట్ల వారికి నిజమైనభక్తి అలవడదని గ్రహిస్తాం. అయినా కాలక్రమాన వారి కళ్ళుకూడా తెరువబడతాయి. కొంతకాలం ఈ నికృష్టస్థి తిలో వారు అల్లాడినా వారికి సముచిత మానసిక పరివర్తనం కలిగే సమయం వస్తుంది. తాను ఇదివరకు కనీ వినీ ఎరుగని మహత్తరస్థితి ఒకటి ఉందని అభాగ్యుడైవున్న వ్యక్తి గ్రహించవచ్చు. అతనికి అప్పుడు విషయవాంఛలమీద ప్రీతి, ఇంద్రియ సుఖాలమీద మక్కువ క్రమక్రమంగా సమసిపోతాయి.

నేను బడిలో చదువుకొనే పిల్లవాడినై ఉన్నప్పుడు తోటివిద్యార్థితో మిఠాయికై పోరాడాను. అతను నాకంటే బాలాఢ్యుడై ఉండటంవల్ల నాచేతిలోని మిఠాయిని లాగుకొని పోయాడు. అప్పుడు నా మనస్సులో ఎటువంటి ఉద్రేకం రేకెత్తిందో నాకిప్పటికీ గుర్తుంది. ప్రపంచంలో పుట్టిన పిల్లలందరిలో అతడు పరమదుష్టుడని రానురాను నాకు సత్తువ చేకూరేకొద్దీవాణ్ణి పీడించి తీరతానని, వాడి దౌష్ట్యానికి తగిన దండన లేనేలేదని నేను అప్పుడు అనుకొనేవాణ్ణి. అతడు, నేను ఇప్పుడు బాల్యావస్థనుంచి దాటి పెద్దలమయ్యాం. మేమిప్పుడు గాఢానురాగంతో స్నేహితులమయ్యాం. ఈ ప్రపంచమంతా పసికూనలతో పూర్ణమైవుంది. తినడం, తాగడం వారికి పరిపాటైపోయింది. మిఠాయి దినుసులు, చిన్నరొట్టెలు వారికి సర్వస్వాలు. ఈ రొట్టెల గురించి, మిఠాయిల గురించి వారు కలలు కంటారు. ఈ తినుబండారాలు ఎందులో సమృద్ధిగా లభిస్తాయో అందులోనే తమ భావిజీవిత నిర్వహణం కావాలని వారు గ్రుక్కిళ్ళు మ్రింగుతారు. అమెరికన్ ఇండియన్ దృక్పథమేదో గమనించి చూడండి. వేటకై ఉపకరించే చక్కని నేలమీద తన భావిజీవితం గడపాలని అతడు మక్కువపడతాడు. మనలో ఒక్కొక్కరికి మనం అభిలషించే ప్రత్యేక స్వర్గం గురించిన భావన ఉంది. వయస్సు మళ్ళేకొద్దీ, కాలం గడిచేకొద్దీ ఉన్నత విషయాలపై ఉదాత్త వస్తువులపై మన చూపులు వాలుతాయి. సముజ్జ్వల జ్ఞానమరీచికాగుచ్ఛం లోచన గోచరమౌతుంది. కానీ ఆధునికయుగంలో సర్వసామాన్య మార్గాన్ని అనుసరించి దేన్నీ విశ్వసించక భావిజీవిత ఊహలను మనం తోసిరాజనరాదు. ఈ పద్ధతి సర్వనాశన హేతువవుతుంది. ప్రతీ వస్తువునీ వినాశనంచేసే అజ్ఞేయవాది పని దోషభూయిష్టమైంది. భక్తుని చూపు ఉన్నతభావనావీథుల్లో వాలుతుంది. అజ్ఞే యవాది స్వర్గమే లేదని నమ్ముతాడు. కాబట్టి అతడికి స్వర్గం అక్కర్లేదు. భక్తుడికీ స్వర్గం అక్కర్లేదు – ఎందుకంటే స్వర్గానికై తహతహలాడటం పసివాడి ఆటకంటే ఉన్నతమైంది కాదని అతని విశ్వాసం. అతని దృష్టిపడింది ఈశ్వరునిమీద. అతడు అభిలషించింది ఈశ్వర సాక్షాత్కారం.

ఈశ్వరునికంటే మహత్తరమైన ఆదర్శం ఏముంటుంది? భగవంతుడే మానవుడి మహోత్కృష్టమైన లక్ష్యం. అతణ్ణి వీక్షించి ఆనందానుభూతిని పొందుతాం. ఈశ్వరుణ్ణి మించినదేదీ మనం ఊహించలేం. ఎందుకంటే భగవంతుడు

పరిపూర్ణుడు. అనురాగానందాన్ని మించిన దాన్ని మనం ఊహించలేం. కాని అనురాగానికి అనేకార్థాలున్నాయి. ఈ సందర్భంలో అనురాగం అన్నప్పుడు అది సామాన్య ప్రాపంచిక స్వార్థానురాగం కాదు. దీన్ని అనురాగమనడం ఈశ్వరనింద చేయడమే. భార్యాపుత్రాదులమీద మనం చూపే అనురాగం పశుప్రవృత్తికి సంబంధించిందే. నిస్వార్థప్రేమే భక్తితత్త్వము నిజమైన ప్రేమ — ఇది ఈశ్వరునిమీద చూపబడే ప్రేమ. ఈ ప్రేమను పొందడం చాలా కష్టం. శిశువాత్సల్యం, పితృప్రేమ, మాతృప్రీతి మొదలైన వివిధ అనురాగానుభూతుల్ని మనం పొందుతున్నాం. మెల్లగా మనం ప్రేమశక్తిని అలవరచుకొంటాం. కానీ మనలో ఎంతో మందికి ఇది అలవడనే అలవడదు. ఒక అడుగు వేసినా నిలిచిపోతాం. ఒక వ్యక్తిమీద అనురక్తి కలిగి బద్ధులమై ఉంటాం. ఇహజగత్తులో మానవులు భార్యలకోసం, ధనంకోసం, కీర్తికోసం ప్రాకులాడుతూంటారు. ఒక్కోసారి వారి తలకు గట్టిదెబ్బ తగలొచ్చు; బొప్పికట్టొచ్చు. వాస్తవంగా ఈ ప్రపంచం ఏమిటో వారు అప్పుడు గుర్తుంచుకోగలరు. ఈశ్వరుని తప్ప లోకంలో ఎవ్వరూ దేనిమీద నిజమైన అనురాగం చూపలేరు. మానవ సులభానురాగం కేవలం అప్రకృతమనీ యథార్థంకాదనీ మానవుడు గుర్తిస్తాడు. ప్రేమను గురించి పెద్దకబుర్లు చెప్పేవారున్నారు; కాని మానవులు ప్రేమించనేలేరు. భార్య భర్తనుద్దేశించి "ప్రాణేశ్వరా! మీరంటే నాకు చాలా ఇష్టం" అని అతని చెక్కిలిని ముద్దాడుతుంది. కాని అతడు అంతిమశ్వాస విడిచిన తర్వాత, ఆమె ఆలోచించే మొదటి విషయం బ్యాంకులో అతడెంత నిల్వచేశాడనీ, మర్నాడు తాను దేన్నిబట్టినడవాలనీ ఆమె యోచిస్తుంది. "ప్రేయసీ!" అని భర్త భార్యను లాలిస్తాడు. కాని ఆమె వ్యాధిగ్రస్థ యైనప్పుడు, ఆమె అందచందాలు అస్తమించినప్పుడు, లేక వికృతరూపంతో ఆమె ప్రత్యక్షమైనప్పుడు, లేక ఏదో తప్పు చేసినప్పుడు ఆమెమీద అతనికున్న అనురాగం సన్నగిల్లుతుంది; శ్రద్ధ కుంటుపడుతుంది. ప్రాపంచిక ప్రేమంతా కేవలం వంచన; వట్టి మిథ్య.

సంకుచిత వ్యక్తిత్వం కలవాడు ప్రేమించలేడు. అవధులలో ఇమిడింది, పరిమితమైనది ప్రేమించబడలేదు. మానవుని ప్రేమను ఆకర్షించే వ్యక్తిగాని, వస్తువుగాని గతిస్తూండగా అతని వయస్సు క్రమక్రమంగా ముదురుతుండగా జగత్తులో తరగని ప్రేమ ఉంటుందని ఎలా ఆశపడగలడు? భగవంతుడిలో తప్ప సత్యప్రదీప్తమైన ప్రేమే లేదు. ఇక నీ చిల్లరప్రేమతో కొరగాని అనురాగ వ్యక్తీకరణాలతో పనేముంది? ఇవి కేవలం సోపానాలు మాత్రమే. మనల్ని ముందుకు నడిపించే శక్తి ఒకటుంది. అసలు వస్తువును ఎందుకు కనుగొనాలో మనకు తెలియదు. కాని ఈ ప్రేమశక్తి దాన్ని అన్వేషించడానికై మనల్ని ముందుకు పురికొల్పుతోంది. మాటిమాటికి మనం మన పొరపాటును గుర్తిస్తాం. ఏదో ఒకదాన్ని మనం చేపడతాం; అది మన వేళ్ళనుంచి దిగజారడం చూస్తాం. అప్పుడు ఇంకొక వస్తువును చేపడతాం. ఈ విధంగా మన కథ నడుస్తూంటుంది. మనం అడుగులు వేస్తూంటాం. చివరికి మనం కళ్ళు తెరుస్తాం; వెలుగు గోచరిస్తుంది. ప్రేమను చూపించే ఒక్కరిని — జగదీశుని చివరికి చేరుతాం. ఈశ్వరుని ప్రేమలో మార్పుండదు. అది మనల్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉంటుంది. మీలో ఎవరికైనా నేను హాని తలపెడితే ఎంతకాలం మీరు ఓర్వగలరు? ఎవడి మనస్సులో రాగద్వేషాలు ఈర్ష్యాది దుర్గుణాలు ఉండవో, ఎవడు ఎప్పుడు మానసిక సహనశాంతుల్ని క్షణమైనా సడలనివ్వడో, ఎవ్వడు జననమరణాలకు అతీతుడో అతడు ఎవడై ఉంటాడు? అతడు ఈశ్వరుడుకాక మరెవరు? కాని ఈశ్వరుణ్ణిచేరడానికి అవలంబించాల్సిన మార్గ ం సుదీర్ఘమైంది; కష్టభూయిష్టమైంది. కొందరు మాత్రమే అతణ్ణి పొందగలరు. మనమందరం ప్రాకులాడే పసిపిల్ల లం. మానవుల్లో చాలామంది మతంతో వ్యాపారం చేస్తారు. ఒక శతాబ్దంలో ఏ కొందరు మాత్రమే నిజమైన ఈశ్వరప్రేమను పొందగలరు. వారివల్లదేశం యావత్తూ ధన్యమౌతుంది; పునీతమౌతుంది. ఈశ్వరపుత్రుడొకడు గోచరిస్తే దేశమంతా పవిత్రమౌతుంది. ఏ శతాబ్దంలోనైనా ఈ జగత్తులో ఇటువంటివారు కొంతమంది జన్మిస్తూంటారు. కాని అందరూ అటువంటి ఈశ్వరప్రేమను పొందడానికి ప్రయత్నించాలి. మీరో లేక నేనో దాన్ని పొందవచ్చు! ఎవరికి తెలుసు! కాబట్టి ఈ ఉదార ఆశయసిద్ధి కై శక్తివంచనలేక ప్రయత్నిద్దాం గాక!

భార్య భర్తను ప్రేమిస్తుందంటాం. ఆమె ఆత్మంతా ఆమె అనురాగంలో విశిష్టమైందని, ఆమె వ్యక్తిత్వమంతా భర్తలో కలిసిపోయిందని యోచిస్తాం. కొంతకాలం తర్వాత ఆమెకు ఒక బిడ్డ పుడితే సగమో, సగంకంటే ఎక్కువగానో ఆమె అనురాగం బిడ్డకు పోతుంది. తానిదివరకు తన భర్తమీద చూపుతున్న ప్రేమ తగ్గిందని ఆమే స్వానుభూతివల్ల గ్రహిస్తుంది. తండ్రి విషయంలోకూడ అంతే. విశేష ప్రేమాస్పదులైన వ్యక్తుల సంఖ్య పెరిగేకొద్దీ ముందున్న అనురాగం గతిస్తుందని మనమే

మన జీవితానుభవంలో గ్రహించగలం. పాఠశాలలో చదివే పిల్లలు, తోటి పిల్లల్లో కొందరు జీవితంలో తమకు అత్యంత ప్రీతిపాత్రులని ఊహిస్తారు. తల్లిదండ్రులపట్లకూడ అలాగే తలుస్తారు. కొంతకాలం గడిచిన తర్వాత భార్య లేక భర్త రావడం జరుగుతుంది. వెంటనే ముందున్న అనురాగం సమసిపోతుంది. కొత్తప్రేమ అంకురించి, పెరుగుతుంది. తొలుత ఒక నక్షత్రం ఉదయిస్తుంది; తర్వాత అంతకంటే పెద్దదైన నక్షత్రం గోచరిస్తుంది. దాని తర్వాత అంతకంటే పెద్ద నక్షత్రం దృగ్గోచరమౌతుంది; కాలక్రమాన సూర్యుడు ఉదయిస్తాడు. అప్పుడు తక్కువ కాంతులన్నీ అదశ్యమౌతాయి. సూర్యుడు భగవంతుడు. చుక్కలు కొద్దిపాటి ప్రేమ లోకాన్ని చూపించేవే. మహోజ్జ్వల సూర్యతేజస్సు ఒక వ్యక్తిపై ప్రసరించినప్పుడు అతడు ఉన్మత్తుడౌతాడు; ఎమర్సన్ మాటల్లో "ఈశ్వరోన్మాదు" డవుతాడు. మానవుడు మాధవుడవుతాడు. సమస్తం ఆ ప్రేమసాగరంలో లీనమైపోతుంది. సామాన్యానురాగం వట్టి పశుప్రీతి మాత్రమే! లేకపోతే స్త్రీ పురుష జాతుల్లో వ్యత్యాసం ఎందుకుండాలి? ఒకరు విగ్రహంముందు సాగిలపడితే, అది భయంకర ప్రతిమోపాసన అవుతుంది. కాని ఒకామె భర్తముందు, ఒకడు భార్యముందు మోకరిల్లితే అది సర్వాంగీకారం పొందుతుంది.

ప్రపంచంలో మనకు ప్రేమయొక్క ఎన్నో దశలు గోచరిస్తున్నాయి. మొదట మార్గం సుగమం చెయ్యాలి. మన జీవన దృక్పథంపై ప్రేమ సిద్ధాంతం ఆధారపడి ఉంటుంది. ఈ ప్రపంచమే మన జీవిత పరమాదర్శమని భావించడం పాశవిక ప్రవృత్తే అవుతుంది. ఈ ఆశయం అథఃపతనానికి హేతువవుతుంది. ఏ వ్యక్తి అయినా ఈ ఊహతో జీవిత పథంలో అడుగిడితే అతడు అధోగతిపాలవుతాడు. అతడు ఎప్పుడూ ఉన్నతస్థితి చేరలేడు. పరలోకజ్యోతిని అతడు వీక్షించలేడు. అనవరతం అతడు ఇంద్రియాలకు బానిసైవుంటాడు. మెక్కడానికి కొన్ని రొట్టెలను తెచ్చిపెట్టే నాణాన్ని సంపాదించడానికి అతడు నడుం బిగించి ఉరకలెత్తుతాడు. ఈ విధంగా బతుకీడ్చడంకంటే చావడం ఉత్తమం. ఈ పుడమికి బానిసలమైన, ఇంద్రియాలకు దాసులమైన మనం ఈ నికృష్టస్థితినుంచి లేద్దాం; ఇంద్రియసుఖం కాంక్షించే ఈ జీవితంకంటే ఉదాత్తమైంది ఉంది. అఖండ అనంతపరమాత్మ తన కళ్ళకు, తన ముక్కుకు, తన చెవులకు బానిసవడానికి జన్మించాడని మీరు ఊహిస్తారా? సర్వాన్ని చేయగల ఆత్మవుంది. అనంత, అఖండ, సర్వజ్ఞాత్మ ఉంది; ప్రతీ శృంఖలాన్ని ఛేదించండి. ఈ ఆత్మ మనమే అని గుర్తించండి; ప్రేమ ద్వారా మనకు ఆ శక్తి లభిస్తుంది. ఇది మనం గుర్తుంచుకోవలసిన సర్వోత్తమ ఆదర్శం. ఈ ఆదర్శసిద్ధి ఒక్కరోజులో పొందలేం. ఇది మన చేతుల్లో నే ఉందని కల్పన చేసుకోవచ్చు; కాని ఇదొక కల్పన మాత్రమే! ఈ లక్ష్యం మనకెంతో సుదూరం. మనిషి ఎక్కడ నిలిచి ఉన్నాడో పరిశీలించి, అతడు అగ్రేసరుడవటానికి తోడ్పడాలి. మనిషి జడవాదంలో నిలిచివున్నాడు. మీరు, నేను జడవాదులమే. ఈశ్వరుని గురించి, ఆత్మను గురించి, పరమాత్మను గురించి మనం ఎక్కువగా మాట్లాడుతూంటాం. ఇది మంచిదే కావచ్చు. ఈ రీతిగా ప్రసంగించడం మన సమాజంలో ఒక ఆచారమైంది. చిలకపలుకులనన్నిటినీ నేర్చుకొన్నాం; వీటినే మాటిమాటికి ఉచ్చరిస్తాం. మనం ఎందులో నిలిచామో తెలుసుకొని, జడవాదులమై ఉన్నట్లు గుర్తుంచుకొని, జడం యొక్క చేయూతను పొంది, యథార్థ మైన ఆధ్యాత్మికవాదులమయ్యే వరకు మెల్లగా సాగి, మనమే ఆత్మ అనే అనుభూతిని పొంది, ఆత్మను అవగతం చేసుకొని, అనంతమైందని మనం భావించే ఈ ప్రపంచం, అంతరంగ ప్రపంచపు బాహ్యాకరణం మాత్రమే అని గుర్తిద్దాం గాక!

మన దృష్టిని ఆకర్షించవలసిన విశేషం ఇంకొకటి ఉంది. బైబిల్లో "గిరిమీది ధర్మోపదేశం" లో మీరీ వాక్కులను చదివివుంటారు: "అడుగు, నీకది ఇవ్వబడుతుంది; వెతుకు, నువ్వు దాన్ని కనుగొంటావు; తట్టు, నీకోసం తెరవబడుతుంది." చిక్కేమిటంటే, వెతికేవారెవరు? కావలసింది ఎవరికి? ఈశ్వరుణ్ణి గురించి తెలుసని మనమందరం చెబుతూంటాం. భగవంతుడు లేడని రుజువు చేయడానికి ఒకడు పుస్తకం రాస్తాడు. అతడున్నాడని రూఢిచేయటం తన ఆజన్మ కర్తవ్యమని ఒక వ్యక్తి తలుస్తాడు. వేరొకడి బుద్ధి ప్రతికూలంగా ఉంటుంది. దేవుడు లేడని మానవుడికి బోధించడానికి అతడు పలుచోట్ల సంచరిస్తాడు. భగవంతుడున్నాడనిగాని, లేడనిగాని రూఢిచేయటానికి ఒక పుస్తకాన్ని వ్రాయడంవల్ల కలిగే ప్రయోజనమేమిటి? "భగవంతుడు ఉంటే ఏం? లేకుంటే ఏం?" చాలామంది ఈ ప్రశ్నలమీద దృష్టిసారింపరు. మనుషుల్లో చాలామంది యంత్రాల్లా పనిచేస్తూంటారు. వీరికి ఈశ్వరుణ్ణి గురించి చింతేలేదు. భగవంతుణ్ణి గురించి అక్కర్లే దని వారు భావిస్తారు. ఇదిలావుండగ్గా ఒకరోజు మృత్యుదేవత సాక్షాత్కరించి "కదలిరా" అంటుంది. "కొంచెం ఉండు. నాకు కొంత సమయం కావాలి — మా పిల్లవాడికి ఇంకా కొంత వయస్సు రావాలి" అని మనిషి మృత్యుదేవతను ఉద్దేశించి పలుకుతాడు.

"వెంటనే రా!" అని మృత్యువు ఆదేశిస్తుంది. ఈ విధంగా మానవజీవితం గడచిపోతుంది. పాపం ఆ అభాగ్యుడు జాన్ తప్పనిసరిగా పోతాడు. ఆ దౌర్భాగ్యాన్ని గూర్చి ఏమంటాం? భగవంతుడు సర్వోత్కృష్టుడని తెలిపేదాన్ని అతడెప్పుడూ కనుగొనలేదు. బహుశా పూర్వజన్మలో అతడు వరాహమై ఉండొచ్చు. మానవుడై జన్మించి పైమెట్టుకు ఎక్కాడు. కాని కొంతమందికి కొంచెం మెలుకువ వస్తుంది. ఏదో విపత్తు తలెత్తుతుంది. మనం గాఢంగా ప్రేమించే ఒక వ్యక్తి మరణిస్తాడు. అతనిపై సర్వాత్మను, పంచప్రాణాలను మనం కేంద్రీకరిస్తాం. అతనికోసం మనం ప్రపంచాన్నంతా, మన సోదరుణ్ణికూడ మోసగించి ఉంటాం. మనకు అత్యంత ప్రియమైన ఆ వ్యక్తి అస్తమించడంవల్ల మనపై పెద్ద దెబ్బపడుతుంది. "దీని తర్వాత ఏమిటి?" అనే ధ్వని అంతరంగంనుంచి వినపడుతుంది. ఒక్కొక్కప్పుడు ఆకస్మిక మరణం సంభవిస్తుంది. కాని ఈ విధమైన సంఘటనలు ఎన్నో ఉండవు. వేళ్ళమధ్యనుంచి ఏదో జారినప్పుడు మనలో చాలామంది "తరువాత ఏమిటి?" అని ప్రశ్నిస్తాం. ఇంద్రియాల్ని పట్టుకొని మనం ఎలా ప్రాకులాడుతూంటామో గదా! మునిగేవాడు ఒక గడ్డిపరకను పట్టుకుంటాడని మీరు వినివున్నారు. మొదట ఈ గడ్డిపరకను పట్టుకొని దానివల్ల తనకు సముద్ధరణం కానప్పుడు ఎవరో చేయిజాపి తనను ఉద్ధరించాలని మనిషి ఊహిస్తాడు. కాని మానవులు ఉదాత్తాశయాలను పొందడానికి ముందు ఆంగ్ల నానుడి తెలిపేట్లు 'ఈ ప్రాపంచిక సుఖదుఃఖ ఫలాలను రుచిచూడక వదలిపెట్టరు.'

భక్తి ఒక మతం. మతం అసంఖ్యాకులకు కాదు — అది అసాధ్యం. ఒక విధమైన మోకాటి డ్రిల్లు, గుంజీలు తీయడం చాలామందికి సరిపోవచ్చు. కాని మతం కొంతమందికి మాత్రమే సరిపడుతుంది. ప్రతీ దేశంలో ఏ కొన్ని వందలమందికి మాత్రమే మతాభ్యాసం సుసాధ్యం. అత్యల్పసంఖ్యాకులు మాత్రమే మతాభ్యాసంలో సిద్ధహస్తులుకాగలరు. ఇతరులు అలా కాలేరు. ఎందుకంటే వారు జాగృతిని పొందలేదు; పొందాలనే కోరిక కూడ వారికి లేదు. ఈశ్వరుని కాంక్షించడమే ప్రధాన విషయం. కాని భగవంతుడు తప్ప మనకన్నీ కావాలి. కారణమేమంటే మన సాధారణ వాంఛలన్నీ బాహ్యప్రపంచం ద్వారా పరిపూర్తి అవుతాయి; బాహ్య ప్రపంచం తీర్చగలిగే మన కోర్కెలు నశిస్తేనే ఆంతరంగిక ప్రపంచంనుంచి, భగవంతుణ్ణుంచి వాటిని పొందకోరుతాం. బాహ్యవిశ్వంలో పరిమిత పరిధిలో మన అవసరాలు సంకుచితాలై ఉన్నంతకాలం, భగవదవసరం మనకు ఉండనే ఉండదు. ఇక్కడున్న వాటన్నిటితో మనకు సంపూర్ణ సంతృప్తి కలిగాకనే, అభావపూర్ణానికై గ్రుక్కిళ్ళు మ్రింగుతాం. అవసరం కలిగితేనే సంధానం కలుగుతుంది. సాధ్యమైనంత త్వరలో ప్రపంచంలో ఈ బాల్య కేరింతలు చాలించుకో. అప్పుడే జగత్తును మించినదానికై మీరు తహతహలాడుతారు. అదే మతంలో ప్రథమ సోపానం.

ఈ రోజుల్లో మతంలో ఒక విధంగా పాల్గొనడం ఒక ఫ్యాషన్‌గా మారింది. నా స్నేహితురాలు ఒకామె దైనందిన ఉపయోగానికి కావాలసిన సామాగ్రి అధికంగా ఉంది. జపాన్‌లో తయారైన ఒక వింత కూజాను తన గదిలో ఉంచి దాన్ని ప్రదర్శించడం ఆమెకు చాలా ఇష్టం. వెయ్యి డాలర్లు ఖర్చయినా ఆమె ముద్దు చెల్లి తీరాలి. అలాగే ఆమెకు కొంత మతం అవసరం. ఆ ముద్దుచెల్ల దానికి ఆమె చర్చ్‌లో చేరాలి. భక్తి ఈ రకమైన వ్యక్తులకై ఉద్దేశింపబడలేదు. ఈ ముద్దుముచ్చట్లు ప్రగాఢ కాంక్షలు కావు; ఏది లేకుండా మనం జీవించలేమో అదే ప్రగాఢ కాంక్ష. మనకు ఊపిరి అవసరం; ఆహారం అవసరం; వస్త్రాలు అవసరం. ఇవి లేకపోతే మనం బతకలేం. ఒకడు ఈ లోకంలో ఒకామెను ప్రేమిస్తే, ఆమె లేకపోతే తను జీవించలేడని అనుకొనే ముహూర్తాలు (ఈ తలపు అనుచితం అయినప్పటికీ) ఉండవచ్చు. భర్త మరణిస్తే తన బతుకే ముగిసిందని భార్య అనుకోవచ్చు. కాని ఆమె బతుకీడుస్తూనే ఉంటుంది. ఆవశ్యకతలోని రహస్యమిది. అది లేనిదే మనం జీవించలేం. అది మన చేతుల్లో చిక్కితీరాలి. లేకుంటే చావుమూడటం తథ్యం. ఈశ్వరుణ్ణి గురించి ఈ విధంగా పరితపించే కాలం ఆసన్నమైనప్పుడు, అంటే ప్రపంచ ఆవశ్యకతను మించిన అక్కర ఒకటి తప్పనిసరిగా మనకు కలిగితే, విషయవస్తువులను మించిన అక్కర, ప్రాకృతశక్తులను అధిగమించిన ఆవశ్యకత కలిగినప్పుడు మనం భక్తులం కాగలం. క్షణకాలం కారుమబ్బు తొలగినప్పుడు ఆవలినుంచి అద్భుత ద్యుతి మన దృష్టిలో తళుక్కుమన్నప్పుడు మహత్తర ముహూర్తంలో ఈ క్షుద్రవాంఛలన్నీ సముద్రంలో నీటిబొట్టుకంటే మిన్నలు కావని జ్ఞానోదయం మనకు కలిగినప్పుడు, అటువంటి క్షణాలలో మన బతుకులెంత క్షుద్రాలో గ్రహించగలుగుతాం. మన ఆత్మ అప్పుడు సమధిక వృద్ధిపొందుతుంది; ఈశ్వరసాక్షాత్కారంకోసం తహతహలాడుతాం; అతణ్ణిపొందలేక అది మనజాలదు.

మొదటి విచారణీయాంశం ఇది: మనకు ఏం కావాలి? "మనకు భగవదవసరం ఉందా?" అని ప్రతిరోజూ మనం మనల్ని ప్రశ్నించుకోవాలి. మీరు ప్రపంచంలో గ్రంథాలన్నిటినీ మానసికంగా దిగమింగవచ్చు. మీరు చదవని పుస్తకం ఏదీ లోకంలో లేకపోవచ్చు, కాని పూర్వోక్తావశ్యకత, ఈశ్వరునిపట్ల భక్తి విస్తృత గ్రంథపఠనంవల్ల లభించడం కల్ల . "ప్రవచనా కౌశలానికి, మహోత్కృష్టమేధాశక్తికి ఇది చేకూరదు. వివిధ భౌతికశాస్త్రా లు మీరు ఆకళించుకొన్నా అది దక్కదు. ఈశ్వరుని అవసరం ఎవడికి కలుగుతుందో, అతని అనురాగం వాడికి చిక్కితీరుతుంది. భగవంతుడు వాడికి అర్పితుడౌతాడు".* ప్రణయం పరస్పరమైంది; ప్రతిబింబితమైంది. నామీద మీకు ద్వేషం ఉండవచ్చు. మిమ్మల్ని నేను ప్రేమింపజూసినప్పుడు ఒక్కొక్కసారి మీరు పెడముఖం పెట్టినా పెట్టవచ్చు. కాని ఈ ప్రేమదానంలో వెనుకంజ వేయకుండా అలాగే నేనుంటే ఒక నెలలోనో లేక ఒక సంవత్సరంలోనో మీరు నన్ను ప్రేమించక తప్పదు. ఇది సుప్రసిద్ధమనస్తత్త్వశాస్త్ర దశ్యం — ఆంతరంగిక విషయం. అస్తమించిన భర్తనుగూర్చి ఉదాత్త ప్రేమభరిత హృదయంతో ధర్మపత్ని ఎలా చింతిస్తుందో, అటువంటి ప్రేమోద్వేగంతో మనం జగదీశుని గురించి చింతించాలి. మనకప్పుడు ఈశ్వర సాక్షాత్కారం కలుగుతుంది. సమస్త గ్రంథ సమూహాలుకాని, వివిధ భౌతికశాస్త్రాలుకాని మనకు దీన్ని బోధించలేవు. గ్రంథపఠనంవల్ల మనం చిలుకలమౌతాం. పుస్తకాలు చదవడంవల్ల ఎవరూ విద్వాంసులు కాలేరు. ఒక ప్రేమశబ్దా న్ని మాత్రం మానవుడు పఠిస్తే, తప్పకుండా అతడు విద్వాంసుడౌతాడు. కాబట్టిమొదట మనకు అటువంటి జిజ్ఞా స అలవడాలి.

"భగవంతుడు మనకు కావాలా?" అని ప్రతిరోజూ మనం ప్రశ్నించుకొందాం గాక! మనలను గురించి మనం ప్రసంగించేటప్పుడు ముఖ్యంగా మనమొక ఉన్నతపీఠం నుంచి ఇతరులకు ప్రబోధం చేసేటప్పుడు ఈ విధంగా మనం ప్రశ్నించుకోవాలి. అనేకసార్లు ఈశ్వరుని అక్కర నాకు కనపడదు; అధికాహారమే అవసరమై ఉంటుంది; ఒక రొట్టె ముక్క దొరక్కపోతే నాకు పిచ్చిపడుతుంది; ఒక వజ్రపుసూది లభించకపోతే చాలామంది ఆడవాళ్ళకు పిచ్చిపడుతుంది. కాని భగవంతుని గురించి ఈ విధమైన ఆకాంక్ష వారి హృదయంలో లేదు. విశ్వంలోని ఏకైక సత్యాన్ని వారెరుగరు. "వేటాడితే, ఖడ్గమృగాన్నే వేటాడుతాను; దొంగతనాన్ని చెయ్యదలిస్తే, రాజు ఖజానానే దోస్తాను. బిచ్చగాళ్ళ సంపదను ఎందుకు దొంగిలించాలి; చీమల్ని ఎందుకు వేటాడాలి?" అనే సామెత మా వాఙ్మయంలో ఉంది. కాబట్టిప్రేమించ దలిస్తే, భగవంతుణ్ణే ప్రేమించండి. ఈ ప్రాపంచిక వస్తువులకై ప్రాకులాడేవారెవరు? ప్రపంచం బొత్తిగా మిథ్య అయ్యింది. మహనీయులైన జగద్గురువులందరూ అది తెలుసుకొన్నారు. ఈశ్వరుని వల్లగాని ఇందులోనుంచి నిష్కృతిలేదు. మన జీవితపరమావధి అతడు — మన జీవన గమ్యస్థానం అతడు. ఈ లోకమే మన జీవన పరమలక్ష్యమని తెలిపే భావనలు వినాశకరాలు. ఈ లోకానికి, ఈ దేహానికి కొంత విలువవున్నా ఈ మూల్యం అప్రధానమైంది. ఇది లక్ష్యసిద్ధికి నిమిత్తం మాత్రమే. కాని ప్రపంచమే లక్ష్యం కాకూడదు. దురదృష్టవశాత్తు చాలాసార్లుమనం ప్రపంచాన్ని లక్ష్యంగాను, జగదీశుని నిమిత్తంగాను చేస్తాం. ప్రజలు చర్చ్ కి వెళ్ళి "ప్రభూ! నాకు దీన్నివ్వు, దాన్నివ్వు. భగవంతుడా! నా వ్యాధిని నయంచెయ్యి" అని ప్రార్థిస్తారు. వారికి చక్కని ఆరోగ్యకరాలైన శరీరాలు కావాలి. ఎవరో తమకై వీటిని చేకూరుస్తారని విని వారి వద్దకు వెళ్ళి ప్రార్థిస్తారు. మతాన్ని గురించి ఈ విధమైన ఊహకు మనస్సులో చోటివ్వడంకంటే నాస్తికుడై ఉండటం మేలు. నేను చెప్పినట్లు భక్తే పరమాదర్శం. లక్షలాది సంవత్సరాలు దొర్లిపోవచ్చు. ఈ సుదీర్ఘకాలంలో ఈ పరమాదర్శసిద్ధి కలుగుతుందో కలుగదో చెప్పలేను. కాని అది మహోత్కృష్టమైన లక్ష్యమని మనం మరువరాదు. మహత్తరమైన ఈ ఆశయమే మన ఇంద్రియాల్ని ఆకర్షించాలి. గమ్యస్థానం మనం చేరుకోలేకపోయినా, దానికి దగ్గరవ్వగలం. ఈశ్వరుణ్ణి పొందడానికి ప్రపంచం ద్వారా, ఇంద్రియాల ద్వారా మెల్లమెల్లగా మనం కృషి చేయాలి.

# ఆధ్యాత్మిక బోధకుడు

ప్రతీ ఆత్మకూ పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. ప్రతీ జీవికీ చివరకు ఆ స్థితి లభిస్తుంది. గతంలో మనం ఎలా ఉన్నామో, ఎలా చింతించామో అటువంటి జీవితవిధాన ఫలాన్ని, అటువంటి చింతాఫలాన్ని ఇప్పుడు మనం ఎలా చింతిస్తామో, ఎలా ప్రవర్తిస్తామో దాని ఫలాన్ని భావికాలంలో అనుభవిస్తాం. ఇలా అన్నప్పుడు బాహ్యసహాయాన్ని పొందరాదనడం సబబు కాదు. ఆత్మాభివృద్ధి బాహ్యాన్నుంచి చేకూరే సహాయంవల్ల మరింత త్వరగా జరుగుతుంది. బాహ్యసహకారం అనివార్యమైనదనే విషయం ప్రపంచంలో చాల దృష్టాంతాలవల్ల మనకు అర్థ మౌతుంది. ప్రేరణ ప్రభావం ఆవలినుంచి మన హృదయాలపై హత్తుకుంటుంది. మన అంతరంగంలో గర్భితమైన శక్తులు ఆ వేగ సంస్పర్శాన్ని పొందుతాయి. అప్పుడు అంతరంగికాభివృద్ధి ఆరంభమౌతుంది; ఆధ్యాత్మిక జీవనం ఆవిర్భవిస్తుంది; మనిషి పవిత్రుడై, చివరకు పరిపూర్ణు డౌతాడు. బాహ్యంనుంచి లభించే సునిశిత ప్రేరణశక్తి గ్రంథాలవల్లల భించదు. ఆత్మ ఇటువంటి శక్తిని మరొక ఆత్మనుంచే పొందగలదు; మరేవిధంగాను ఇది సాధ్యంకాదు. ఆజన్మాంతం మనం గ్రంథపఠనం చెయ్యవచ్చు; మనం మహామేధావులం కావచ్చు. కాని మనకు ఆధ్యాత్మికాభివృద్ధి కలుగలేదని కాలక్రమాన గ్రహిస్తాం. మేధాసంపత్తి వృద్ధి అ యినప్పుడు దానితోపాటే ఆధ్యాత్మిక పురోభివృద్ధిఅ యితీరుతుందని తలచరాదు. దురదృష్ట వశాత్తు దానికి విరుద్ధమే తరచూ చూస్తూంటాం. ఆత్మవిభూతిని లోపింపచేసి మేధాశక్తి విశేషాభివృద్ధిని కలిగివుండటం ఇంచుమించు ప్రతిరోజూ దర్శిస్తూంటాం. ఇలాంటి దృష్టాంతాలు అనేకాలు.

మేధావృద్ధికి పుస్తకాల సహాయం మనకు విశేషంగా లభిస్తుంది. కాని ఆధ్యాత్మిక పురోభివృద్ధికి వీటివల్ల కలిగే ప్రయోజనం ఇంచుమించు లేదనే చెప్పాలి. గ్రంథపఠనంవల్ల ఈ విధమైన ప్రయోజనం మనకు ఎంతైనా కలుగుతోందని ఒక్కోసారి మనం అపోహపడుతూంటాం. కాని మనం మన అంతరంగాల్ని పరిశీలించుకొన్నప్పుడు మన మేధాశక్తి వికసించినా ఆత్మశక్తిమాత్రం అలా కాలేదని మనకు తెలుస్తుంది. కాబట్టే ఇంచుమించు మనలో ప్రతివ్యక్తీ ఆధ్యాత్మిక విషయాల గురించి ఎంతో అద్భుతంగా ఉపన్యాసాలు దంచవచ్చు. కాని ఆచరించవలసిన సమయం ఆసన్నమైనప్పుడు మన క్రియాశక్తి చాలా శోచనీయమై ఉందని గుర్తిస్తాం. బాహ్యం నుంచి రావలసిన అనివార్యప్రేరణశక్తి పుస్తకాలనుంచి రాకపోవడమే దీనికి కారణం. సముచిత ఆధ్యాత్మిక హృదయజాగృతి ఒక మహత్తర ఆత్మనుంచే కలుగుతుంది.

ఈ అంతరంగిక జాగృతి కలిగించేవాడు మహాత్ముడు. ఇతడు గురువు. ఆధ్యాత్మిక ప్రేరణను పొందేవాడు శిష్యుడు. ఈ ప్రేరణ శక్తిని ప్రసాదించే శక్తి గురువుకి ఎంత అవసరమో, దాన్ని గ్రహించేవాడికి గ్రహణశక్తికూడ అంతే అవసరం. విత్తనం సజీవమై ఉండాలి; పొలం దున్నడానికి తయారైవుండాలి. ఈ రెండు నియమాలు ఎప్పుడు కలుస్తాయో అప్పుడు మతం అద్భుతాభివృద్ధి చెందుతుంది. "మతబోధకుడు మహనీయుడై ఉండాలి; శిష్యుడూ అలాంటివాడై ఉండాలి; చెప్పేవాడు ఆశ్చర్యాన్ని కలిగించేవాడై ఉండాలి; శిష్యుడు కుశలుడై ఉండాలి." గురుశిష్యులిద్దరూ అసాధారణ ప్రజ్ఞావంతులైనప్పుడే ప్రశంసనీయమైన ఆధ్యాత్మిక పురోభివృద్ధి సుసాధ్యమౌతుంది. వారు అలాంటివారు కాకుంటే, ఈ ఆశయం సిద్ధి ంచదు. అటువంటివారే యథార్థగురుశిష్యులు. బద్ధ కంకణులుకాక ఆధ్యాత్మికంగా కొంత కాలక్షేపం చేసేవారు కొందరున్నారు. ఈ విషయాల్లో వీరికి కొంత ప్రసక్తి ఉంటుంది. ధార్మిక దిగ్వలయపు అంచుపైనే వారు నిలుస్తారు. అయినా దాన్లో నూ కొంత విలువ ఉంది. మతాన్ని గురించి కొంత దాహం వీటివల్ల కలుగవచ్చు. కాలక్రమాన కొంత మేలు చేకూరుతుంది. క్షేత్రం సిద్ధమైనప్పుడు అందులో బీజం పడితీరాలి. శిష్యుడు జిజ్ఞాసువై, జ్ఞానపిపాసువై ఉపదేశానికై తహతహలాడేటప్పుడు ప్రజ్ఞానవంతుడైన ధర్మబోధకుడు సాక్షాత్కరించి తీరాలి — ఇది మర్మమైన ప్రకృతి సూత్రం. "అన్వేషి అయిన పాపి అన్వేషి అయిన ఉద్ధారకుడిని కనుగొంటాడు." గ్రహించేవాటి ఆకర్షణ శక్తి పరిపూర్ణపరిణతిని పొందినప్పుడు దానికి చరితార్థ తను చేకూర్చే శక్తి ప్రత్యక్షమై తీరాలి.

కాని ఈ మార్గం తీవ్రప్రమాదాలతో కూడుకొనివుంది. ఉపదేశాన్ని గ్రహించదలచేవాడు యథార్థమైన ఆధ్యాత్మిక తృష్ణను తెలుసుకోక క్షణికావేశంతో ముందుకు ఉరకవచ్చు. మనలో ఇది కనపడుతోంది. మనం గాఢంగా ప్రేమించిన ఒక వ్యక్తి మరణించవచ్చు. ఇటువంటి విపత్తు తరచూ మనల్ని ఎదుర్కొంటూనే ఉంటుంది. తీవ్రమైన దెబ్బతిని, క్షణకాలం

ప్రపంచమంతా మన వేళ్ళనుంచి జారిపోతుందని హడలుతాం. అప్పుడు మన దృష్టి ఊర్ధ్వదిక్కుగా సారింపబడుతుంది. ఆధ్యాత్మిక జీవనం గడుపుదామనుకొంటాం. కొన్నిరోజుల్లో ఈ పొంగు చల్లా రుతుంది. ఎగసివచ్చిన కెరటం సమసిపోయి, మళ్ళీ వెనుకటి స్థితిలో మనం అల్లాడుతుంటాం. తాత్కాలిక ఉద్రేకమే ఆధ్యాత్మిక తృష్ణఅని మనం తరచూ భ్రమిస్తుంటాం; ఈ భ్రమ ఉన్నంతకాలం యథార్థమైన జిజ్ఞాస అలవడనే అలవడదు. ధర్మబోధచేసే మహాత్ముడు మనకు గోచరింపడు.

మనకు సత్యసాక్షాత్కారం కాలేదని మొరపెట్టుకొంటూంటాం. ఇలా మొరపెట్టుకోవడంకంటే మన హృదయాలను పరిశీలించుకోవడం మన ప్రధాన కర్తవ్యం. యథార్థమైన జిజ్ఞాసానలం మనలో రగుల్కొంటా? అని మనం ప్రశ్నించుకోవాలి. అప్పుడు మనలో చాలామందిలో ఈ జిజ్ఞాస కొరవడిందని, సత్యసాక్షాత్కారానికి మనిరి అర్హులం కామని గుర్తిస్తాం.

ఈ చిక్కు శిష్యుల్లో మాత్రమే కాక గురువులలో సైతం తల ఎత్తుతోంది. గురువులను ఇది మరింతగా ఎదుర్కొంటోంది. అజ్ఞాన పంకిలంలో దిగబడివున్నా, తాము సర్వజ్ఞులమని అనేకులు గర్విస్తూంటారు. అంతటితో వారు ఊరుకోరు. తమ భుజాలమీద ఇతరులను ఎక్కించుకోవడానికై వారు సిద్ధపడుతూంటారు. “ఒక గుడ్డివాడు మరో గుడ్డివాడికి మార్గదర్శకుడైనప్పుడు, ఇద్దరూ గోతిలో పడిపోతారు” అనే నానుడి నిజమౌతుంది. ఈ రీతి వ్యక్తులతో ప్రపంచమంతా నిండిపోయివుంది. తాను ఆచార్యుడు కావాలని ప్రతివ్యక్తీ ఉబలాటపడుతూంటాడు. పది లక్షల డాలర్లను ప్రతి భిక్షుకుడు కానుక చేయాలని పెద్ద కబుర్లు చెబుతూంటాడు. ఇదెంత హాస్యాస్పదమైన విషయమో అదీ అంత హాస్యాస్పదమైన విషయమవుతుంది. ఈ భిక్షుకులూ, ఆ గురువులూ సహాధ్యాయులే!

ఈ పరిస్థితిలో నిజమైన గురువును గుర్తించడం ఎలా? సూర్యుణ్ణి చూడటానికి దివిటీ ఆసరా అక్కర్లే దు. సూర్యుణ్ణి చూడటానికై మనం కొవ్వొత్తిని వెలిగించనక్కరేదు. దిగ్వలయంమీద దినమణి ఉదయించగానే భానూదయ ప్రభావాన్ని గ్రహిస్తాం. మనలను ఉద్ధరించడానికై జగద్గురువు సాక్షాత్కరించినప్పుడు సత్యం ప్రత్యక్షమైనదని మన ఆత్మ తక్షణమే గుర్తిస్తుంది. సత్యం స్వతహాగా రూఢి అవుతుంది. ఇతర ఋజువుల ఆవశ్యకత దానికి లేదు. అది స్వయంగా ప్రకాశించే పరంజ్యోతి. అది మన అంతరంగంలో ప్రవేశించ గలుగుతుంది. బ్రహ్మాండమంతా లేచి “ఇది సత్య” మని ఘోషిస్తుంది. మహోన్నత పీఠాలను అలంకరించే జగద్గురువులను ఇలా యోచింప చెల్లుతుంది. అగ్రశ్రేణిలోని ఆచార్యుల వద్దనుంచి మాత్రమే కాక సామాన్య గురువుల నుంచి కూడ మనం కొంత అభ్యుదయాన్ని పొందగలం. ఉపదేశాన్ని ప్రసాదించే గురువర్యుడి ప్రజ్ఞావిశేషాలను గుర్తింపగలిగే సముచిత చైతన్య ప్రభావం మనలో ఉందని ఘంటాపథంగా తెలుపగలుగుదుం. కాబట్టి గురుశిష్యుల ప్రభావాన్ని గుర్తించడానికై కొన్ని పరీక్షలు అవసరమై ఉన్నాయి. శిష్యుడిలోను, ఆచార్యుడిలోనుకూడ కొన్ని నియమాలు ఆవశ్యకాలై ఉన్నాయి.

శిష్యుడు పవిత్ర జీవిగా ఉండాలి. అతడికి నిజమైన జ్ఞానతృష్ణఎంతో ఆవశ్యకం. శ్రద్ధ ఇతడి నైసర్గ గుణం కావాలి. పట్టుదలకు ఇతడు పెట్టింది పేరై ఉండాలి. పవిత్రజీవికాని వ్యక్తికి ఆధ్యాత్మికవిద్య అలవడదు. జిజ్ఞాసకు పవిత్రత అనివార్యం. ప్రజ్ఞానంపట్ల మక్కువ తక్కువై ఉండకూడదు. కాంక్ష ఎవరికి? ఇదే ప్రశ్న. మనకు కావలసింది మన చేతులకు చిక్కుతుంది. ఇది ప్రాచీనకాలం నుంచి ఆచరణలోని శాసనం. ఎవరికి ఏ కోరిక ఉందో అది ఫలిస్తుంది. ధర్మజిజ్ఞాస కష్టభూయిష్టమైంది. సర్వ సాధారణంగా మనం అనుకొనేట్లుఅది సులభసాధ్యం కాదు. ధర్మోపదేశాలకు చెవి ఒగ్గ టమే, గ్రంథాలను పఠించడమే మతం కాదని మనం ఎల్లప్పుడూ మరచిపోతాం. ఇది నిర్విరామంగా సాగే యుద్ధమని, మన ప్రకృతితో మనం సలిపే సమరమని, విజయం లభించేదాకా జరుగవలసిన అవిరళ సంగ్రామమని మనం గ్రహించాలి. ఈ విజయసిద్ధి ఒకటి రెండు రోజుల్లో, కొన్నేళ్ళలో, కొన్ని జన్మల్లో, బహుశ వందల కొద్దీ జన్మలలోగాని సాధ్యమయ్యేది కాదు. ఈ దీర్ఘ సాధనకు మనం సంసిద్ధులమై ఉండాలి. ఈ దీక్షతో ఈ తీవ్రసంకల్ప శక్తితో ఏ అంతేవాసి సాధనపథంలో ముందంజ వేస్తాడో అతడు నిజానికి విజయధ్వజాన్ని చేబూనగలడు.

ఆచార్యుడు శాస్త్రాల రహస్యాన్ని హృదయంగమం చేసుకోవాలి. అతడిలో ప్రధానంగా మనం గమనించవలసిన విషయం ఇది: సమస్త ప్రపంచం శాస్త్రాలను — వేదాలు, బైబిల్, కొరాన్ మొదలైన గ్రంథాలను చదువుతూనే ఉంది. అవి శబ్ద పరంపర మాత్రమే; బాహ్యపదవిన్యాసమే; వ్యాకరణ యుక్త శబ్ద విన్యాసమే; పద ప్రకరణమే; శబ్దోత్పత్తి శాస్త్రమే; భాషా

విజ్ఞానమే; మతమనే అస్తిపంజరంలోని ఎండిన బొమికల మూటే. ఏ గ్రంథమైనా ఎప్పుడు పుట్టిందో గ్రహించే సామర్థ్యం ఆచార్యుడికి ఉండొచ్చు. విషయ బాహ్యావరణాలే శబ్దాలు. శబ్దాల మీదనే విశేషదృష్టిపరపి, పదశక్తిమీద, పదప్రభావం మీద సదా తమ మనస్సులను పరపేవారు, వాటిలోని ఆత్మను జారవిడిచి అల్లాడతారు. కాబట్టిఆచార్యుడు ధర్మశాస్త్రా ల మర్మమేదో గ్రహించగలవాడై ఉండాలి. పదజాలం మహారణ్యం వంటిది; మనిషి మనస్సు ఈ శబ్దారణ్యంలో చిక్కుకొని బయటకు పోవడానికి దారి కనుగొనలేకపోతుంది. "వివిధ పదసముచ్చయ విధానం, సమాసగ్రథన నైపుణ్యం, విభిన్న సుందర భాషాప్రసంగ కౌశలం, శాస్త్రాలలోని అనుశాసనవాక్యాలను నీతివచనాలను వివిధ రీతుల వివరించే నైపుణ్యం పండితులకు ప్రమోదం చేకూర్చడానికై ఏర్పడిన వాఙ్మయ విచిత్రపరంపర. వీరికి పరిపూర్ణత్వం సిద్ధించదు".* పాండితీ విజృంభణం వీరి పరమాశయం — లోక ప్రశంసకై వీరిలా ప్రదర్శిస్తారు. పండితప్రకాండులని వీరు ప్రశస్తి గాంచుతారు. మహనీయులైన జగద్గురువుల్లోఎవ్వరూ ఈ తీరు పుంఖానుపుంఖ శబ్ద సమీక్షతో కాలక్షేపం చేయలేదని మీరు గ్రహించగలరు. ధర్మశాస్త్రాలను తర్జనభర్జన చేసి "ఈ శబ్దార్థం ఇది. భాషావిజ్ఞానశాస్త్రాన్ని బట్టి ఈ పదానికీ ఆ పదానికీ ఈ రీతి సంబంధం ఉంది" అని వారెన్నడూ పలుకలేదు. లోకం ఉత్పాదించిన ఆచార్యవర్యుల ఉద్గ్రంథాలన్నిటిని పరిశీలించండి; వారిలో ఎవ్వరూ ఈ పద్ధతి అవలంబించలేదని మీకు తెలుస్తుంది. వారు కావించిన కర్తవ్యం ప్రబోధం. బోధచేయడానికి ప్రజ్ఞానసామగ్రి లేనివారు ఒక శబ్దాన్ని పుచ్చుకొని, దాని ఉత్పత్తిని గురించీ, ప్రయోగాన్ని గురించీ మూడు సంపుటాల గ్రంథాన్ని రచిస్తారు. మా గురువు ఇలా అనేవారు: "కొందరు వ్యక్తులు ఒక మామిడితోటలోకెళ్ళి, దాన్లోని చెట్లఆకులను లెక్కించడంలోను, ఆకుల రంగును పరిశీలించడంలోను, రెమ్మల పొడవును గమనించడంలోను, కొమ్మల సంఖ్యను గణించడంలోను కాలాన్నంతా వెచ్చిస్తూంటే, వారిలో ఒక బుద్ధిమంతుడు అలా కాలహరణం గావించక చెట్లనుంచి పళ్ళు కోసుకొని, వాటిని ప్రీతిగా తినసాగాడు. ఆ వ్యక్తులను గురించి ఏ విధంగా యోచిస్తారు?" ఆకులను రెమ్మలను లెక్కించి పెద్దజాబితా తయారుచేసేపని ఇతరులకు వదలివేయండి. ఆ పనికి తగిన తావులో దానికి సముచితమైన మూల్యం ఉండొచ్చు. కాని, ఇక్కడ ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆ పనికి స్థానం లేదు. ఈ రకమైన చేతలతో మానవులు ఆధ్యాత్మిక శక్తిని అలవరచుకోలేరు. ఈ "పర్ణగణన సమర్థుల" లో మహత్తర ఆధ్యాత్మిక శక్తిని అలవరచుకొన్న మహనీయుణ్ణిఎవరినీ మీరెన్నడూ చూసివుండరు. మనిషి పరమాదర్శం ధర్మం లేక మతం. అతడి జీవితానికి మహోత్కృష్టమైన మహిమను చేకూర్చేది అదే! ఈ ఉదారాశయ సిద్ధికోసం "ఆకుల లెక్క" అనవసరం. మీరు క్రైస్తవులు కాగోరితే "ఏసుక్రీస్తు జెరూసలేంలో జన్మించాడా బెత్లెహామ్‌లో జన్మించాడా? 'గిరిమీది ప్రబోధం' సరిగ్గాఏ తేదీనాడు గావించబడింది?" అని మీరు ప్రశ్నించుకోనక్కర్లే దు. కాని 'గిరిమీది ప్రబోధం' లోని జ్ఞానానుభూతిని పొందడం మీ కర్తవ్యం. అది బోధచేయబడిన కాలనిర్ణయానికై మీరు రెండువేల పదజాలాన్ని పరిశీలించనవసరం లేదు. ఇలాంటి పరిశీలన పండితుల ప్రమోదానికై ఏర్పడింది. దాన్ని వారిని పరిశీలించనివ్వండి, మీరు 'తథాస్తు' అనండి. మనం మామిడిపళ్ళను ఆరగిద్దాం.

ఆచార్యుడిలో గమనించవలసిన రెండవ నియమం ఇది: అతడు పాపరహితుడై వుండాలి. ఇంగ్లండ్‌లో ఒకప్పుడు మిత్రుడొకడు నన్నిలా ప్రశ్నించాడు: "ఆచార్యుడి వ్యక్తిత్వాన్ని మనం ఎందుకు పరికించాలి? అతడు బోధించినదాన్ని వివేకపూర్వకంగా గ్రహించడమే కదా మన కర్తవ్యం!" ఈ ఊహ సరైనది కాదు. ఫలానా వ్యక్తి నాకు గతి విజ్ఞానశాస్త్రాన్నిగాని, రసాయనశాస్త్రాన్నిగాని లేక మరే భౌతికశాస్త్రాన్నిగాని బోధింపదలస్తే, అతడి గుణం ఎలాటిదైనా కావచ్చు. గతివిజ్ఞానశాస్త్రాన్ని గాని లేక మరే భౌతికశాస్త్రాన్నిగాన్ని అతడు బోధించవచ్చు. భౌతిక శాస్త్రంవల్లచేకూరవలసింది మేధాసంపదకు సంబంధించిన జ్ఞానం మాత్రమే. మేధాశక్తి మీదే ఇది ఆధారపడివుంటుంది. అపారమేధా సంపదగల వ్యక్తికి ఆత్మశక్తి శుద్ధపూజ్యం కావచ్చు. కాని ఆధ్యాత్మిక శాస్త్రాలను గురించి సమీక్ష వేరైవుండాలి. ఎవరి హృదయం కళంకితమై ఉంటుందో, దాన్లో ఆధ్యాత్మిక వెలుగు ఉంటుందని మనం ఎన్నటికీ తలచరాదు. పాపసంభరిత హృదయం బోధించేది ఏమిటి? దానికేమీ తెలియదు. ఆధ్యాత్మిక సత్యం పవిత్రతే. "పవిత్ర మనస్కులు ధన్యులు; కారణం ఏమంటే వారికి ఈశ్వరసాక్షాత్కారం లభించి తీరుతుంది." సర్వమత సారం ఈ ప్రవచనంలో ఇమిడివుంది. దీన్ని మీరు ఒంటబట్టించుకొంటే, భూతకాలంలో బోధింపబడినదంతా, భావికాలంలో బోధింపసాధ్యమయ్యేదంతా మీరు గ్రహించే ఉన్నారని వక్కాణించవచ్చు. మీరు మరి దేన్ని పరిశీలించనక్కర్లేదు. అవశ్యం మీరు గ్రహించవలసినదంతా ఆ ఒక్క

వాక్యంలోనే ఇమిడివుంది. తక్కిన శాస్త్రాలన్నీ పోయినప్పటికీ, ఆ ఏకైక ప్రవచనం లోకసముద్ధరణ చేయగలదు. వ్యక్తి పరిశుద్ధాత్ముడైతేగాని ఈశ్వరదర్శనం, సాక్షాత్కారం సుసాధ్యం కాబోదు. కాబట్టి ఆధ్యాత్మిక విద్యాబోధనకు పవిత్రత అనివార్యగుణం. అతడెలాంటివాడో ముందు గమనించి, తరువాత అతడేమి బోధిస్తాడో మనం గ్రహించాలి. కేవలం మేధావులైన బోధకులను వేరు తెరగులో పరిశీలించవచ్చు. ఆ వ్యక్తి ఎలాంటివాడో అనే అంశంకంటే అతడేం తెల్పుతాడో అనే విషయం అతడిపట్లఅ త్యంత ప్రాముఖ్యాన్ని వహిస్తుంది. ఆధ్యాత్మిక విషయంలో మొదట బోధకుడు ఎలాంటి వ్యక్తో పరిశీలించాకనే అతడి మాటల విలువ పరిగణనలోకి వస్తుంది. కారణం ఉదాత్తభావప్రేరణను కలిగించేవాడు ఇతడు కాబట్టి. తనలో ఆధ్యాత్మిక శక్తి లేకుంటే అతడు దాన్నెలా స్ఫూర్తిదాయకం చేయగలడు? విషయం ఒక ఉపమాలంకారంతో స్పష్టమవుతుంది. ఉష్ణయంత్రం అనదగ్గ దాన్లో ఉష్ణం ఉన్నప్పుడే అది ఉష్ణస్పందనాన్ని మరొక వస్తువులో కలిగించ గలుగుతుంది. ఆ యంత్రంలో ఉష్ణం లేకుంటే అదలా చేయలేదు. శిష్యుడి మనస్సులో మానసిక స్పందనాన్ని ప్రసారం చేసే మత గురువు విషయంలో మనం ఇలాగే యోచించాలి. నిర్వహించవలసిన కర్తవ్యం కేవలం మేధాశక్తులను ఉద్దీపితం గావించడం మాత్రమే కాదు. మరి ఆధ్యాత్మిక ప్రభావాన్ని అంతేవాసి హృదయంలోకి ప్రసారితం గావించడం. వాస్తవమైన ఒకానొక శక్తి గురువునుంచి వెలువడి శిష్యుడి మనస్సులో ప్రవేశించి వృద్ధిచెందుతుంది. కాబట్టి గురువు సత్యసందీపిత వ్యక్తిగా ఉండాలనే నియమం అనివార్యం.

మూడవ నియమం: ఉద్దేశం. శిష్యుడికి బోధించే సమయంలో పవిత్రప్రేమ మాత్రమే ఉండాలిగాని కీర్తి పిపాసగాని, మరే దురుద్దేశంగాని గురువు మనస్సులో ఉండకూడదు. ఆచార్యుడినుంచి అంతేవాసికి ఆధ్యాత్మికశక్తులు అనురాగపరంగానే అందచేయబడాలి. అన్యసాధనమేదీ అందుకు ఉపకరించదు. లబ్ధిమీద ప్రీతిగాని, పేరుమీద మక్కువగాని శక్తిప్రసార మార్గాన్ని తక్షణమే నాశనం చేస్తుంది. కాబట్టిప్రేమ మూలంగానే కర్తవ్యనిర్వహణ జరగాలి. భగవంతుణ్ణి ఎరిగిన వ్యక్తే ఆచార్యుడు కాగలడు.

ఈ నియమాలన్నీ గురువులో నెలకొన్నప్పుడే శిష్యుడు సురక్షితుడవుతాడు. ఎవరిలో ఇవి లోపిస్తాయో అతణ్ణి ఆచార్యుడిగా స్వీకరించడం తెలివితక్కువ పనే అవుతుంది. శిష్యుడికి సద్గుణాన్ని అలవాటు చేయలేకపోయినా, దౌష్ట్యాన్ని గరపే దుర్దశ ఒక్కోసారి వాటిల్లవచ్చు. ఈ ప్రమాదం తలెత్తకుండా అంతేవాసి జాగరూకుడై ఉండాలి. కాబట్టిఅ ందరూ మనకు ఆచార్యులు కాలేరనే సంగతి విస్పష్టమే కదా!

సెలయేళ్ళు, శిలలు ప్రబోధం చేస్తాయనే సంగతి కవితాలంకార శోభితం; కాని సత్యసందీపితజీవి కాని వ్యక్తి అనంత సత్యాన్నైనా ఇతరులకు బోధించలేడు. సెలయేళ్ళు ఎవరికి బోధిస్తాయి? ఎవడి జీవితకమలం ప్రఫుల్లమై ఉంటుందో, అలాంటి పుణ్యాత్ముడికి గురువు బోధించగలడు. హృదయ పుండరీకం ప్రఫుల్లమైనప్పుడు అది ఝరీమతల్లుల నుంచీ, శిలాఖండాలనుంచీ ప్రబోధాన్ని పొందగలదు — ఈ ప్రకృతి దృశ్యాలన్నిటినుంచి అప్పుడది ఆధ్యాత్మిక ప్రబోధాన్ని పొందగలుగుతుంది. వికసించని హృదయానికి వట్టి సెలయేళ్ళు, గుండురాళ్ళు మాత్రమే కనిపిస్తాయి. గుడ్డి వాడొకడు ఒకానొక చిత్రవస్తు ప్రదర్శనశాలకు పోవచ్చు. అతడు వచ్చి పోతాడు, అంతే! అతడు చూడాలంటే అతడి కళ్ళు తెరువబడాలి. అలాగే ధార్మికదృష్టిని ప్రసాదించేవాడు ఆచార్యుడు. ఆచార్యుడికీ, అంతేవాసికీ ఉన్న సంబంధం పూర్వపురుషుడికి, సంతతివారికి ఉన్న బాంధవ్యం పోలింది. గురువర్యుడు ఆధ్యాత్మిక పితృపాదుడు; శిష్యుడు ఆధ్యాత్మిక వారసుడు.

స్వేచ్ఛను గురించి, స్వాతంత్ర్యాన్ని గురించి గొప్పగా మాట్లాడవచ్చు. కాని వినయం, విధేయత, భక్తిశ్రద్ధలు లేకుంటే ధార్మికజ్ఞానం అలవడనే అలవడదు. గురుశిష్యుల నడుమ పూర్వోక్తపూత బాంధవ్యం ఎందులో నెలకొంటుందో దాన్లోనే మహోత్కృష్ట ఆధ్యాత్మిక హృదయాలు పెంపొందుతాయి. ఈ సంబంధం ఎందులో గగనకుసుమమవుతుందో మతం అందులో కేవలం ఒక వినోద ఆధ్యాత్మిక బోధకుడు కాలక్షేపమే అవుతుంది. ఏ జాతుల్లో, ఏ సంప్రదాయాల్లోఈ గురుశిష్య సంబంధం మృగ్యమౌతుందో, ఆధ్యాత్మిక విభూతి దాదాపుగా దాన్లో శూన్యమై ఉంటుంది. పవిత్ర బాంధవ్యానుభూతి వినా జ్ఞానాన్ని ప్రసార మొనరించేవాడుగాని, జ్ఞానప్రసారానికై హృదయాన్ని ఒడ్డేవాడుగాని లేదు. ఎందుకంటే వారు పరస్పర సంబంధం ఎరుగని స్వతంత్రులు. అంతేవాసి ఎవరివద్ద విద్యను పొందగలడు? — శ్రద్ధా భక్తులులేని శిష్యుడు విద్యను

కొనుగోలు చేస్తాడు. నాకొక డాలర్ మూల్యంగల మతాన్ని ఒసగు. దాని నిమిత్తం నేనొక డాలర్ చెల్లించకూడదా? మతాన్ని ఆ విధానంలో పొందలేం.

ఆధ్యాత్మిక ప్రభావంగల ఆచార్యుడు అంతేవాసికి ప్రసాదించే ప్రజ్ఞానంకంటే పునీతమైనది, మహత్తరమైనది ఏదీ లేదు. ఒక వ్యక్తి సంపూర్ణదక్షుడైన యోగి అయితే, ప్రజ్ఞానం తనంత తాను అతడి హృదయాన్ని వరిస్తుంది. కాని ఇది గ్రంథాలవల్ల అబ్బేదికాదు. ప్రపంచం నాలుగు మూలలకు వెళ్ళి ఎంతగా తల బాదుకొన్నా, హిమాలయాల్లోను, ఆల్ప్స్‌లోను, కాకసస్‌లోను, గోబీ ఎడారిలోను, లేక సహారా మరుభూమిలోను లేక సముద్రం అడుగులోను మీరెంత అల్లాడినా (మీరొక ఆచార్యుణ్ణి కనుగొనేవరకు) ఆ జ్ఞానం మీకు కలుగదు. గురువుని కనుగొని, బాలకుడి మాదిరి అతణ్ణి సేవించి, మీ హృదయాలను విప్పి, గురు ప్రభావాన్ని దాన్లో ప్రసరింపనిచ్చి, అతడిలో ఈశ్వరసాక్షాత్కారాన్ని దర్శించండి. సర్వేశ్వరుడి సర్వోత్కృష్ట వ్యక్తీకరణం ఆచార్యుడిలో ప్రత్యక్షమైనదని గుర్తించి, దృష్టిని అతడిపై కేంద్రీకరించండి. మీ శ్రద్ధ ఘనతరమయ్యేకొద్దీ , మీ ఏకాగ్రదృష్టి నిశితమయ్యేకొద్దీ ఆచార్యుడి మానవస్వరూప చిత్రం కరిగిపోతుంది; శారీరకావరణం అదశ్యమవుతుంది. అతడిలోని సత్యనారాయణుడు సాక్షాత్కరిస్తాడు. భక్తిశ్రద్ధలతో, సాటిలేని ప్రేమతో సత్యాన్ని చేరేవారిని ఉద్దేశించి సత్యనారాయణుడే మహిమోపేత భాషణాలను ఉచ్చరిస్తాడు. “మీ చరణాలనుంచి పాదరక్షలను తొలగించండి; ఎందుకంటే మీరు నిలబడ్డ చోటు పవిత్ర స్థలం.” ఏ చోట భగవన్నామం ఉచ్చరింపబడుతుందో ఆ చోటు పవిత్ర స్థానమవుతుంది. ఆ నామాన్ని ఉచ్చరించే వ్యక్తికి ఎంత పవిత్రత చేకూరుతుందో యోచించండి. ఆధ్యాత్మిక సత్యాలు ఏ మహనీయుడినుంచి వ్యక్తమవుతాయో, ఆ మహాత్ముణ్ణి మనం అలాంటి భక్తిశ్రద్ధ లతో సమీపించాలి. ఈ స్ఫూర్తితో మనం ఉపదేశం పొందాలి. ఇలాంటి మహిమోపేతులైన ఆచార్యుల సంఖ్య లోకంలో ఎంతో తక్కువ అనడం నిజమే. కాని లోకంలో బొత్తిగా వారు లేరనడం నిజం కాదు. ఏ ముహూర్తంలో భూమ్మీద వీరు బొత్తిగా లేకుండా పోతారో, ఆ ముహూర్తంలో లోకం ఉనికి ఉండదు, భయంకర నరకమై మరుగైపోతుంది. ఈ ఆచార్యులు మానవ జీవనంలో కుసుమించే సుందర ప్రసూనాలు. వారివల్లలోకం గురుగుణగంధబంధురమై చరిస్తూ ఉంటుంది. వారినుంచి వ్యక్తమయ్యే శక్తితో సామాజిక బంధాలు సడలక, బలవత్తరాలై ఉంటాయి.

ఈ ఆచార్యులను కూడ మించిన మరొక శ్రేణి గురువులున్నారు. వీరు ప్రపంచపు క్రీస్తులు. గురువులకు పరమగురువులైన వీరు మానవ రూపాల్లో గోచరించే ఈశ్వరప్రతినిధులు; మహోత్కృష్ట స్థానాలను అలంకరించిన మహాత్ములు. కేవలం స్పర్శతో, ఆశీస్సుతో వీరు ఆధ్యాత్మిక బోధకుడు ఆధ్యాత్మికశక్తిని ప్రసారం చేయగలరు. వీరి సంస్పర్శవల్ల, కేవల ఇచ్ఛాశక్తితో ఎంతో నికృష్టులై, పతితులైనవారు సైతం తృటిలో యోగులు కాగలుగుతారు. ఇలాంటి అద్భుతక్రియలను వీరెలా నిర్వహిస్తారో మీరు చదివి ఉండలేదా? నేను ఇంతకుముందు చెప్పిన ఆచార్యులవంటివారు కారు వీరు. ఆచార్యులందరికీ ఆచార్యులు వీరు. వీరు దైవీవ్యక్తీకరణలు – ఈశ్వర ప్రభావ సాక్షాత్కారులు. వీరి మూలంగా మాత్రమే భగవంతుణ్ణివీక్షించగలం. వీరు మనకు పరమపూజ్యులు. వీరినే మనం ఆరాధించి తీరాలి.

తనూభవుడిలో వ్యక్తమైన విధానంగాని ఈశ్వరుణ్ణిఎవరూ కాంచలేరు. మనం భగవంతుణ్ణి చూడలేం. దేవుణ్ణి చూడ ప్రయత్నిస్తే, భయానక వ్యంగ్యచిత్రాన్ని ఒకదాన్ని సృష్టించి “ఇతడే ఈశ్వరు” డంటాం. మనం మానవులమై ఉన్నంతకాలం, మానవాతీతుడిగా దేవుణ్ణిఊ హించలేం. మానవప్రకృతిని అతిక్రమించి, ఈశ్వరుడి స్వస్వరూపాన్ని గుర్తించే కాలం వచ్చితీరుతుంది; కాని మనం మనుష్యులమై ఉన్నంతకాలం మనిషిలోనే మనం ఈశ్వరుణ్ణి ఆరాధించాలి. మనం ఏం మాట్లాడినా మాట్లాడవచ్చు; ఎలాంటి ప్రయత్నం చేసినా చేయవచ్చు. మనం భగవంతుణ్ణి మానవ రూపంలోగాక మరేవిధంగాను దర్శించలేం. మనం మేధాశక్తి బంధురాలైన మహోపన్యాసాలను చేయవచ్చు. గొప్ప యుక్తివాదులం కావచ్చు; దేవుణ్ణిగురించిన ఈ కథలన్నీ కేవల పుక్కిటిపురాణాలని మనం ఋజువు చేయవచ్చు. కాని ఆచరణయోగ్యమైన లోకజ్ఞానం ఏదో వ్యక్తీకరించడం మన ధర్మం. ఈ అద్భుత మేధాశక్తి వెనుక ఏముంది? పూర్ణానుస్వారం; శుద్ధపూజ్యం; కేవల ఫేనం; శుద్ధశూన్యం. ఈశ్వరారాధనకు విరుద్ధంగా ఎవడైనా మేధాశక్తిబంధుర మహోపన్యాసాలు ఇవ్వడం ఇకముందు మీరు వింటే, అతగాణ్ణిపట్టు కొని, “భగవంతుడంటే నీ అభిప్రాయం ఏమిటి? ‘సర్వశక్తి’ అంటే ఏమిటి? ‘సర్వజ్ఞత’ అంటే

ఏమిటి? 'సర్వత్రా విరాజిల్లేప్రేమ' అంటే ఏమిటి? ఈ తీరు మహావాక్కుల వర్ణ క్రమాలేకాక, వాటిలోని అంతరార్థం ఏమిటి?" అని అడగండి. అతడేమీ చెప్పలేడు. ఒక్క భావాన్నైనా అతడు సూత్రబద్ధం చేయలేడు. ఒక్క గ్రంథాన్నైనా చదువని పామరుడికంటే అతడు అధికుడు కాడు. పామరుడు ప్రశాంతమూర్తి. లోకంలో అతడెలాటి గగ్గోలూ పుట్టించడు. ఇక ఆ వాచాలుడో, తన పిడివాదాలతో లోకంలో చెప్పరాని గడబిడ సృష్టిస్తాడు. నిజమైన అనుభూతి అతగాడిలో హుళక్కి. ఇద్దరూ సమస్థితిలో ఉన్నవారే.

మతమంటే మహత్తర భావానుభూతి. కేవల ప్రసంగానికి ఆధ్యాత్మిక భావానుభూతికి ఉన్న సూక్ష్మ వ్యత్యాసాన్ని మీరు గ్రహించాలి. ఆత్మవికాసంలో, ఆత్మసాక్షాత్కారంలో సాధ్యమయ్యేది అనుభూతి. మానవుడు ఆత్మను గురించిన భావన చేయజాలడు. సమక్షంలోని దృగ్గోచరాలైన దృశ్యాల ద్వారా దాన్ని అతడు భావనచేయాలి. వినీల ఆకాశాన్ని, విశాల మైదానాలను, గంభీర సముద్రాన్ని లేదా ఇలాంటి మహిమోపేత ప్రకృతి దృశ్యాన్ని పురస్కరించుకొని అతడు భావనచేయాలి. వేరే తీరులో భగవంతుణ్ణిభావన చేయడం ఎలా? నిజానికి మీరు ఏం చేస్తున్నారు? సర్వత్ర విద్యమానశక్తిని గురించి మీరు ప్రసంగిస్తూన్నప్పుడు సముద్రాన్ని గురించి మీరు ఊహిస్తూన్నారు. భగవంతుడు సముద్రమా? ఒకింత లోకజ్ఞానం అవసరమైవుంది. లోకజ్ఞానం కంటే అసామాన్యమైనదేదీ లేదు. లోకం మాటలతో నిండివుంది. ఫేనసదృశ్య లౌకికవాగ్వాదాన్ని కట్టిపెట్టు. మన ప్రస్తుత స్థితి మేరకు మన శక్తి పరిధిగలదై ఉంది. భగవంతుణ్ణిమనం మానవస్వరూపంలో చూడక తప్పదు. దున్నపోతులు ఈశ్వరుణ్ణి ఆరాధించాలనుకొంటే, అతడొక పెద్ద దున్నపోతనే భావన చేస్తాయి. చేప ఒకటి దేవుణ్ణి కొలవాలనుకొంటే అతణ్ణొక పెద్ద చేపగానే భావించుకొంటుంది. మీరూ, నేనూ, దున్నపోతు, చేపా వేర్వేరు పాత్రలను పోలినవారం. ఈ పాత్రలన్నీ తమతమ ఆకారాలను బట్టిసముద్రజలాన్ని నింపుకొంటాయి. ఈ ప్రతీ పాత్రలోను నీరు తప్ప మరేదీ ఉండదు. ఈశ్వరుడి భావనకూడ ఇలాంటిదే! మనుషులు భగవంతుణ్ణి మనుష్య స్వరూపంలో భావనచేస్తారు. పశువులు స్వీయస్వరూపంలో అతడున్నట్లుభావిస్తాయి. ఒక్కోజీవి వ్యక్తిగత దృక్పథాన్నిబట్టి వ్యక్తిగత ఆశయాన్ని అనుసరించి ఈశ్వర భావన చేస్తుంది. అతణ్ణిఅవగాహన చేసుకొనే విధానం అదే. మనుష్యభావనతో మీరు అతణ్ణి ఆరాధించాలి. ఎందుకంటే వేరే విధానం సాధ్యం కాదు కాబట్టి. ఈ భావనతో ఈశ్వరుణ్ణి ఆరాధించనివారు రెండు తరగతులున్నారు: మతభావనలేని మానవ పశువొకడు; రెండవ వ్యక్తి పరమహంస; ఇతడు మానవాతీతుడు. ఇతడు తన మానస శరీరాలను పరిత్యజించినవాడు; ప్రకృతి హద్దులను అతిక్రమించినవాడు. యావత్తు ప్రకృతీ ఇతడి దివ్యాత్మ అయింది. ఇతడికి మనస్సు లేదు, దేహమూ లేదు. ఏసుక్రీస్తు, బుద్ధుల మాదిరి ఇతడు ఈశ్వరుణ్ణిఈశ్వరుడి మాదిరే ఆరాధిస్తాడు. మనుష్య భావనతో ఇలాంటివారు భగవంతుణ్ణి పూజించరు. మరో రీతివ్యక్తి మానవ పశువు. చరమ స్థి తులు ఒకే తీరున ఉండటం మీరెరుగుదురు. అజ్ఞాన ప్రజ్ఞాన చరమ స్థితులుకూడ ఇలాంటివే; ఈ స్థితుల్లో ఉండేవారెవరినీ ఆరాధించరు. ఈశ్వర ఆరాధనావశ్యకతనెరిగే ఆంతరంగికాభివృద్ధి లేకపోవడంతో అజ్ఞా నులు దాన్లోఅగ్రగణ్యులు; దాని మాట ఎత్తనే ఎత్తరు. ప్రజ్ఞానాగ్రాన్ని అందుకొన్న పరమయోగులూ ఈశ్వరుణ్ణిపూజించరు. ఉదాత్త ఆధ్యాత్మికాభివృద్ధి ని పొంది, తాము ఈశ్వరుడే అవడంతో వీరలా చేయరు. భగవంతుడు భగవంతుణ్ణిఆరాధించడు. ఈ రెండు తెగల మధ్య ఎవడైనా మనుష్యభావనతో ఈశ్వరుణ్ణి ఆరాధించనని తెలిపితే అతడిపట్ల జాగరూకులై మెలగండి. అతగాడు బాధ్యతనెరుగని వాచాలుడని, అతడి మాటలు భ్రమబంధురాలని గ్రహించండి. అతడి ప్రబోధం భావశూన్యుల కోసం ఉద్దేశింపబడింది. అతడి ఉపదేశం బౌద్ధిక అర్థరాహిత్యం.

కాబట్టిభగవంతుణ్ణి మనుష్యభావనతో ఆరాధించడం అత్యంత ముఖ్య విషయం. ఆరాధనాయోగ్యుడైన "ఈశ్వరతుల్య పురుషుడు" ఏ జాతుల్లో ఉంటాడో ఆ జాతులు ధన్యత గాంచాయి. క్రైస్తవుల్లో ఇలాంటదివ్యపురుషుడు ఏసుక్రీస్తు కాబట్టి క్రైస్తుకు సన్నిహితులై ఉండండి. అతడినెన్నడూ పరిత్యజించవద్దు. ఈశ్వరసాక్షాత్కారం పొందేమార్గం అది. మానవునిలో దేవుణ్ణి దర్శించండి. ఈశ్వరుణ్ణి గురించిన మన భావనలన్నీ దాన్లో కేంద్రీకృతాలై ఉన్నాయి. ఒక్క క్రీస్తును తప్ప తక్కిన ఈశ్వరావతారాలను క్రైస్తవులు ఖాతరుచేయరు. ఇది వారిలోని గొప్ప లోటు. క్రీస్తు ఈశ్వరావతారమైనట్లే, అలాగే మరికొందరు అవతార పురుషులున్నారు. ఇలాగే వందల సంఖ్యలో అవతారపురుషుల్ని కానరావచ్చు. భగవంతుడికి ఎప్పుడూ పరిమితులను కల్పించవద్దు. ఈశ్వరుడి పట్ల చూపాల్సిన భక్తిశ్రద్ధ లను ఏసుక్రీస్తుపట్ల కనబరచండి. మనం

చేయదగ్గఏకైక ఆరాధన అదే. నిర్గు ణుడైన భగవంతుణ్ణిపూజించడం సాధ్యం కాదు. అతడు విశ్వం యావత్తు అంతర్యామిగా ఉన్నాడు. మనుష్యరూపంలో నిర్గుణబ్రహ్మం వ్యక్తమైనప్పుడే మనం ఆరాధించగలుగుతాం. ప్రార్థన సమయంలో క్రైస్తవులు 'క్రీస్తునామంలో' అని ఉచ్చరించడం ముదావహం. నిర్గుణోపాసనకంటే ఇలా ఆరాధించడం సుసాధ్యం. మానవుల లోపాలను అవగాహన చేసుకొని లోకకల్యాణార్థం మనిషిగా అవతరిస్తాడు.

"ఎప్పుడు ధర్మానికి గ్లాని కలుగుతుందో, ఎప్పుడు అధర్మం పెరుగుతుందో, ధర్మసముద్ధరణ ఒనరించడానికై నేను అవతరిస్తాను"★ అని శ్రీకృష్ణ భగవానుడు వచించాడు. "సర్వశక్తి సంపన్నుడై, విశ్వంలో సర్వాంతర్యామినై మానవావతారమెత్తిన నన్ను మూర్ఖులు గుర్తించక నిందిస్తారు; నేను ఈశ్వరుణ్ణికానని ఎంచుతారు"★అని అతడన్నాడు. వారి మనస్సులు ఆసురికాలైనవి. కాబట్టిఅతడు విశ్వేశ్వరుడని వారు గుర్తించలేకపోతారు. ఈ ఈశ్వరావతారాలు పరమ పూజ్యాలు. వారు ఆరాధ్యులని నొక్కి వక్కాణిస్తాను. వారి జన్మదినాలను, వారు ఈ లోకం నుంచి నిష్క్రమించిన దినాలలోను మనం వారిపట్లఅత్యంత ప్రత్యేక శ్రద్ధా భక్తులు కనబరచాలి. క్రీస్తును ఆరాధించేటప్పుడు అతడు కోరిన రీతిలోనే ఆరాధిస్తాను. ఆయన జయంతినాడు విందారగించడం కంటే ఉపవాసం ఉండి, ప్రార్థనచేసి, నేను అతణ్ణి సేవిస్తాను. వారిని గురించి మననం చేస్తే ఈ అవతారపురుషులు మన ఆత్మల్లో వ్యక్తీకృతులవుతారు; తమను పోలినవారినిగా మనలను పరివర్తింప చేస్తారు. అప్పుడు మన ప్రకృతి అంతా మార్పు చెందుతుంది; మనం వారి మాదిరి కాగలం.

కాని మీరు క్రీస్తునుగాని, బుద్ధుణ్ణిగాని అంతరిక్షంలో ఎగిరే దుష్టదేవతాగణంతో చేర్చరాదు. అలాంటి పని అపవిత్రీకరణే అవుతుంది. ఏసుక్రీస్తు భూతప్రేతాది బృందంలో చేరి నృత్యం చేయడమా? ఇదెలాంటి విపరీత భావన! ఈ దేశంలోనే ఇలాంటి మిథ్యాప్రదర్శన చూశాను. ఈశ్వరావతారాలు ఈ తీరుగా సాక్షాత్కరింపరు. క్రీస్తు స్పర్శ ఎవడికి దక్కుతుందో అతడు సంపూర్ణాంతరంగిక పరివర్తన చెందుతాడు. ఈ అద్భుత పరివర్తనతో అతడు క్రీస్తు మాదిరి కాగలడు. అతడి జీవితం సమగ్రంగా ఆధ్యాత్మికాలోక సందీపితమవుతుంది. అతడి శరీరంలోని ప్రతి రోమకూపంనుంచి ఆధ్యాత్మిక శక్తి వ్యక్తమవుతూంటుంది. క్రీస్తు కొన్ని మహిమలను ప్రదర్శించాడు; ఈ మహిమల్లో రోగ నివారణమొకటి. ఇవి అతడి దివ్యచరిత్రను ప్రకటించేవా? కావు. అవి నిమ్న అసభ్యకార్యాలు. నిమ్నశ్రేణి జనంలో తిరిగేటప్పుడు ఈ విడ్డూరాలను అతడు చేయాల్సి వచ్చింది. ఈ అలౌకిక క్రియలను అతడెందుకు ఆధ్యాత్మిక బోధకుడు నిర్వర్తించాడు? యూదుల నడుమ వాటిని అతడు ప్రదర్శించాడు. యూదులు అతణ్ణి గుర్తించలేదు, స్వీకరించలేదు. ఈ విడ్డూ రాల ప్రదర్శన ఐరోపాలో జరుగలేదు. ఫలితంగా క్రీస్తును నిరాకరించిన యూదులకు దక్కింది విడ్డూరపు ప్రదర్శన మాత్రమే కాని, క్రీస్తును స్వీకరించి ఆదరించిన ఐరోపాకు చేకూరింది మహత్తరమైన 'పర్వతోపదేశం'. మనుష్యాత్మ సత్యాన్ని స్వీకరించింది; అసత్యాన్ని పరిగ్రహింప నిరాకరించింది. క్రీస్తు అద్భుతశక్తి రోగనివారణాది అలౌకిక క్రియా ప్రదర్శనల్లో లేదు. ఎలాంటి మూర్ఖు లైనా ఇలాంటి పనులను చేయగలరు. మూఢులుకూడ రోగనివారణ గావించగలరు. పిశాచాలు ఇలా చేయగలవు. ఘోరపైశాచిక ప్రవృత్తిగల వ్యక్తులు కొందరు అద్భుతాలౌకిక పనులను చేయడం నేను చూశాను. మృత్తికను చేబూని దానితో పళ్ళను రూపొందిస్తూన్నట్లు కానవస్తారు. కొందరు మూఢులు, ఆసురప్రవృత్తులు త్రికాల సంఘటనలను తెలుపడం నేను ఎరుగుదును. ఒక్క చూపు సారించి సంకల్ప శక్తితో, ఘోరవ్యాధులను పోగొట్టిన మూర్ఖులు కొందరిని నేను చూశాను — ఇవి శక్తులనడం నిజమే! కాని విశేషించి ఇవి ఆసురశక్తులే! ఏసు ప్రదర్శించిన రెండవ రీతి శక్తి ఆధ్యాత్మిక శక్తి. ఈ శక్తి సర్వదా విద్యమానమైనది, సర్వకాలాల్లోను విరాజిల్లేది. ఇది అతడి మహోత్కృష్ట ప్రేమలో, పలికిన సత్యసందీపిత వాక్కులలో, బ్రహ్మాండమైన బోధనలలో నెలకొంది. ఒక్క చూపుతో అతడు, మానవుల వ్యాధులను పోగొట్టిన సంగతి మరపులో పడిపోయింది. "నిర్మల హృదయులు ధన్యులు" అని అతడు పలికిన మహావాక్కు నేటికీ స్మరణీయమైవుంది. ఈ వాక్కులోని శబ్దాలు మహత్తర శక్తి భండారాలు. ఈ శక్తి ఎన్నడూ నశించనిది. ఎంతకాలం మానవమానసం విద్యమానమైవుంటుందో, ఎంతకాలం ఈశ్వరనామం మరపులో పడకుంటుందో ఈ శబ్దాలూ మాపుకాక ప్రభాకలితాలై, సచలాలై వెలుగొందుతాయి. ఇవే ఏసు బోధించిన శక్తులు; ఇవి ఆ మహనీయుడిలో నెలకొన్నాయి. పవిత్రత అనేది మహత్తరశక్తి. ఇది ప్రత్యక్ష మహాశక్తి.

క్రీస్తును ఆరాధించే సమయంలో, అతణ్ణి గురించి ప్రార్థించేటప్పుడు మనం అన్వేషించే దాన్ని గురించి మనం స్మరించాలి. మనిషికి ముక్తిని ప్రసాదించేది, ప్రకృతిని ఆతడి చెప్పుచేతల్లో ఉంచేది, దాస్యచిహ్నాన్ని అతడినుంచి ఊడబెరికేది, అతడికి

ఈశ్వరసాక్షాత్కారాన్ని ప్రసాదించేది మౌఢ్యగర్భితాలైన విడ్డూరపు ప్రదర్శనలు కావు కాని అపురూపాలైన ఆత్మశక్తులే.

# ప్రతీకల ఆవశ్యకత

భక్తి రెండు భాగాలుగా విభజించబడింది. ఒక భాగం 'వైధి' అనబడుతోంది. ఇది లాంఛనప్రాయమైనది లేక ఔపచారికమైనది. ఇది ఆచారప్రియులు కాంక్షించే భక్తి. రెండవ భాగం 'ముఖ్య' లేక 'సర్వోన్నత' మైనదిగా పేర్కొబడుతోంది. నిమ్న విధానం నుంచి మహోన్నత విధానమైన రీతులన్నీ భక్తి ప్రదర్శనలో ఇమిడివున్నాయి. ప్రపంచంలోని ఏ దేశంలోనైనా, ఏ మతంలోనైనా నెలకొన్న ఆరాధన యావత్తూ ప్రేమవల్ల నియంత్రితమైనది. కాని కొన్నికొన్ని సందర్భాల్లో కేవలం నిరాడంబర ఔపచారికంతో వ్యక్తమవుతూంటుంది. మరికొన్ని సందర్భాల్లో ఈ తీరు ప్రదర్శన కాకున్నా అది ప్రేమకూడ కాని నిమ్న రీతిలోనిదిగా ఉంటుంది. పూర్వోక్తాలైన అనుష్ఠానాలను, ఆచారాలను అనావశ్యకాలని చెప్పలేం. ఆత్మను అగ్రేసరం కావించడానికై భక్తియొక్క బాహ్యభాగం ఎంతో ఆవశ్యకమైంది. ఒక్క ఉరుకులో సర్వోన్నత స్థితిని చేరగలనని ఊహించినప్పుడు మనిషి పెద్దతప్పు చేస్తున్నాడు. ఒక్కరోజులోనే తాను వృద్ధు డు కాగలనని పసిబాలుడు యోచిస్తే అతగాడి ఊహ దోషభూయిష్ఠమైనదంటాం కదా. పుస్తకాల్లోగాని, బౌద్ధిక సమ్మతంలోగాని, హేతువాదంలోగాని మతం నెలకొని లేదనే ప్రగాఢ భావాన్ని మీరు సదా జ్ఞప్తిలో ఉంచుకొంటారని ఆశిస్తాను. హేతువాదం, సిద్ధాంతాలు, ప్రమాణపత్రాలు, ఉపదేశావళి, గ్రంథాలు, మత ఔపచారికాలు: ఇవన్నీ మతానికి తోడ్పడే వ్యవస్థలు; "ఆత్మసాక్షాత్కారమే మతం" గా ఎరుగండి. ఈశ్వరుడున్నాడని మనమంతా అంటాం. మీరు భగవంతుణ్ణి చూశారా? ఇదే ప్రశ్న. "దేవుడు స్వర్గ ంలో ఉన్నాడు" అని ఎవరో అనడం మీరు వినివుంటారు. "ఈశ్వరుణ్ణి చూశావా?" అని మీరు అతణ్ణి అడగండి. "చూశాను" అని అతడంటే, మీరు అతణ్ణిఎగతాళిచేసి అతణ్ణి ఉన్మాది అంటారు. పలువురి దృష్టి లో మతం ఒక రీతి బౌద్ధిక సమ్మతిగా గణింపబడుతుంది.

దాన్ని నేను మతం అనను. ఆ తీరు మతాన్ని పొందడంకంటే నాస్తికుడుగా ఉండటం ఉత్తమం. మతం మన బౌద్ధిక సమ్మతంమీదా, అసమ్మతంమీదా ఆధారపడదు. ఆత్మ ఉందని మీరంటారు. మీరు ఆత్మను చూశారా? అందరికీ ఆత్మ ఉండగా దాన్ని చూడజాలకపోవడమేమిటి? ఈ ప్రశ్నకు జవాబిస్తూ, ఆత్మను దర్శించే మార్గాన్ని మీరు కనుగొనాలి. అలా చేయలేకపోతే, మతాన్ని గురించి ప్రసంగించడం నిష్ప్రయోజనం. మతం సత్యసందీపితమైతే, అది మనకు ఆత్మను చూపించాలి; భగవంతుణ్ణి దర్శింపచేయాలి; మనలోని సత్యాన్ని చూపాలి. మీరూ నేనూ సుదీర్ఘ కాలం ఉపదేశావళిలో ఒకదాన్ని గురించీ, ప్రమాణపత్రాలలో ఒకదాన్ని గురించీ పోరు సల్పితే మనం ఏ సిద్ధాంతాన్ని కనుగొనలేం. యుగాలపర్యంతం మానవులు పోరాటం చేస్తున్నారు; దీనివల్లల భించిన ఫలం ఏమిటి? మేధాశక్తి ఆధ్యాత్మిక లక్ష్యాన్ని చేరలేదు. మనం మేధాశక్తిని అతిక్రమించిపోవాలి; మతం యొక్క తార్కాణం స్పష్టపరిశీలనలోనే, ప్రత్యక్షానుభూతిలోనే, ఆత్మసాక్షాత్కారంలోనే ఉంది. ఎదుట ఈ గోడ ఉందనడానికి ఋజువు అది మనకు కనబడటంలోనే ఉంది. ఇది ఉందా లేదా అని మనం కూలబడి యుగాల తరబడి వాదించినా, ఏ సిద్ధాంతాన్ని కనుగొనలేం; ఎదుటవున్న గోడను చూడండి;

చాలు. ప్రపంచంలోని జనమంతా ఇది లేదంటే వారి మాటను మీరు నమ్మరు. ఎందుకంటే మీ ప్రత్యక్షానుభూతి జగత్తులోని ఉపదేశావళికంటే, ప్రమాణపత్రాలకంటే మిన్న అయినదని మీరు తెలుసుకున్నారు.

ధార్మికవర్తనులు కాగోరితే, ముందుగా గ్రంథావళిని విసిరివేయండి. గ్రంథపఠనం ఎంత తక్కువ చేస్తే అంతమేలు చేకూరుతుంది; ఒక్క సమయంలో ఒక్క పనినే మొదలుపెట్టండి. ఆధునిక కాలంలో పాశ్చాత్యదేశాల్లో తన మెదడుకు నానాపదార్థాలను చేరవేయడం నైజమైపోయింది. జీర్ణం కాని నానారకాల భావపరంపర మెదడులో అల్లకల్లోలం కలుగచేస్తుంది. విశృంఖలరీతిలో భావాలు చెలరేగుతూండటంతో స్పష్టభావరూపం ఏర్పడటానికి అవకాశం ఉండదు. అనేక సందర్భాల్లోఈ స్థి తి ఒక రకమైన వ్యాధిగా పరిణమిస్తుంది. ఇది మతం కాదు; ధర్మం కాదు; కొందరు వ్యక్తులు ఒక రకమైన ఉద్వేగాన్ని అభిలషిస్తారు. వారికి భూతాలను గురించిన కథలను చెప్పండి. ఉత్తరధ్రువం నుంచి వచ్చేవారిని గురించి వారికి వినిపించండి. రెక్కలతోగాని, మరేరూపాలతోగాని ఏదో దూర ప్రాంతం నుంచి వింతజీవులు ఏతెంచి అదృశ్యులై తమను పరికిస్తూ, విలక్షణానుభూతిని కలిగిస్తారని వారితో చెప్పండి. ఈ విడ్డూరపుగాథలు విని, సంతృప్తిపడి వారు తమతమ ఇళ్ళకు

తరలిపోతారు. కాని ఇటువంటి నాలుగు గంటల్లోనే వాళ్ళు ... ఉత్తేజానుభూతికోసం వారు తపనపడుతూ ఉంటారు.
ఈ అనుభూతిని మతానుభూతి అంటారు. ఈ మార్గం క్షేమం కాదు. నిరంతరం వారిని ఉన్మాదాలయం వైపు నడిపిస్తుంది.

బలహీనులకు ఈశ్వరుడు అందడు. పూర్వోక్త అతిప్రకృత విశేషాలు మానవుణ్ణిశక్తిహీనుణ్ణి చేసి వదలుతాయి. కాబట్టి వారి దరిచేరవద్దు; వాటికి చేరువయ్యేవారి శక్తి సన్నగిల్లుతుంది; వారి మెదడులో విశృంఖలస్థితి విజృంభిస్తుంది; మనస్సుకు దుర్బలత దాపురిస్తుంది; ఆత్మ అవినీతి పాలబడుతుంది; దారుణ విహ్వలత దాపురిస్తుంది. మతం ప్రసంగాల్లోలేదని, కేవలం అది ఆత్మానుభూతిలో ఉందని విశ్వసించండి. అది పాండిత్యం కాదు మరి అస్తిత్వం. "దొంగతనం చేయవద్దు" అనే నీతివాక్యం అందరూ ఎరుగుదురు. అయితే ఏమిటి? దొంగకానివాడే నిజానికి దాన్లోని వాస్తవాన్ని ఎరుగును. "ఇతరులను హింసించకు" అనే నీతివాక్యం కూడ అందరికీ సుపరిచితమే. కాని ప్రయోజనం ఏమిటి? హింసించనివారే మహిమోపేతమైన భావానుభూతిని పొందుతారు. ఈ అనుభూతి మేరకే వారు తమ శీలాన్ని నిర్మించుకొంటారు. మతమంటే ఆంతరంగికానుభూతి. ఈ భావానుభూతిని మీరెప్పుడు పొందుతారో అప్పుడు మీరు ఈశ్వరారాధకులని పేర్కొంటాను. ఈ దివ్యానుభూతిని పొందడానికి మునుపు మీరా శబ్దంలోని వర్ణక్రమాన్ని మాత్రమే తెలుసుకున్నారని అంటాను. ఈ అనుభూతశక్తే మతమవుతుంది; ధర్మమవుతుంది. ఉపదేశావళిని, తత్త్వశాస్త్ర నీతిశాస్త్ర గ్రంథాలను పెద్దఎత్తున మీ మస్తకాల్లో నింపుకున్నా, మీకంతగా చేకూరే ప్రయోజనం లేదు; మీరెవరో, మీరు పొందిన అనుభూతి ఏదో గమనార్హం. కాబట్టి మతానుభూతి అవసరమైంది. ఇది ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదు. ఇది సుదీర్ఘప్రణాళిక. ఒక ఉదాత్తమైన విషయాన్ని, ఆశ్చర్యకరమైన అంశాన్ని విన్నప్పుడు మానవులు అది సులభంగా చేకూరుతుందని ఊహిస్తారు; క్రమానుష్ఠానంలోనేగాని ఆశయం సిద్ధించదని క్షణమైనా ఆగి వారు ఊహించరు. ఒక్క ఉరుకుతో దాన్ని అందిపుచ్చుకోవాలని ఉబలాటపడతారు. అది సర్వోత్కృష్టమైన లక్ష్యమైతే, అది కరతలామలకం కావాలనే కాంక్షిస్తాం. దాన్ని అందుకొనే శక్తి మనకు ఉందా లేదా అనే ఊహకు మనస్సులో చోటు ఇవ్వం. ఈ ప్రవర్తన వల్ల కలిగే ఫలం మనం ఏమీ చేయలేకపోవడమే. మీరొక మనిషిని చిన్నపుల్లతో లేవనెత్తి ఆ లక్ష్యంకేసి తోసివేయలేరు. క్రమానుష్ఠానంవల్లే మనకు లక్ష్యసిద్ధి సాధ్యమవుతుంది. కాబట్టి ఈ అనుష్ఠానంలోని తొలిభాగం 'వైదీభక్తి' అయింది. ఇది ఆరాధనలోని ప్రథమ దశ.

ఈ దశలోని ఆరాధన విధానాలేవి? అవి వివిధాలు. అంతరంగికానుభూతిని పొందడానికై స్థూలవస్తువులద్వారా సాధన సాగించి (పిల్లలు తొలుత వస్తువాచకరీతిని విద్యాభ్యాసం చేసేట్లు) క్రమక్రమంగా మనం భావమూలక సాధన సిద్ధిని పొందాలి. పసిపాపను ఉద్దేశించి ఐదును రెండుతో గుణిస్తే పది అవుతుందని చెబితే, విషయం దానికి బోధపడదు; కాని మీరు పది వస్తువులను తెచ్చి, రెండు వస్తువులు చొప్పున ఐదు శ్రేణులలో పేర్చి చూపిస్తే విషయం పసిపాపకు అర్థమవుతుంది. మతానుష్ఠానం సుదీర్ఘ, మందగమన విధానం. సాధకుడు మెల్లగా క్రమక్రమంగా ఈ మార్గాన్ని అనుసరించి పోవాలి. మనమంతా మతవిషయంలో పసిపాపలం. మనం వృద్ధులం కావచ్చు; లోకంలోని సమస్త గ్రంథాలను మనం చదివి ఉండొచ్చు. కాని మనమంతా ఆధ్యాత్మిక శిశువులం. మనం సిద్ధాంతాలను రాద్ధాంతాలను నేర్చివుండొచ్చు; కాని మన జీవితాల్లో ఆంతరంగికానుభూతిని పొందినదేదీ లేదు. మనం ఇప్పుడు స్థూ లవస్తు పరిశీలనతో, ఆకారాలతో, శబ్దాలతో, ప్రార్థనలతో, బాహ్యానుష్ఠానాలతో మన సాధనను ఆరంభించాలి. ఈ స్థూలవ్యవస్థలు వేల సంఖ్యలో ఉండొచ్చు. ఒకే ఆకారాన్ని అందరూ అంగీకరించనక్కర్లేదు. కొందరికి విగ్రహాల సహాయంతో పని జరుగవచ్చు; మరికొందరికి ఈ తీరు వ్యవస్థఅక్కరలేకపోవచ్చు; కొందరికి బాహ్యవిగ్రహపు ఆవశ్యకత ఉండొచ్చు; మరికొందరు ఆంతరంగిక ప్రతిమతో సాధన సాగించవచ్చు. హృదయఫలకంమీద విగ్రహప్రతిష్ఠ చేసుకొనే వ్యక్తి "నేను శ్రేష్ఠ తమ వ్యక్తిని. మూర్తి అంతరంగంలో ప్రతిష్ఠితమైతే, నిర్దిష్టక్రియయే అవుతుంది. కాని ఆ విగ్రహం బాహ్యంలో ప్రతిష్ఠితమైతే, అది విమర్శకు గురి అవుతుంది. ప్రతిమోపాసన అవుతుంది. ఈ రీతి ఉపాసనను నేను ప్రతిఘటిస్తాను" అంటాడు. చర్చ్ రూపంలోనో లేక ఆలయ రూపంలోనో ఒకడు ప్రతిమను నిర్మిస్తే అది పవిత్రమైనదని అతడు భావిస్తాడు; కాని ఆ స్థూలరూపం మనిషిదైతే, అది దోషభూయిష్టమైనదని అతడు ఆక్షేపిస్తాడు.

కాబట్టి వివిధ రూపాలద్వారా మనస్సు స్థూ లవస్తు సాధనను నిర్వహిస్తుంది. తదనంతరం క్రమక్రమంగా అమూర్త అవగాహనకు వస్తాం, భావానుభూతిని పొందుతాం. ఒకే ఆకారాన్ని అందరూ స్వీకరించనక్కర్లేదు. ఒక స్వరూపం నీకు మరొక స్వరూపం మరొకడికి అనుకూలంగా ఉండొచ్చు. ఇలాగే బహుసంఖ్యాకులకు వేర్వేరు రూపాలపట్ల మక్కువ నిలువవచ్చు. స్వరూపాలన్నీ ఒకే గమ్యస్థానానికి సాధకులను ప్రేరేపించగలిగినా, అన్ని మనస్సులకు అవి సరిపడక పోవచ్చు.

ఈ విషయం మీద దృష్టి సారించక మనమంతా మరొక దోషం చేస్తున్నాం. నా ఆశయం నీకు అనుకూలించనప్పుడు, నిర్బంధించి దాన్ని నీ తలకు కట్ట ప్రయత్నించడం ఎందుకు? నేను అనుసరించే చర్చ్ నిర్మాణ విధానం గాని, స్తోత్ర పఠన పద్ధతిగాని మీకు నచ్చక పోవచ్చు; ఆ విధానాన్ని, ఈ పద్ధతిని మీరుకూడ అవలంభించి తీరాలని నేనెందుకు మొండిపట్టు పట్టాలి? లోకంలో ముందంజవేసి చూడు; ప్రతీ మూర్ఖుడు తాను చేపట్టిన రూపమే నిర్దిష్టమైనదనీ, తదితర రూపాలన్నీ పైశాచికాలనీ, తానే విశ్వం సమస్తంలో జన్మించిన గణింపతగ్గఏకైక వ్యక్తిననీ అంటాడు. ఈ స్వరూపాలన్నీ మంచివే అనీ, ప్రాథమిక సాధనలో సహకారులనీ మనం ఘంటాపథంగా చెప్పుకోవచ్చు. మానవప్రకృతిలో వేర్వేరు మార్గాలు ఉండటంతో, వాటితో సమాన సంఖ్యగల రూపాలు మతంలో ఉండితీరాలి. వీటి సంఖ్య అధికమయ్యేకొద్దీ, లోకానికి మేలే చేకూరుతుంది. ప్రపంచంలో ఇరవై రీతుల మతరూపాలు ఉండటం మేలే అంటాను; అలాంటివి నాలుగువందలు ఉండటం మరింత మేలు అంటాను. వాటిలోనుంచి అనుకూలమైన వాటిని ఎన్నుకోవడానికి గొప్ప అవకాశం మానవుడికి లభిస్తుంది. మతాల సంఖ్యా, మతభావాల సంఖ్యా అధికమై, రానురాను మరింత హెచ్చు అయినా మనం ఆనందించాలి. ఎందుకంటే ప్రతీ వ్యక్తీ వాటివల్ల అభ్యుదయం పొందగలడు. వాటివల్లమానవాభ్యుదయం సుసాధ్యం. ప్రతీ మనిషికీ వ్యక్తిగతమైన మతం, మరొక మతంతో భిన్నంగా ఉండటానికి కావల్సినన్ని మతాలు ఈశ్వరేచ్ఛవల్లవృద్ధి అవనీ. భక్తి యోగంలోని అభిప్రాయం ఇది.

ఈ చర్చ్‌లో మనం గ్రహించాల్సిన చిట్టచివరి భావం ఇది: నా మతం మీది కాదు, మీ మతం నాది కాదు. మీ లక్ష్యమూ, నా లక్ష్యమూ ఒక్కటే అయినా, ప్రతీ మనిషి వ్యక్తిగత మానసిక ప్రవృత్తిని బట్టే, వ్యక్తిగతమైన మార్గాన్ని అనుసరించే ముందంజ వేయాలి. ఈ మార్గాలు వివిధాలైనప్పటికీ అవన్నీ సత్యప్రదీప్తాలై ఉండాలి. ఎందుకంటే అవన్నీ సాధకుణ్ణి ఒకే గమ్యస్థానానికి చేరుస్తాయి. ఒక మార్గం యథార్థమైనదనీ, తక్కినవి కావనీ భావించరాదు. తన మనస్సుకు నచ్చిన మార్గాన్ని ఎన్నుకోవడం భక్తివాఙ్మయంలో ఇష్టమార్గాన్ని అనుసరించడంగా పేర్కోబడుతుంది.

ఇక శబ్దాల జోలికి వద్దాం. మీరంతా శబ్దాలకు ఎంత శక్తి ఉందో వినే ఉన్నారు. పదాల ప్రభావం ఎంత అద్భుతమైనదో ఊహించండి. ప్రతీ గ్రంథం – అది బైబిల్ కావచ్చు, కొరాను కావచ్చు, వేదాలు కావచ్చు – శబ్ద శక్తి సంభరితమైనది. మానవాళి మీద కొన్ని శబ్దాలకున్న ప్రభావం అద్భుతం.

చిహ్నాలనే మరొక రీతి ఆకారాలున్నాయి. వీటికి మానవ మానసం మీది శక్తి ప్రగాఢమైనది. కాని మతంలోని చిహ్నాలు అనిశ్చిత సృష్టిసముద్భవాలని భావించడం కుదరదు. అవి సహజ వ్యక్తీకరణాలని ఎరుగుదుం. మనం చిహ్నాల ద్వారా ఊహిస్తూంటాం. మనం ఉచ్చరించే శబ్దాలన్నీ మనస్సులోని భావాల చిహ్నాలే. వేర్వేరు వ్యక్తులు, వేర్వేరు చిహ్నాలను, హేతుజ్ఞానహీనులై ఉపయోగిస్తూంటారు. హేతువు అంతరంగ గర్భితమైనది. ఈ చిహ్నాలు లేక గుర్తులు ఊహలనంటి ఉంటాయి. ప్రతీ ఆలోచన ఒకానొక సంకేతాన్ని వెలువరించేట్లుప్రతి చిహ్నమూ ఫలానా ఆంతరంగిక భావాన్ని సూచిస్తుంది.

కాబట్టిభక్తిలోని ఒక భాగం వివిధ చిహ్నాల, శబ్దాల, ప్రార్థనల విషయాలను వెల్లడిస్తూంటుంది.

ప్రతీ మతంలోను ప్రార్థనల విషయం ఉంది. కాని మీరొక ముఖ్యాంశాన్ని మనస్సులో ఉంచుకోవాలి – ఆరోగ్యంకోసం, సంపదకోసం ఆరాధించడం భక్తి అనిపించుకోదు. అది కర్మ లేక ప్రశంసనీయమైన చర్య అనిపించుకొంటుంది. శారీరక లాభానికై జరిపే ప్రార్థన కర్మ మాత్రమే, స్వర్గప్రాప్తి మొదలైన స్వప్రయోజనాలకై గావించే ఆరాధనకూడ ఇలాంటిదే. ఈశ్వరుణ్ణిప్రేమించాలనే ఉద్దేశం ఎవరికివుందో, భక్తుడు కావాలనే కాంక్ష ఎవరికి ఉందో అతడు ఈ తీరు స్వార్థచింతనతో కూడిన ఆరాధనాన్ని విడనాడాలి. ఆలోక ప్రదీప్త సీమల్లో ప్రవేశించాలనే ఉద్దేశం ఎవరికుందో అతని ఈ తీరు క్రయవిక్రయ భక్తి విధానాన్ని, ఈ 'బేరసారాల' మతాన్ని పరిత్యజించి ఆ సీమల్లో ప్రవేశించాలి. మీరు ఆరాధించేది మీకు లభించదని నేను అనడం లేదు. మీ కోరికలన్నీ ఫలిస్తాయి. కాని ఈ తీరు భక్తి విధానం, ఈ తీరు ప్రార్థన బిచ్చగాడి మతం అనబడుతుంది. "గంగాతీరంలో నివసిస్తూ నీటికోసం చిన్న బావిని తవ్వేవాడు నిజంగా మూఢుడు. వజ్రాల గని వద్దకొచ్చి, గాజు పూసల కోసం వెదకేవాడు నిజానికి వెర్రివాడు." ఎప్పుడో ఒకప్పుడు శరీరం మృత్యువాతబడుతుంది.

[illegible]

పిడికిట పట్టుకోలేం. పట్టుకోకుంటే పోయిందేమిటి? ఈ శరీరం పోయేదే! ఈ వస్తువులను లెక్కపెట్టేవారెవరు? మంచి చేయబడితే స్వాగతం లేకుంటే పోనీయండి. అవి వచ్చేటప్పుడు స్వీకరించేవారు ధన్యులు. అవి రానప్పుడు గుక్కిళ్ళు మింగనివారూ ధన్యులే. చక్రవర్తులకు చక్రవర్తి అయిన భగవంతుడి సమక్షానికి రావాలని మనం ప్రయత్నిస్తున్నాం. ఆయన మ్రోలకు మనం భిక్షుక వస్త్రాలతో పోరాదు. ఒక సామాన్యుడైన రాజు వద్దకు పోవాలని మనం ఉద్దేశించినా, భిక్షుక వేషంతో ఉంటే మనకు ప్రవేశం లభిస్తుందా? లభించదు. మనం దూరానికి గెంటివేయబడతాం. ఇలావుంటే మనం సార్వభౌములకు సార్వభౌముడైన అతడి సమక్షానికి పోదలిచినప్పుడు బిచ్చగాడి చింపిరిదుస్తుల్లో వెళ్ళలేం. అంగడివాడికెన్నడూ అక్కడ ప్రవేశం లేదు; క్రయవిక్రయాలకు అక్కడ చోటులేదు. క్రయవిక్రయాలు చేసే వారిని దేవాలయంనుంచి ఏసు తరిమివేశాడనే కథను మీరు బైబిల్‌లో చదివారు కదా! క్షుద్ర వస్తువులకై ప్రార్థించొద్దు. శారీరక సౌఖ్యాలనే మీరు అన్వేషిస్తే, మనిషికీ పశువుకీ వ్యత్యాసం ఏముంటుంది? ఈ స్థితికంటే ఉదాత్తమైన స్థితిని గురించి మీరు యోచించండి.

భక్తుడు కాగోరేవాడు స్వర్గంమీది కాంక్షను, భోగం మీది బుద్ధిని పరిత్యజించాలనే విషయం నిర్వివాదాంశమని గ్రహించాం. ఈ వాంఛలను పరిత్యజించడం ఎలా అనే ప్రశ్న తల ఎత్తుతోంది. మానవులు దుర్దశపాలబడుతూ ఉంటారెందుకు? బానిసలవడంతో క్షుద్రభావశృంఖలాలవల్ల, మానసికంగా బంధింపబడటంవల్ల, ప్రకృతి చేతిలో ఆటబొమ్మలవడం వల్ల, ఆటవస్తువు మాదిరి ఇటూ అటూ విసిరి వేయబడటంవల్ల వారు దుఃఖితులవుతూంటారు. దేనివల్లనైనా నేలకూలే ఈ శరీరాన్ని గురించి అనవరతం భయపడుతున్నాం.

లేడి రోజుకు సామాన్యంగా అరవై డెబ్బై మైళ్ళదూరం పరుగెత్తుతుందని నేను చదివాను. ఈ పరుగుకు కారణం దాని

భయమే! లేడి దుర్దశకంటే మన దుర్దశ మరింత హీనమని మనం గ్రహించాలి. జింకకు కొంత విశ్రాంతి లభిస్తుంది;
మనకది హుళక్కి. నోట కరచుకోవడానికి కొన్ని గరికపోచలు లభిస్తే జింక తృప్తిపడుతుంది. మనకి సంతృప్తిలేదు; నిరంతరం మనం మన వాంఛలను పెంచుకొంటూన్నాం. ఇవి కావాలనుకొనే కాంక్ష వ్యాధిగ్రస్తమైంది. మన మానసిక గ్రంథులు పూర్తిగా సడలిపోయాయి; అస్వాభావిక స్థితి మనలో పెంపొందింది; కాబట్టి సహజమైనదేదీ మనలను సంతృప్తి చేయలేదు. రోగపరమైన పదార్థాలకోసం మనం పాకులాడుతూంటాం; అసహజ ఉద్రేకానికై తహతహలాడుతూంటాం. అసహజ ఆహారపానీయాలు, పర్యావరణం, జీవనం మనకు కావాలని ఉరకలెత్తుతూంటాం. భయాన్ని గురించి యోచించేటప్పుడు మన బతుకులు వెరపుల మూటలుగాక మరేమని ప్రశ్నించుకోవలసి వస్తుంది. లేడికి పులులు, తోడేళ్ళు మొదలైన అడవి మృగాలవల్ల ఎదురయ్యే భీతి మాత్రమే ఉంది. కాని మానవుడు యావత్తు విశ్వాన్ని చూసి ఉలికిపడుతూంటాడు.

“దీన్నుండి మనకు నిష్కృతి లభించడం ఎలా?” అనే ప్రశ్న తల ఎత్తుతోంది. ప్రయోజనవాదులు (Utiliterians)

“భగవంతుణ్ణిగురించిగాని, మరణానంతరస్థితిని గురించిగాని ప్రసంగించవద్దు; వీటిని గురించి మనకు ఏమీ తెలియదు. ఈ
ప్రపంచంలోనే మనం సుఖంగా బతుకుతాం” అంటూంటారు. ఈ సుఖజీవనం సుసాధ్యమైతే, వారి ఉపదేశాన్ని నేనే మొట్టమొదట శిరసావహిస్తాను. కాని ప్రపంచం మనలను అలా బతుకనీయదు. మనిషి ప్రకృతికి బానిసై ఉన్నంతకాలం సుఖం అతడికి గగనకుసుమమే. సుఖేచ్ఛతో ముందంజ వేయడానికై అతడు పెనగులాడేకొద్దీఅతగాడి మనస్సు వాంఛచేత కప్పబడి ఉంటుంది. సుఖ జీవితానికై మీరెన్నెన్నో పరికల్పనలు సృష్టించుకొంటున్నారు. ఎన్నేళ్ళ నుంచి మీరిలా చేస్తూన్నారో ఎరుగను. కాని సంవత్సరం తరువాత సంవత్సరం దొర్లినకొద్దీపరిస్థి తులు మరింత విషమిస్తున్నాయి. రెండువందల ఏళ్ళకు పూర్వం ప్రాచీన వసుంధరలో మనుషుల వాంఛలు ఎంతో తక్కువగా ఉండేవి. వారి జ్ఞానం ప్రస్తుతం ఆంకిక విధానంలో అధికమయ్యేకొద్దీవారి వాంఛల సమూహం గుణోత్తర విధాన ఒకదాన్ని మించి వేరొకటి హెచ్చుతూంటుంది. ‘ముక్తి’ లభిస్తే మన కోరికలన్నీ ఫలిస్తాయని మనం ఊహిస్తూంటాం. ముక్తి అంటే స్వర్గప్రాప్తి అని భావిస్తాం. కాబట్టి స్వర్గా నికి పోవాలని మనం మక్కువ పడుతూంటాం. ఈ దాహం తీరేది కాదు; ఇది చిరంతన దాహం. ఏదో ఒకటి కావాలనే నిరంతర కాంక్ష! ఒకడు బిచ్చగాడై ఉన్నప్పుడు అతడు ధనాన్ని కాంక్షిస్తాడు. ధనం చేకూరినప్పుడు ఇతర వస్తువులమీద అతడి మనస్సు వాలుతుంది. సమాజం, దాని తరువాత మరొకటి అతడి చిత్తాన్ని ఆకర్షిస్తుంది. విశ్రాంతి అనేది ఉండదు. ఈ దాహాన్ని

తీర్చడం ఎలా? మనం స్వర్గంలో ప్రవేశిస్తే, మన కోరికలు పెరుగుతాయి. పేదకు పెన్నిధి దొరికితే, అతడి కాంక్ష తీరదు. అతడి స్థితి అగ్నిలో ఆజ్యం పోసినట్లుంటుంది. స్వర్గంలో ప్రవేశించడమంటే విశేషంగా ధనం ఆర్జించడమని చెప్పవచ్చు. వాంఛలప్పుడు మరింతగా పెరుగుతాయి. ప్రపంచంలోని వివిధ మతగ్రంథాల్లో స్వర్గా న్ని అలంకరించిన పలువురు మానవులను గురించిన వృత్తాంతాలను చదువుతూంటాం. వారు అనవరతం దాన్లోసుఖులై ఉండలేదు; స్వర్గ ప్రాప్తిమీది బుద్ధి సుఖానికై కాదా? ఈ ఇచ్ఛకు మానవుడు నీళ్ళు వదలుకోవాలి. స్వర్గకాంక్ష వైశిష్ట్యహీనమైనది, ఎంతో క్షుద్రమైనది. కోటీశ్వరుడనై అందరిమీద పెత్తనం చెలాయిస్తాననే కోరిక వంటిదే అది. ఈ స్వర్గాలు అనేకం ఉన్నాయి; కాని వాటిద్వారా మత ద్వారాల్లోను, ప్రేమద్వారాల్లోను ప్రవేశించే హక్కు మీకు లభించదు.

# ప్రధాన చిహ్నాలు

'ప్రతీక', 'ప్రతిమ' అనే రెండు సంస్కృత శబ్దాలు ఉన్నాయి. 'ప్రతీక' అంటే దాపున చేరడం — సమీపించడం. అన్ని దేశాలలోను వివిధ రీతుల ఆరాధనలు ఉన్నాయి. ఉదాహరణగా ఈ దేశాన్నే తీసుకొందాం. మీలో కొందరు యోగుల ప్రతిమలను ఆరాధిస్తారు. కొన్ని రకాల రూపాలను, చిహ్నాలను పూజించేవారు ఉన్నారు. మానవులకంటే ఉచ్చస్థితిలోని కొందరు జీవులను ఆరాధించేవారు ఉన్నారు. వీరు మరణించినవారి ఆత్మలను ఆరాధిస్తారు. వీరి సంఖ్య అతివేగంగా పెరుగుతోంది. ఇక్కడ వీరి సంఖ్య ఎనభై లక్షలని విన్నాను. మరింత ఉచ్చదశలోని ప్రాణులను ఆరాధించేవారు కొందరున్నారు. ఈ ఆరాధ్యజీవులు దేవతలు, అనేక రీతుల దేవుళ్ళు మొదలైనవారు. ఈ వివిధ రీతుల ఆరాధనలను భక్తియోగం నిరసించదు. ఇవి 'ప్రతీక' రీతులని వ్యవహరించబడుతున్నాయి. వీరు చేసేది ఈశ్వరారాధన కాదు. కాని ఈశ్వరారాధనకు దగ్గర చేర్చేది. ఈ ఆరాధనకు అది సన్నిహిత సోపానపరంపర వంటిది. 'ప్రతీక' సేవ మోక్షప్రదాయిని కాదు. కొన్ని ప్రత్యేక ఆశయాల సిద్ధికోసం ఈ తీరు పూజ చేస్తూంటారు. ఈ ఉదాహరణాన్ని పరికించండి: ఒక వ్యక్తి తన పితృదేవతలనుగాని, మరణించిన మిత్రులనుగాని ఆరాధిస్తే, అతగాడికి కొన్ని శక్తులు చేకూరుతాయి; ఈ ఆరాధ్య దేవతలనుంచి కొంత విషయ వృత్తాంతం లభించవచ్చు. ఈ దేవతలనుంచి చేకూరే ప్రత్యేక ప్రయోజనం 'విద్య' అనబడుతుంది — ఇది ప్రత్యేక జ్ఞానం. కాని సర్వోత్కృష్టాశయమైన మోక్షం ఈశ్వరారాధన వలననే లభిస్తుంది. కొందరు ప్రాచ్యపండితులు, వేదాలను వ్యాఖ్యానించే సమయంలో, దైహిక స్వరూపంలో నిరూపించబడిన ఈశ్వరుణ్ణి సైతం 'ప్రతీక' మని ఊహిస్తారు. వ్యక్తిగత భగవంతుడు 'ప్రతీకం' కావచ్చు; కాని 'ప్రతీకసముదాయం' వ్యక్తిగత భగవంతుడు కాదు; అవ్యక్తగత భగవంతుడూ కాదు. ఈశ్వరభావనతో అవి ఆరాధించబడజాలవు. ఈ వివిధ 'ప్రతీక' లను దేవతలనిగాని, పితృదేవతలనిగాని, మహాత్ములని (పవిత్రజీవులని, యోగులని)గాని, పరలోకవాసులనిగాని ఆరాధించేవారు తమకు మోక్షం లభిస్తుందని తలచడం పెద్దపొరపాటే అవుతుంది. పైగా వారు కొన్ని శక్తులను అలవరచుకొంటారు; కాని ఈశ్వరుడొక్కడే మనకు ముక్తిని ప్రసాదించగలడు. ఇలా అంటే ఆ ఆరాధనాన్ని నిందచేయరాదు. దానివల్ల కొంత ఫలం లభిస్తుంది. ఆ ఆరాధనంకంటే మహత్తరమైనదాన్ని అవగాహన చేసుకోలేని మనిషి కొంత శక్తిని, కొంత పరితోషానుభూతిని దానివల్ల పొంది, విశేషానుభూతి లభించాక, మోక్షార్హతను పొందాక తనంత తానే ప్రతీకలను పరిత్యజిస్తాడు.

పైన పేర్కొబడిన వివిధ రీతుల 'ప్రతీకారాధన' లలో ఎంతో వ్యాప్తి చెందిన ఆరాధనం విగతజీవులైన మిత్రులను ఉద్దేశించి చేసే ఆరాధనే. మనుష్య ప్రకృతిలో వ్యక్తిగతమైన అనురాగం, మిత్రులపట్ల చూపబడే ప్రీతి ఎంతో ప్రగాఢమై ఉండటంతో, వారు అస్తమించినప్పుడు వారిని తిరిగి చూడాలనే మక్కువపడుతూ వారి స్వరూపాలను పట్టుకొని ప్రాకులాడతాం. ఈ స్వరూపాలు సజీవాలై ఉన్నప్పుడు తరచూ మారుతూంటాయనే సంగతిని మరచిపోతాం. అవి మృత్యువువాత పడినప్పుడు, మార్పుచెందక నిరంతరం అవి గడచిన భావనను అనుసరించి ఉంటాయని ఊహించి, అలాగే వాటిని చూడాలని ఉద్దేశిస్తాం. అంతేకాదు, నాకొక మిత్రుడుగాని, పుత్రుడుగాని ఉంటే సజీవుడై ఉండగా అతడు పలుగాకియై ఉన్నాకూడా, మరణించాక అతడు మహత్తర గుణవిభూతితో వెలసిన యోగిపుంగవుడని నేను ఊహిస్తాను; అతడు ఆరాధ్యదేవత అవుతాడు. ఒక పసిపిల్లవాడు మరణించినప్పుడు అతడి శరీరాన్ని దహనంచేయక, భూస్థాపితం చేసి అక్కడ ఒక గుడిని కట్టేవారు కొందరు భారతదేశంలో ఉన్నారు. ఆ గుడిలో ఆ పసివాడు దేవుడై వెలుగొందుతాడు. అనేక దేశాలలో ఈ రీతి మతాచారం ప్రచలితమై ఉంది. సమస్త మతాలకు ఈ రీతి ఆచారం మూలాధారం అని తెలిపే తాత్త్వికులకు కొదువలేదు. తమ ఊహ నిజమైనదని వారు రూఢిపరచలేరు. ఈ రీతి 'ప్రతీకోపాసన' వల్ల మనకు మోక్షం లభించదని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఈ రీతి ఆరాధనవల్ల గొప్ప ముప్పుకూడ దాపురించవచ్చు. ఈ 'ప్రతీకలు' ఈశ్వరారాధనానికి క్రమసోపానాలై ఉండేటంతవరకు నిర్దిష్టాలే. కాని ఈ క్రమాభ్యుదయాన్ని కాంచేవారు నూటికి ఒక్కరు మాత్రం ఉంటారు. తొంభై తొమ్మండుగుర్రు ఆజన్మం 'ప్రతీకలనే' అంటపెట్టుకొని ఉంటారు. "దేవాలయాలో జన్మించడం ఎంతో మేలే. కాని వాటిలోనే గిట్టడం ఎంతో కీడు." స్పష్టవివరణలో విషయం ఇలా బోధపడుతుంది. ఒక మతశాఖలో జన్మించి దాని శిక్షణను పొందడం

ఎంతో మంచిది. ఆ శిక్షణవల్ల మనలోని మంచిగుణాలు వ్యక్తాలవుతాయి. కాని అనేక దృష్టాంతాలను పరిశీలించినప్పుడు మనకు దృగ్గోచరమయ్యే దృశ్యం ఇది: చిన్నదైన ఆ మతసమాజశాఖలోనే జనం కట్టుబడివుండి, దాన్లోనే మరణిస్తారు. దాన్లోనుంచి వారు బయటకు రారు; వృద్ధిచెందరు. 'ప్రతీకోపాసన' లలో తల ఎత్తే పెద్దఅపాయం ఇదే. ఈ క్రమసోపానాలను సాధకుడు తప్పక అనుసరించి సాగిపోవాలనేవారు ఉన్నారు. కాని వాటిని దాటిపోయేవారు సాధారణంగా కనపడరు. ఒకడు కాటికి కాళ్ళు చాచుకొని ఉన్నా, వాటిని అంటిపెట్టుకొనే ఉంటాడు. యువకుడొకడు చర్చ్‌కి పోకపోతే,

[illegible] స్వరూపాలతో, ప్రతీకలతో, ప్రారంభిక వ్యవస్థలతో అతడికి ఇక ప్రసక్తి ఎందుకు ఉండాలి?

ప్రతీకోపాసనలో గ్రంథారాధన బలవత్తరమైనది; ఎంతో బలవత్తరమైనది. ప్రతి దేశంలోను గ్రంథమే దేవుడవుతూ ఉండటం మీరు కనుగొంటారు. భగవంతుడు మానవుడై అవతరిస్తాడనే మతశాఖలు మా దేశంలో ఉన్నాయి. కాని అవతారపురుషుడు కూడ వేదాలను అనుసరించవలసిందే. అతడి ఉపదేశాలు వేదాధికారం మీద ఆధారపడకపోతే, ప్రజలు వాటిని స్వీకరించరు. హిందువులు బుద్ధుణ్ణిఆరాధిస్తారు. కాని ప్రజలనుద్దే శించి "మీరు బుద్ధుణ్ణిఆరాధిస్తారు కదా! అతడి ఉపదేశాలను ఎందుకు స్వీకరించరు?" అని మీరు ప్రశ్నిస్తే, "బౌద్ధులు వేదాన్ని స్వీకరించరు, కాబట్టివారి ఉపదేశాలను మేం పెడచెవినపెడతాం" అని వారు ప్రత్యుత్తరం ఇస్తారు. గ్రంథారాధనలోని అర్థం ఇది. ఒక గ్రంథం పేరిట ఒక వ్యక్తి ఎన్నైనా అసత్యాలను చెప్పవచ్చు. భారతదేశంలో నేనేదైనా కొత్త అంశాన్ని ఉపదేశించ పూనుకొని, నా ఉపదేశానికి నేనే ప్రమాణం అని, నా బుద్ధికుశలతే ప్రమాణమని నేను తెలిపితే, నా ఉపదేశాన్ని ఆలకించడానికి ఎవ్వరూ ముందుకురారు; కాని వేదాలనుంచి కొంత విషయాన్ని నేను పేర్కొని నా వ్యాఖ్యానపు గారడీని ప్రదర్శించి, అసంభవార్థాన్ని నిరూపించి దాన్లోని హేతుసంబద్ధమైన విషయాన్ని యావత్తు ఖూనీచేసి, వేదవ్యాఖ్యానమని నేను కానికూతలను ఉచ్చరించినా, మూర్ఖులు మూకమూకలై నా వెంటపడతారు. కొందరు వ్యక్తులు సాధారణ క్రైస్తవులను ఉలికిపడేట్టుచేసి అయోమయస్థితిలో అర్థం ఎరుగని స్థితిలో పడేసి వారిని ఉక్కిరిబిక్కిరిచేసే ఒక విధమైన క్రైస్తవమతాన్ని బోధిస్తారు; కాని వారు "ఇది క్రీస్తు బోధన" అని వచిస్తారు. పలువురు వారిచుట్టూగుమిగూడతారు. వేదాలలోగాని, బైబిల్ లోగాని లేని నూతనాంశం ప్రజలకు అక్కరలేదు. విషయం స్నాయవికశక్తికి సంబంధించింది. ఒక అపూర్వ విషయం — ఆకర్షణీయాంశం మీ చెవులలో పడినప్పుడు మీరు ఉలికిపడతారు; లేక ఒక నూతన వస్తువును పరిశీలించినప్పుడు ఉలికి పడతారు. ఇది శారీరక మానసిక విన్యాసానికి సంబంధించిన విషయం. ఊహలను గురించి ఈ అనుభూతి విశేషమై ఉంటుంది. ఒక తీరులో ఆలోచించడానికి అలవాటుపడిన మనస్సుకు ఒక కొత్తభావాన్ని అర్థం చేసుకోవాలంటే ఎంతో శ్రమ కలుగుతుంది. కొత్త తలపు ఆ మార్గపు సమీపంలో నిలువాలి; కాని సునీతికాదు. మత సంస్కర్తలు, ఉదార మత ప్రబోధకులు అనదగినవారు నేడు సమాజంలో

పరస్పర విరుద్ధాలైన ఊహలను ఎలా వెదజల్లుతున్నారో ఊహించండి. క్రైస్తవులైన భౌతికశాస్త్రవేత్తల ప్రబోధాల ప్రకారం ఏసు ఒక గొప్ప చికిత్సకుడు; ఆధ్యాత్మికవాదుల ఊహల మేరకు అతడు మానసిక తత్త్వవేత్త; దివ్యజ్ఞానసమాజ సభ్యుల ఉద్దేశాల ప్రకారం అతడొక మహాత్ముడు. ఈ సిద్ధాంతాలన్నీ ఒకే మత గ్రంథంనుంచి గ్రహించబడినవి. ఒకానొక వేదగ్రంథంలో ఇలా వివరించబడివుంది: " 'సత్' మాత్రం ఉండేది. ఓ! ప్రియం కూర్చే వాడా! ఆదిలో మరేదీ లేదు."* ఈ గ్రంథంలోని 'సత్ ' శబ్దానికి పలు రీతుల వ్యాఖ్యానాలు కావించబడినాయి. ఈ శబ్దార్థం 'అణువు' అనీ, ఈ అణువునుంచి ప్రపంచం సృష్టించబడినదనీ అణువాదులు వచిస్తారు. ఈ శబ్దార్థం 'ప్రకృతి' అనీ, ప్రకృతినుంచీ సమస్తం ఉద్భవించినదనీ ప్రకృతివాదులు అంటారు. ఈ శబ్దార్థం కేవలం 'శూన్య' మనీ, 'శుద్ధ పూజ్య' మనీ, శూన్యంనుంచే సమస్త సృష్టీ తలచూపినదనీ శూన్యవాదులు వాకొంటారు. ఆ శబ్దార్థం 'దేవుడ' ని ఆస్తికవాదులూ, 'పూర్ణసత్త' లేక 'పరబ్రహ్మ' మని అద్వైతవాదులూ పలుకుతారు. వీరంతా ఒకే గ్రంథాన్ని తమ ప్రమాణంగా పరిగణిస్తారు.

గ్రంథారాధనలోని లోపాలివి. కాని ఈ ఆరాధనవల్ల గొప్ప ప్రయోజనం కూడ ఉంది. అది శక్తిని ప్రసాదిస్తుంది.

గ్రంథం మీద ఆధారపడిన మతశాఖలు తప్ప తక్కిన మతశాఖలన్నీ అదృశ్యమై పోయాయి. గ్రంథాలను పరిమార్చేదేదీ లేదు. మీలో కొందరు పారశీకులను గురించి వినివుంటారు. వారు ప్రాచీన పర్షియన్లే. ఒకప్పుడు వారు సుమారు పదికోట్లమంది

ఉండేవారు. వారిలో అనేకులు అరబ్బులకు పరాజితులై, మహమ్మదీయమతంలో కలుపబడినారు. తమను బాధించే వారి పట్టునుంచి కొద్దిమంది తమ గ్రంథంతో ఎలాగో తప్పించుకుపోయారు. ఇదే నేడు వారికి ఆధారమై వారిని నిలబెడుతోంది. స్థూలదృష్టికి గోచరించి, స్పర్శవల్ల స్పష్టమైన దైవం గ్రంథం. యూదుల సంగతిని యోచించండి. వారికొక గ్రంథం లేకపోయివుంటే, వారు ప్రపంచంలో ఎప్పుడో అదృశ్యులైవుండేవారు. అది వారిని నిలిపింది. ఘోరమైన అత్యాచారం వారినెంత వేధించినా, వారి 'టాల్మడ్' వారిని పరిరక్షించింది. గ్రంథంవల్ల చేకూరే మేళ్ళలో ఎంతో ముఖ్యమైనదిది;

దానివల్ల ప్రతీ విషయం సుస్పష్ట నిర్వచనం పొందుతుంది. అవి ప్రతీకలలోను ఉంది అనుకూలంగా చేతికి అందేదిగా ఉంది.
పూజాపీఠికకు మీద గ్రంథాన్ని ఉంచడం; అందరికీ అది కనబడుతుంది. ప్రతి వ్యక్తి మరింతగా గ్రంథాన్ని పఠిస్తాడు. పక్షపాతభావంతో ప్రసంగిస్తున్నానని మీరు అనుకుంటారేమో! పుస్తకాలవల్ల కలిగిన మేలుకంటె కీడే ఎక్కువని నా ఊహ. హానికరాలైన ప్రబోధాలెన్నో వాటిలో ఉద్భవించాయి. విస్తృతదృష్టిని అంతగా ఎరుగని మతవిశ్వాసాలన్నీ పుస్తకాలలోనే పుట్టాయి. లోకంలో చెలరేగిన అత్యాచారమూ, అంధమతానురాగమూ పుస్తకాలలో పుట్టిన పుట్టుకలే. ఆధునిక కాలంలో పుస్తకాలు భూమ్మీద ఎందరెందరో అనృతవాదులను సృష్టిస్తున్నాయి. ప్రతీ దేశంలోను కనిపించే ఈ అనృతవాదుల సంఖ్యను చూసినప్పుడు నేను ఆశ్చర్యచకితుడనవుతూంటాను.

ప్రతిమ లేక విగ్రహారాధన అంశాన్ని ప్రస్తుతం పరికిద్దాం. ఏదో ఒక రూపంలో సమస్త ప్రపంచంలోను విగ్రహాలు కానవస్తున్నాయి. కొందరు మానవ స్వరూపంలో విగ్రహాన్ని నిర్మిస్తారు. ఇది సర్వోత్కృష్టమైన స్వరూపం. నేను విగ్రహారాధన చేయవలసివస్తే, పశురూపంలోగాని, లేక ఏదైనా భవనరూపంలోగాని మరే ఇతర రూపంలోగాని కాక ఆ విగ్రహం మానవరూపంలో ఉండేట్లు చూస్తాను. ఒక్కో మతశాఖ ఒక్కోరీతి విగ్రహమే నిర్దిష్టమైనదని ఊహిస్తుంది. మరొక మతశాఖ అది దోషభూయిష్టమైనదని వాకొంటుంది. భగవంతుడు పక్షి రూపంలో గోచరించడం మంచిదని క్రైస్తవుడు ఊహిస్తాడు. హిందువులు మత్స్యావతారాన్ని విశ్వసించేటట్లు వారు విశ్వసించరు. చేపరూపంలో దేవుడు గోచరించడం పెద్ద దోషమని, మూఢవిశ్వాస సూచకమని వారంటారు. మూర్తి ఒకటి పెట్టె రూపంలో నిర్మించబడినట్లూ , దానిమీద ఇద్దరు దేవతలు ఆసీనులైనట్లూ, లేక దానిమీద ఒక గ్రంథం ఉంచబడినట్లూ దృగ్గోచరమైతే అది నిర్దిష్టనిర్మాణమని యూదులు వచిస్తారు. కాని అది ఒక పురుషరూపంలోగాని స్త్రీ రూపంలోగాని నిర్మించబడితే వారు ఉలిక్కిపడతారు. మహమ్మదీయులు ప్రార్థన చేసేవేళ 'కాబా' అనబడే నల్లని శిలవున్న దేవాలయ స్వరూపాన్ని మానసికంగా భావనచేసి, పశ్చిమంగా తిరిగితే తప్పులేదని ఎంచుతారు. కాని చర్చ్ రూపంలో విగ్రహభావన జరిగితే, అది తగని విగ్రహారాధన అని వారు ఎలుగెత్తి వచిస్తారు. విగ్రహారాధనలోని లోపం ఇది. కాని ఇవి అన్నీ అవసరమైన సోపానాలు.

ఈ విషయంలో మన విశ్వాసం ఏమిటో గమనించడం ముఖ్యం. మన అనుభూతి ఏమిటని మనం ప్రశ్నించుకోవాలి. ఏసుగాని, బుద్ధుడుగాని, మోసెస్‌గాని ఏం చేశారో అనే విషయాన్ని (ఆ విధంగా మనమూ చేస్తేనేగాని) పాటించనక్కర్లేదు. మనం ఒక గదిలో తలుపులు మూసుకొని కూర్చుని మోసెస్ ఏం తిన్నాడో అని యోచిస్తూంటే, మన ఆకలి తీరదు; మోసెస్ ఏం చింతించాడో అనే విషయం మనలను రక్షించదు. ఈ విషయాలను గురించిన నా ఊహలు స్పష్టమైనవి; సమగ్రమైనవి. ప్రాచీనార్యుల ఊహలతో నా ఊహలు సరిపడితే నా తలపులు నిర్దిష్టాలని ఒక్కొక్కప్పుడు నేను భావిస్తూంటాను; వారి ఊహలు నా ఊహలతో సరిపడితే వారి భావాలు నిర్దిష్టాలైనవని వేరొకప్పుడు నేను అభిప్రాయపడుతూంటాను. స్వతంత్రయోచనలో నాకు విశ్వాసం ఉంది. పవిత్ర జీవులైన మతాచార్యులను అంటిపెట్టుకోక, స్వతంత్రుడనై ఉండాలనుకొంటాను; వారిపట్లచూపదగ్గ భక్తి విశ్వాసాలను నేను చూపుతాను. కాని మతాన్ని స్వతంత్ర పరిశోధనా దృష్టి తో వీక్షిస్తాను. వారు ఆ లోకాన్ని ఎలా తమతమ తపస్సులతో విలోకించారో నేను ఆ కాంతిని స్వీయకృషితో వీక్షించ ఉద్దేశిస్తాను. వారి ఆలోక విలోకనం మనలను కించిత్తు అయినా సంతృప్తి పరచలేదు. బైబిల్‌ను అనుసరించడం కాదు; మీరే బైబిల్ అవ్వాలి. మార్గంలోని ప్రదీపమని, మార్గం నిర్దేశించే స్తంభమని, ఒక చిహ్నమని బైబిల్‌ను మీరు ఆదరించండి; గౌరవించండి – దాని మూల్యమంతా ఇంతే. కాని ఈ స్వరూపాలూ, ఇతర వస్తువులూ ఎంతో అవసరాలైనవి. మానసిక సాధనచేసి మీరు

ఏకాగ్రదృష్టిని అలవరచుకోండి, భావపరికల్పన చేయండి. మీ అంతరంగంలో సహజంగా మీరు మూర్తిభావన చేస్తూండటం గమనిస్తారు. ఇది తప్పనిసరిగా జరుగుతూనే ఉంటుంది.

రెండు రకాల వ్యక్తులకు ఎన్నడూ ఏ విగ్రహమూ అవసరమై ఉండదు. ఒక రకం వ్యక్తి ఎన్నడూ ఈశ్వర చింత చేయని నరపశువు. రెండోరకం వ్యక్తి ఈ సోపానాలను అతిక్రమించి ఈ ప్రాకారాలనన్నిటిని దాటి పరిపూర్ణత్వ సిద్ధి పొందిన మహాత్ముడు. ఈ రెండిటి నడుమ ఉండే మనమందరం ఒక ఆశయాన్ని, బహిరంతరాలలో వెలసేదాన్ని అవలంబించాలి. అది చనిపోయిన ఒక వ్యక్తిరూపంలో ఉండొచ్చు; లేక సజీవుడైన పురుషరూపంలోగాని, జీవించివున్న స్త్రీ రూపంలోగాని ఉండవచ్చు. ఇది వ్యక్తిత్వాన్ని అనుసరించడమే అవుతుంది; శరీరాలను ఆశ్రయించడమే అవుతుంది. ఇది సహజమే.

స్థూలరూపభావన చేయడం మనకు స్వభావసిద్ధమైనదే కదా! ఈ పని చేయక మనం ఇక్కడ ఎలా ఉండగలిగాము? మనం
స్థూలరూపావృతులమైన ఆత్మలం; కాబట్టి మనం ఈ ప్రపంచంలో విరాజిల్లుతున్నాం. స్థూలరూపభావన మనలను ఇక్కడకు తీసుకువచ్చింది; అదే మనలను అవతలికి కొనిపోతుంది. విషయవస్తువులను అనుసరించడంచేత మనం మానవులమైనాం. కాబట్టిమనం వ్యక్తులను ఆరాధించక తప్పదు. వేరే ఊహలను మనం ఎలా వ్యక్తీకరించినా, ఈ ఆరాధన మనకు తప్పనిసరే అవుతోంది. "వ్యక్తిగతభావనకు మనస్సులో చోటు ఇవ్వవద్దు" అని అవలీలగా పలుకవచ్చు. సాధారణంగా ఇలా పలికేవాడే విశేషంగా అలా చేస్తూంటాడు. ప్రత్యేక పురుషులపట్లా, స్త్రీలపట్లాఅతడి ఆసక్తి, అనురాగం ఎంతో ప్రబలమై ఉంటుంది; వారు మరణించినా ఈ ఆసక్తి అతణ్ణి విడువదు; మరణానంతరం వారినతడు అనుగమింప ఉద్దేశిస్తాడు. ఇది మూర్తి ఆరాధనం; ఇది మూర్తిపూజకు బీజం; మూర్తిపూజకు మూలకారణం. కారణం విద్యమానమైవుండటంతో, అది ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతుంది. సామాన్య మానవుడి పట్లగాని, సాధారణ స్త్రీపట్లగాని కాక ఏసు విగ్రహం పట్లగాని, బుద్ధమూర్తిపట్లగాని వ్యక్తిగతమైన ఆసక్తి ఉండటం మేలుకాదా? విగ్రహాలమ్రోల సాగిలపడటం తప్పుగా పాశ్చాత్యదేశాలలో ప్రజలంటూ ఉంటారు. కాని వారొక మగువమ్రోల మోకరిల్లి "నువ్వు నా జీవన సర్వస్వానివి, నా కళ్ళలోని కాంతివి; నా ఆత్మవు" అని పలుకుతూంటారు. ఇది మరింత హేయమైన మూర్తి పూజ కాదా? 'నా ఆత్మ' అని 'నా బతుకు' అని చేసే ఈ ప్రసంగం ఎలాంటిది? ఇది అత్యంత తాత్కాలిక ప్రలాపం. ఇది కేవలం విషయలాలసతే. ఇది బహుళ కుసుమావృతమైన స్వార్థానురాగమే! కవులు దీనికి చక్కని పేరు పెడతారు. దీనిమీద అత్తరు చల్లుతారు. నానారకాల మనోహర వస్తువులను వేస్తారు. దీనికంటే బుద్ధుడి విగ్రహం మ్రోలగాని, జితేంద్రియుడైన మహావీరుడి మూర్తి మ్రోలగాని సాగిలపడి "నువ్వు నా జీవన సర్వస్వానివి" అని పలకడం మేలు కాదా? అలా చేయడమే నా ఉద్దేశంలో ఎంతో సబబు.

పాశ్చాత్య దేశాలలో గుర్తించబడని మరొక రీతి 'ప్రతీకోపాసన' ఉంది. ఇది మా గ్రంథాలలో బోధింపబడింది. మనస్సును ఈశ్వరుడిగా భావించి ఆరాధించడమే ఈ విధానం. ఈశ్వరభావనతో దేనిని ఆరాధించినా ఇది చరమోపాసనకు మార్గదర్శనమే అవుతుంది. అది దానిని సమీపిస్తుంది. ఇది అరుంధతి న్యాయం వంటిది. ఈ నక్షత్రం సప్తఋషి మండలానికి చాలదూరంలో ఉంది. వృషభరాశిమీద దృష్టిగోచరమైన తారకల బృందంలోనిది. ఒకడికి దాని సమీపంలోని పెద్ద నక్షత్రం ముందుగా చూపబడుతుంది. దానిమీద అతడు తన దృష్టిని ఏకాగ్రం చేశాక, దాన్ని అతడెరిగిన పిదప, దానికి అనతి దూరంలోని చుక్కమీద అతడి చూపు కేంద్రీకరింపబడుతుంది. తరువాత అతడి చూపు అరుంధతీ తార మీదికి జరుపబడుతుంది. బుద్ధుడి ఆరాధనం, ఏసు ఆరాధనం 'ప్రతీకోపాసనే'. ఇది ఈశ్వరారాధనకు అతి సమీపమైనది. కాని బుద్ధుడి ఆరాధనగాని, ఏసు ఆరాధనగాని మానవుడికి రక్షణ ఇవ్వదు. ఈ ఆరాధనాన్ని అతిక్రమించి ఏసుక్రీస్తుగా వ్యక్తమైన ఈశ్వరుణ్ణిఆరాధించాలి. ఎందుకంటే భగవంతుడు ఒక్కడే మనకు మోక్షాన్ని ప్రసాదించగలడు. బుద్ధు డు దేవుడని, ఏసు దేవుడని గ్రహించాలి అనే కొందరు తాత్వికులున్నారు. వారు 'ప్రతీకలు' కాక, ఒక్కొక్కరు ఈశ్వరుడనే వారి తలపు. వేర్వేరు 'ప్రతీకలను' మనం స్వీకరించవచ్చు. ఈశ్వరారాధనకు మనలను సమీపింపచేసే ఈ క్రమగత విధానాలను మనం అవలంబించవచ్చు. ఈ ఆరాధనంవల్లమనకు ఏ హాని వాటిల్ల కుండాలి. బుద్ధుణ్ణి, ఏసును ఆరాధించేపట్లమనం ఈశ్వరుణ్ణే ఆరాధిస్తూన్నట్లుఅపోహపడితే, మనం పొరపడిన వారమవుతాం. ఒకడు ఏసు క్రీస్తును పూజిస్తూ ఈ పూజవల్ల తనకు నిష్కృతి లభిస్తుందని తలపోస్తే, అతడు పూర్తిగా పొరపడినవాడే అవుతాడు. ఒక విగ్రహాన్నిగాని, మరణించినవారి ఆత్మలనుగాని ఆరాధిస్తే మోక్షం లభిస్తుందని ఎవడైనా ఊహిస్తే, అతడు పొరపాటుపడ్డట్టే. ఏ వస్తువులోనైనా ఈశ్వరుణ్ణి

అవలోకించి, విగ్రహాన్ని మరచి, భగవంతుణ్ణే మనం అవలోకిస్తే, మన ఆరాధనం సమ్మతింపదగినదే అవుతుంది. కాని
ఈశ్వరుణ్ణి విగ్రహమని తలచకూడదు. కాబట్టి మనం ఏ విగ్రహంలోనైనా దివ్యజీవనాన్ని నింపవచ్చు. మూర్తిని విస్మరిస్తే

చాలు; మీ కర్తవ్యం నిర్దిష్టమవుతుంది. ఎందుకంటే 'ఈశ్వరుడి' నుంచి సమస్తం ఆవిర్భవిస్తుంది. ఉన్నదంతా అతడే. ఒక బొమ్మను దేవుడని మనం పూజించవచ్చు; కాని దేవుణ్ణి బొమ్మగా పూజించకూడదు. ప్రతిమలో భగవంతుడున్నాడని తలచడం తప్పు కాదు; కాని ప్రతిమను భగవంతుడనుకోరాదు. మూర్తిలో ఈశ్వరుడున్నాడనుకోవచ్చు. ఈ ఊహలో ప్రమాదమేమీ లేదు. ఇది నిజమైన ఈశ్వరారాధనం. విగ్రహరూపం కేవలం 'ప్రతీకం' మాత్రమే.

భక్తిలో మనం తరువాత గమనించవలసిన ముఖ్యవిషయం 'శబ్దం'. నామశక్తి – నామంలోని శక్తి. సమస్త విశ్వం నామరూపబంధురమైనది. మనం ఏం చూసినా, అది నామరూపాల కలయికే. మానసిక స్వరూపపు నామం. నామరూపాలు కానిది ఏదీలేదు. నామరూపరహితుడు ఈశ్వరుడని మనమందరం విశ్వసిస్తాం. కాని అతణ్ణి గురించి మనం చింతించనారంభించినప్పుడు అతడు నామరూపసహితుడవుతాడు. మనస్సు ప్రశాంతమైన సరోవరం లాంటిది. తలపులు దానిమీది తరంగాలు. ఈ అలలు నామరూపాలతో తలలెత్తుతాయి; నామరూపాలతో కాక ఏ అల తలెత్తలేదు. రూపం లేనిది అనూహ్యం. అది యోచనకు అతీతం. యోచనకు రూపమే రక్ష. యోచనకు విషయవస్తువు తోడైనప్పుడు, నామ రూపాల ఆవశ్యకత ఏర్పడుతుంది. వీటిని మనం ప్రత్యేకించలేం. భగవంతుడు విశ్వాన్ని శబ్దం నుంచి సృజించాడని ఎన్నో గ్రంథాలలో పేర్కొబడింది. సంస్కృతంలో ఉల్లేఖించబడిన శబ్దబ్రహ్మం క్రైస్తవ వాఙ్మయంలోని శబ్దసిద్ధాంతమే. ఇది ప్రాచీనకాలపు భారతీయ సిద్ధాంతమే. భారతీయ బోధకులు దాన్ని అలెగ్జాండ్రియాకు కొనిపోయారు. శబ్దతత్త్వం, అవతారతత్త్వమూ ఈ రీతిగా అక్కడ నెలకొన్నాయి.

భగవంతుడు సమస్తాన్ని శబ్దంనుంచి సృష్టించాడనే భావం గంభీరార్థ బంధురమైనది. ఈశ్వరుడు అవికారుడు కావడంవల్ల సృష్టి ని వర్ణించడానికి ఇది ఉత్తమమైన విధానం. విశ్వావిర్భావం సంస్కృతంలోని సృష్టిశబ్దంలో నిరూపించబడినది. "శూన్యంనుంచి భగవంతుడు వస్తువులను సృష్టించాడు" అనే వాక్కులోని అర్థం ఏమిటి? విశ్వం భగవంతుడినుంచి సృజించబడినది. అతడు విశ్వం అవుతాడు, విశ్వం అతడిలో లీనమవుతుంది; అతడి నుంచి అది మళ్ళా వ్యక్తమవుతుంది; మళ్ళా అతడిలో లీనమవుతుంది. అన్ని కాలాలలోను అది ఇలాగే జరుగుతూంటుంది. మనస్సులో ఏది సృష్టికావాలన్నా నామరూపాలు లేకుండా జరుగదని మనం ఇదివరలో గ్రహించాం. ఏ ఆలోచనా లేకుండా మనస్సు నిశ్చలమై ఉన్నదనుకోండి. అయినా దాన్లో తలపు తలెత్తినప్పుడు తోడ్తోడనే అది నామరూపాలను పొందుతుంది. ప్రతీ ఊహకు ఒక రూపం ఉంటుంది; ఒక పేరు ఉంటుంది. ఈ విధంగానే సృష్టి నామరూపాలతో కూడివుంది. మనిషి మనస్సులో జనించే ప్రతీ భావానికి ఒక పేరు లేక శబ్దం ఉండాలి. దీన్నిబట్టిమీ ఊహ స్థూ లరూపందాల్చి, బాహ్యవ్యక్తీకరణం పొందినట్లు, మీ శరీరాలు మీ భావాలనుంచి వ్యక్తమైనట్లు, ఈ విశ్వం మీ మనస్సు నుంచి వ్యక్తమైనదని తలచడం సహజమే కదా! సమస్త విశ్వం ఈ రీతి పరికల్పనను అనుసరించి నిర్మించబడినదన్నప్పుడు, ఒక అణువు ఎలా నిర్మించబడినదో విదితమైతే, సమస్త విశ్వం ఎలా నిర్మించబడిందో మీరు గ్రహించగలరు. అంతేగాక మనస్సు ఒకే వస్తువుయొక్క స్థూల సూక్ష్మ వ్యక్తీకరణాలు. ఈ రెండింటికి అవినాభావసంబంధం ఉండటంతో దేహం శిథిలమైపోయిన వేళ, మనస్సుకూడ శిథిలమవుతుందని స్పష్టమవుతోంది. ఒక వ్యక్తి మెదడులో అలజడి జనిస్తే, అతడి ఊహలో సైతం అలజడి జనించి తీరాలి. కారణం అవి రెండూ ఒక్కటే! ఒకే వస్తువు యొక్క స్థూల సూక్ష్మరూపాలే! పదార్థం, మనస్సు అనే రెండు విషయాలున్నాయి కదా! సమున్నత ఒకే వాయువు వాయుపథంలో చాలాదట్టం, అత్యంత పలుచని అనే రెండు సమరస్తరాలు కలిగినట్లు, శరీరం కూడ ఒకటై స్థూల సూక్ష్మస్తరబంధురమై వెలుస్తుంది. దేహం వేళ్ళమీది గోళ్ళ సముదాయం వంటిది. గోళ్ళను తీసివేసినప్పటికి అవి ఏ తీరులో మరలా పెరుగుతాయో అదే తీరుగా మన సూక్ష్మభావాలనుంచి ఒకటి తరువాత ఇంకొకటిగా శరీరాలు పెరుగుతాయి. ఒక వస్తువు సూక్ష్మమయ్యేకొద్దీఅ ది స్థి రమై ఉంటుంది; ఈ విషయం అనవరతం మనం విలోకిస్తున్నాం. స్థూలమయ్యేకొద్దీదాని స్థి రత్వం కుంటుపడుతూంటుంది. ఒకటైన భావశక్తి వ్యక్తీకరణంలో రూపం స్థూలమైన వ్యక్తీకరణమనీ, నామం సూక్ష్మమైన వ్యక్తీకరణమనీ మనం గ్రహిద్దాంగాక. కాని ఈ మూడు ఒక్కటే. ఇందులో ఏకత్వం ఉంది, త్రిత్వం ఉంది. ఏకైక వస్తువు యొక్క మూడు రీతుల వ్యక్తీకరణ క్రమం ఇది. ఒకటి సూక్ష్మమైనది, రెండవది కొంత స్థూలమైనది. మూడవది మరింత స్థూలమైనది. ఒకదానితో తక్కిన రెండూ కలిసే ఉంటాయి. భావం ఎందులో ఉందో, నామం అందులో ఉంది; రూపమూ ఉంది.

దేహం ఏ పరికల్పనను అనుసరించి, ఏ పద్ధతినిబట్టి నిర్మితమైనదో, దాని నిర్మాణంలో సైతం నామరూపభావాలు ఉన్నాయని సహజంగా గ్రహించగలం. విశ్వంలోని సూక్ష్మతమభావం 'భావం'. అది దాన్లోని ప్రేరణశక్తి. మన శరీరంలోని భావశక్తిని ఆత్మ అంటారు. విశ్వంలోని భావశక్తిని ఈశ్వరుడంటాం. తరువాత గణనీయమైనది నామం; తదనంతరం పేర్కోబడేది రూపం. దీన్ని మనం చూస్తాం; స్పర్శతో ఎరుగుతాం. దృష్టాంతానికి మీలో ఒకరిని పేర్కొంటాం. ఈ విశ్వంలో ఇతడు ఒక చిన్నవిశ్వం; ఒక ప్రత్యేకరూపంగల శరీరం. దానికొక పేరు ఉంది; జాన్ అనండి లేక జేన్ అనండి. ఆ పేరు

వెనుక భావం ఉంది. ఇదేవిధంగా విశ్వం ఉంది. దీనికొక పేరువుంది. ఇది అన్ని మతాలలోను 'శబ్ద' వ్యవహరింపబడుతున్నది. దీన్ని
వెనుక ఈశ్వరుడున్నాడు. విశ్వజనీనభావం 'మహత్తు' అని సాంఖ్యులచేత పిలువబడినది. అదే విశ్వజనీన జ్ఞానం, దీని
పేరేమిటి? ఏదో ఒక పేరు ఉండాలి కదా! ఈ ప్రపంచం ఏకరూపంలో లేక సమరూపాల విరాజిల్లేది. సమస్త విశ్వంలో ఏ పదార్థం ఉందో ప్రతీ అణువులోను అదే పదార్థం ఉందని ఆధునిక భౌతికశాస్త్రం నిస్సందేహంగా రూఢిచేస్తుంది. ఒక మట్టిముద్ద ఎలాంటిదో మీరు తెలుసుకొంటే సమస్త విశ్వం ఎలాంటిదో మీరు గ్రహించగలరు. విశ్వంలోని ప్రాణులలో మనిషిని ప్రతిరూపజీవిగా మనం భావించవచ్చు. అతడొక చిన్నవిశ్వం – పిండాండం. మనిషికి రూపం ఉంది, రూపానికి నామం ఉంది; అతడి వెనుక భావం ఉంది – చింతాసమన్వితసత్త ఉంది. విశ్వం కూడ ఈ విధానాన్ని అనుసరించే నిర్మించబడింది. ప్రశ్న ఇది. దాని పేరేమిటి? హిందువుల విశ్వాసాన్ని అనుసరించి అది ఓమ్; ప్రాచీనకాలపు ఈజిప్షియన్లుకూడ అలాగే విశ్వసించారు. కఠోపనిషత్తులో ఇలా నిర్వచించబడింది; దేనిని అన్వేషించి మానవుడు బ్రహ్మచర్యాన్ని అభ్యసిస్తాడో అదేమో సంక్షిప్తంగా వివరిస్తాను. అది ఓమ్* – అది బ్రహ్మ – పరివర్తన మెరుగనిది ఒక్కటి; సర్వోత్కృష్టమైనది. పరివర్తన మెరుగని ఆ ఒక్కదానిని ఎవ్వడు ఎరుగుతాడో, అతడు తాను కాంక్షించిన దాన్ని పొందగలడు.*

ఓమ్ సమస్త విశ్వాన్ని లేక భగవంతుణ్ణిసూచించే నామం. బాహ్య ప్రపంచానికీ ఈశ్వరుడికీ నడుమ నిలబడి, అది రెండింటిని సూచిస్తుంది. వివిధ ఇంద్రియాలను అనుసరించి, స్పర్శ అని, రంగు అని, రుచి అని, ఇలాగే వివిధ రీతుల విడివిడిగా విశ్వాన్ని ఊహించగలం. వేర్వేరు దృక్పథాలను అనుసరించి, ఈ విశ్వాన్ని సహస్ర సంఖ్యలుగల విశ్వాలుగా గ్రహించగలం. ప్రత్యేక విశ్వం సమగ్రమై, ప్రత్యేకమైన నామంతో, రూపంతో భావంతో వెలుస్తుంది. ఈ భావాలు 'ప్రతీకాలు'. ఒక్కోదానికి ఒక్కో పేరువుంది. ఈ పేర్లుపవిత్ర చిహ్నాలను సూచిస్తాయి. అవి భక్తియోగంలో వ్యవహరించబడుతూంటాయి. దాదాపుగా వాటికి అనంత శక్తి ఉంది. ఈ శబ్దాలను పురశ్చరణ చేయగానే, మనం దేన్ని కాంక్షిస్తే దాన్ని పొందగలం. మనం పరిపూర్ణత్వాన్ని పొందగలం. కాని ఈ సందర్భంలో రెండు విషయాలను మనం గమనించాలి. "గురువు మహిమోపేతుడై ఉండాలి; శిష్యుడూ అలాంటివాడే అయి ఉండాలి"* అని కఠోపనిషత్తు తెలుపుతోంది. ఈ ప్రభావం, ఈ నామం ఒకరినుంచి వేరొకరికి పరత్పరానుసారంగా రావాలి. పరమగురువునుంచి గురువుకు, గురువునుంచి శిష్యుడికి, శిష్యుడినుంచి ప్రశిష్యుడికి ఆధ్యాత్మిక భావస్రవంతి ప్రగాఢశక్తి సమన్వితమై ప్రాచీనకాలం నుంచి వస్తూంటుంది. ఈ శక్తిని ప్రసాదించేవాడు గురువు; పొందేవాడు శిష్యుడు. క్రమవిధానాన శక్తిసమన్వితమైన శబ్దం గురుశిష్యపరంపరలో ప్రచలితమై పురశ్చరణ గావించబడినప్పుడు సాధకుడు భక్తియోగంలో విశేషోన్నతిని పొందుతాడు. ఆ శబ్దపురశ్చరణ మాత్రాన భక్తిలోని సర్వోత్కృష్ట స్థితి సైతం లభిస్తుంది.

"ఈశ్వరా! నీకు చాలా నామాలు ఉన్నాయి. వాటి అర్థం ఏమిటో నీకు అవగతమే! ఈ నామాలన్నీ నువ్వే! ప్రతిదాన్లోను నీ అనంతశక్తి విద్యమానమైవుంది. ఈ నామపురశ్చరణ గావించడానికి కాలం, స్థలం అనే నియమాలులేవు. ఎందుకంటే సర్వకాలాలు, సర్వస్థలాలు పవిత్రమైనవే! నువ్వు సులభుడవు; నువ్వు దయామయుడవు; అయినా నిన్ను ప్రేమించని నేనెంత దురదృష్టవంతుణ్ణి!"

# ఇష్టదేవతా సిద్ధాంతం

ఇంతకు మునుపు ఇష్టసిద్ధాంతాన్ని గురించి నేను ఉల్లేఖించి ఉన్నాను. ఈ సిద్ధాంతాన్ని మనం విశేష శ్రద్ధతో వీక్షించాలి. ఎందుకంటే దీనిని మనం సముచితంగా అర్థం చేసుకోగలిగితే, ప్రపంచంలోని వివిధ మతాలు మనకు సుబోధకాలవుతాయి. 'ఇష్ట' శబ్దం 'ఇష్' ధాతువు నుంచి పుట్టింది. 'ఇష్' అంటే కోరడం; కోరికను అనుసరించి ఎన్నుకోవడం. సర్వ మతాల లక్ష్యం, సమస్త మతశాఖల లక్ష్యం ఒక్కటే – ఇది మోక్షం; దుఃఖనివృత్తి. ఎక్కడ మతం నెలకొని ఉందో, ఈ ఆశయసిద్ధికై కావించబడే సాధన ఏదో ఒక రీతిగా సాగుతోంది. నిమ్న దశలలోని మతాలలో ఈ ఆదర్శం సువ్యక్తం కాలేదు. సువ్యక్తమైతే ఏమిటి కాకపోతే ఏమిటి? ప్రతి మతం ఆ ఏకైక లక్ష్యం దెసకే పోతూంటుంది. మనమందరం దుఃఖ నివృత్తిని కాంక్షిస్తాం; శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ముక్తికోసం శతధా తపిస్తూన్నాం. ఈ ఆశయాన్ని అనుసరించే సమస్త భూమండలంలోని కార్యక్రమం సాగుతోంది. లక్ష్యం ఒక్కటే అయినప్పటికీ, లక్ష్యసిద్ధికి అనేక ఉపాయాలుండవచ్చు. ఈ ఉపాయాలు వ్యక్తిగత మానసిక ప్రవృత్తులననుసరించి, స్వభావ వ్యత్యాసాలనుబట్టి ఉంటుంది. ఒకడు భావసమన్వితుడు కావచ్చు; మరొకడు మేధాశక్తి సంపన్నుడు కావచ్చు; ఇంకొకడు క్రియాదక్షుడు కావచ్చు. ఇలాగే వేర్వేరు గుణాలతో వ్యక్తుల మానసాలు ఉండొచ్చు. గమనార్హమైన మరో విషయం ఉంది. ఒక ప్రకృతిలో విభిన్న విభాగాలు ఉండవచ్చు. దృష్టాంతంగా అనురాగాన్ని గైకోండి. భక్తి విషయంలో అనురాగాన్ని మనం ప్రత్యేక దృష్టితో వీక్షించాలి. ఒక వ్యక్తికి బిడ్డలపట్ల విశేష వాత్సల్యం ఉండవచ్చు; మరొకడికి భార్యమీద అనురాగం ఉండవచ్చు; వేరొకడు తల్లిని, ఇంకొకడు తండ్రిని, మరొకడు మిత్రులను గాఢంగా ప్రేమించవచ్చును. మరొకడికి స్వతస్సిద్ధంగా జన్మభూమిపట్లఎంతో మక్కువ ఉండవచ్చు. కొద్ది మంది విశాలదృష్టితో మానవజాతిని ప్రేమించవచ్చు. మనలో ప్రతివ్యక్తి మానవప్రేమే మన జీవిత పరమాదర్శమని తెలుపుతున్నా, ఇలాంటి అనురాగం గలవారు అతి తక్కువమంది. కొద్దిమంది యోగులకే గాఢానుభూతి ఉంది. మానవలోకంలో ఏ కొద్దిమంది మహాత్ములో విశ్వజనీన ప్రేమానుభూతితో ప్రకాశిస్తూంటారు. ఇలాంటి మహనీయుల అభావం పుడమిలో ఉండరాదని మనం ఆశిద్దాం గాక.

ఒకే మత విషయంలో ఆదర్శసిద్ధికై విభిన్నమార్గాలు అవలంబించబడటం విలోకిద్దాం. క్రైస్తవులందరు ఏసుక్రీస్తును విశ్వసిస్తారు. కాని ఏసును గురించి వారెన్నెన్ని విభిన్న వ్యాఖ్యానాలు చేస్తారో యోచించండి. ఒక్కో చర్చ్ ఒక్కో దృక్పథంతో అతణ్ణి వీక్షిస్తుంది. క్రైస్తవులలో ప్రెస్బిటేరియనులనేవారి దృష్టి ఏ సు జీవితంలోని ఒక ప్రత్యేక ఘట్ట ం మీద, కొంత పైకం తీసుకొని చిల్లర ఇచ్చేవాడి వద్దకు అతడు పోయినప్పటి ఘట్టంమీద సారించబడుతుంది. వారు అతణ్ణి ఒక యోధుడిగా భావన చేస్తారు. క్రైస్తవులలో జార్జ్‌ఫాక్స్ అనే వ్యక్తి ప్రతిష్ఠించిన క్వేకర్లు (ఈశ్వర నామాన్ని వినగానే వణకేవారు) అనబడే మిత్రసంఘంవారు ఏసును గురించి తెలుపుతూ "అతడు తన శత్రువులను క్షమించాడు" అనే అతడి క్షమాదృష్టిని ప్రశంసించే దృష్టాంతాలను పేర్కొంటారు. ఒక రోమన్ కేథలిక్ క్రైస్తవుణ్ణిఏసు జీవితోదంతంలో అతడి మనస్సుకు నచ్చిన విశేషం ఏమిటని అడిగితే బహుశ అతడు "పీటర్ కాతడు బీగాలిచ్చిన ఘట్టం" అని చెప్పవచ్చు. ప్రతి క్రైస్తవమతశాఖ అతణ్ణి తన దృక్పథంతో వీక్షించి తీరుతుంది.

ఒకే మత ప్రాంగణంలో పలు శాఖోపశాఖలు ఉండటం గమనిస్తాం కదా! మూర్ఖులు ఈ ఉపశాఖలలో ఒకదాన్ని స్వీకరించి, చలించక దానిమీదే నిలుస్తారు; అంతేగాక వారు ఇతరుల విశ్వాసాన్ని నిరాకరిస్తారు. అంతటితో వారు ఊరుకోరు; తాము చెప్పిందే సత్యమనీ ఇతరులు ఏమన్నా, అది శుద్ధఅబద్ధ మనీ తెలుపడానికి వారు సాహసిస్తారు. తాము తెలిపి దాన్ని ఎవరైనా వ్యతిరేకిస్తే వారు కలహానికి పూనుకొంటారు. వారు విశ్వసించినట్లుఎవరైనా విశ్వసించకపోతే, అలా విశ్వసించనివారిని చంపుతామని వారు అంటూంటారు. ఈ నిర్బంధ విధానం ఒకప్పుడు మహమ్మదీయులలో ఉండేది. తమ విశ్వాసానికే విలువ కట్టేవారు తామే అకృత్రిమ స్వభావులమని ఊహించి, ఒరుల అవజ్ఞతో వీక్షిస్తారు. భక్తి యోగ సమీక్షలో మనం అవలంబించవలసిన విధానం ఏది? ఇతరులు తెలిపినది యథార్థంకాదని వచించక, వారు వచించినది నిర్దిష్టమైనదని, తమతమ పథాలను అనుసరించేవారి పద్ధతి దోషరహితమైనదని మనం ముక్తకంఠాలతో పలుకాలి. మీ ప్రకృతిని అనుసరించి, మీరు అనివార్యంగా ఏ మార్గాన్ని అనుసరిస్తారో, అదే సరైన దారి. పూర్వానుభూతిని అనుసరించి

మన ప్రత్యేక ప్రకృతి విశేషంతో మనలో ప్రతి ఒక్కరు జన్మిస్తారు. అది పూర్వభావసంచితజ్ఞానమనండి, అనుభూతి అనండి, వంశపరంపరానుగత పరిజ్ఞానం అనండి, అదెలాంటిదని మనం అన్నా గతానుభూతిఫలం మన జన్మ అని మనం విశ్వసించి తీరాలి. గతానుభూతి ఏఏ మార్గాలను అనుసరించి మనలో ప్రవేశించినా, అది యథార్థమైన విషయమని, ఈ సిద్ధాంతం సత్యసందీపితమైనదని మనం నమ్మాలి. భూతకాల కారణాన్ని అనుసరించి వర్తమాన కార్యం మనలో ప్రతి వ్యక్తిలోను విరాజిల్లుతుందనే విషయం సుస్పష్టం. కాబట్టిమనలో ఒక్కొక్కడిలో, ఒక ప్రత్యేక సంచలనం, వ్యక్తిగత భావానుశీలన ఉంది;

కాబట్టిమనలో ప్రతీ వ్యక్తి తన ఇష్టా నుసార్యమైన మార్గాన్ని తాను కనుగొనాలి.

మనలో ప్రతివ్యక్తి సహజ ప్రకృతి మేరకు నడిచే మార్గం 'నిర్వాచిత పథ' మనబడుతుంది. ఇది ఇష్టసిద్ధా ంతం. మనది అయిన మార్గాన్ని మన ఇష్టపథమంటాం. ఉదాహరణ తీసుకొందాం. భగవంతుడు సర్వశక్తి సంపన్నుడైన విశ్వాధిపతి అని ఒకడు ఊహించాడనుకోండి. తన ప్రకృతిననుసరించి అతడు ఈ భావన చేసివుంటాడు. ప్రతివారి మీదా తన పాలనాశక్తిని విస్తరింపచేయ ఉద్దేశించిన ఈ వ్యక్తి ప్రకృతి అధికార విజృంభణాన్ని కాంక్షించి ఉంటుంది. మరొక వ్యక్తి బడిపంతులు కావచ్చు. ఇతడి ప్రకృతి కఠోర పద్ధతిని అభిలషించేదని ఊహించండి. ఈతడి దృష్టిలో ఈశ్వరుడు నిష్ఠురధర్మాన్ని నిర్వహించేవాడు. ఈ ధర్మాన్ని నెరపేటప్పుడు దండనవిధిని ఇతడు అనుష్ఠిస్తూంటాడు. ప్రతివ్యక్తి భగవంతుణ్ణితన ప్రకృతి ననుసరించి వీక్షిస్తాడు. మన ప్రకృతిని అనుసరించి ఏర్పడే ఈ దృష్టి మన ఇష్ట సిద్ధాంతాన్ని నిర్ణయిస్తుంది. మన ఇష్ట సిద్ధాంతం మేరకు ఈశ్వరసాక్షాత్కారం పొందుతాం. మన మనసుకు నచ్చిన రూపాన్నే మనం విలోకిస్తాం. మరొక దర్శనశక్తి మనకు అలవడదు. ఒకడి ప్రబోధానికి చెవి రిక్కించి, అది సర్వోత్కృష్టమైన ప్రబోధమనీ, మీ మనస్సుకు

[illegible]

తెలుపుతాడు. ఆ మిత్రుడి విమర్శ దోషభూయిష్టం కాకపోవచ్చు; అతడితో కలహిస్తే ప్రయోజనం లేదు. ఆ ప్రబోధం మంచిదైనా, ఆ మిత్రుడి మనస్సుకది సరిపడి ఉండదు. ఈ విషయాన్ని మరింత విస్తృతించి వీక్షిద్దాంగాక. వేర్వేరు దృక్పథాలతో వీక్షించబడే సత్యం సత్యమే కావచ్చును; ఏకైకమైన సత్యం కాబోదని గ్రహిస్తాం గాక.

ఈ మాటలు పరస్పర విరుద్ధంగా తోచవచ్చు. కాని పరమసత్యం ఒక్కటే అని మనం ఎరుగాలి. వ్యక్తిగతమైన ఊహలను అనుసరించి వ్యక్తమయ్యే సత్యాలు, సంబంధవాచక నిర్వచనాలు విభిన్నాలు సుమా. ఈ దృష్టాంతాన్ని గమనించండి. విశ్వాన్ని మీరు ఏ దృష్టితో విలోకిస్తారో ఊహించండి. విశ్వం పూర్ణమైనది; శుద్ధమైనది; పరమాస్తిత్వంగలది. అది పరివర్తనం కాలేదు; పరివర్తనమయ్యేదీ కాదు. సదా ఒకే రీతిలో ఉండేది. కాని మీరూ, నేనూ, తక్కినవారూ ప్రత్యేకదృష్టితో విశ్వాన్ని విలోకిస్తాం. విశ్వాన్ని గురించి వింటాం. ప్రతీ వ్యక్తికి ప్రత్యేక విశ్వం ఉన్నట్లు కనబడుతుంది. సూర్యుడి విషయం గమనించండి. సూర్యుడొక్కడే. కాని మీరూ, నేనూ, ఇతరులు అనేకులూ వేర్వేరు తావులలో నిలబడి సూర్యుణ్ణిచూస్తే, ఒక్కో వ్యక్తికీ సూర్యుడొక్కక్క రీతిగా కనిపిస్తాడు. దశ్యం ఇలా కనబడక తప్పదు. స్థ లంలో కాస్త మార్పు కనబడితే, సూర్యుణ్ణి చూసే దృష్టి పథంలో మార్పు కనబడి తీరుతుంది. వాతావరణంలో కాస్తంత మార్పు కనిపిస్తే, మనం చూసే దశ్యంలో సైతం మార్పు తలెత్తి తీరుతుంది. కాబట్టి వేర్వేరు వ్యక్తుల విభిన్న రీతుల పరిశీలనవల్ల సత్యం సదా వేర్వేరు రీతులుగా గోచరిస్తుంది. కాని పరమ సత్యం ఒక్కటే సుమా! కాబట్టి ఒరులు మతాన్ని గురించి మన అభిప్రాయాలకు భిన్నమైన ఊహలను ప్రకటించినప్పుడు వారితో మనం కలహించనక్కర్లేదు. స్థూలదృష్టికి వారి ఊహలూ మన అభిప్రాయాలూ వేర్వేరుగా తోచినా, సూక్ష్మదృష్టిపరిశీలనంవల్ల భిన్నాభిప్రాయాలు ఉండకపోవచ్చు. ఒకానొక వృత్తాకారపు కేంద్రంలో సూర్యుడు ఉన్నాడని యోచించండి. కేంద్రం నుంచి వృత్తాకార పరిధి దిసకు దూరంగా పోయిన కొద్దీ, ఈ రేఖల నడుమనున్న దూరం కూడ విస్తరిస్తుంది. కాని అన్ని రేఖలు (radii) కేంద్రంలో కలిసేటప్పుడు వ్యత్యాసాలు అదృశ్యాలవుతాయి. మానవజాతియొక్క పరమలక్ష్యమైన ఒక కేంద్రం ఉంది. ఈ లక్ష్యం భగవంతుడు. మనమందరం పూర్వోక్తరేఖలం. వీటి మధ్యనున్న దూరాలు స్వాభావికాలై, వ్యక్తిగతాలైన మానసిక ప్రవృత్తులు. దీన్ని అనుసరించే మనం ఈశ్వరుణ్ణివిలోకించగలం. ఈ రీతి తావున నిలిచినప్పుడు పరమసత్యాన్ని గురించి మనం విభిన్న దృక్పథాలను కలిగివుండక తప్పదు. అందుచేత సమస్త అభిప్రాయాలూ సమాదరణీయాలే. కాబట్టిమనలో ఎవ్వరూ పోరాటానికి ఢీకొనకూడదు. కేంద్రం

దిస సాగిపోయినప్పుడు సందేహాలు నివృత్తి అవుతాయి; సమస్యలు పరిష్కరించబడతాయి. వాగ్వాదాలతోను, కలహాలతోను భిన్నాభిప్రాయాలను తొలగించుకోవాలని మనం ఉద్దేశిస్తే, ఏ సిద్ధాంతాన్ని కనుగొనకే మనం వందలాది సంవత్సరాలు గడిపివేయగలం. ఇలా అని చరిత్ర రూఢి చేస్తోంది. కేంద్రం దిస అగ్రేసరులమవడం మన ధర్మం. ఎంత త్వరలో మనం ముందంజ వేస్తామో అంత త్వరలో మన భిన్నాభిప్రాయాలు అదృశ్యాలవుతాయి.

ఇష్టసిద్ధాంతం వ్యక్తిగతాలైన మతాభిప్రాయాలకు స్థానం ఇస్తూందని గ్రహించాం. తాను దేన్ని ఆరాధిస్తున్నాడో దాన్నే ఆరాధించమని ఎవ్వడూ మరొకరిని నిర్బంధించకూడదు. సేవలవల్ల, బలప్రయోగంవల్లలేక తీవ్రవాదనలవల్ల మనుష్యులను ఒక మందగా చేర్చాలని, కంచె ఉన్న ఒకే దొడ్డిలోకి విభిన్నరీతులవారిని తరుమాలని, ఒకే ఈశ్వరుణ్ణి ఆరాధించండని, వారిని నిర్బంధించాలని చేసిన ప్రయత్నాలన్నీ ఇదివరలో వ్యర్థమైనాయి; సర్వదా అలాంటి యత్నాలు వ్యర్థాలవుతాయి. కారణం ఏమిటంటే, స్వాభావికంగా అసాధ్యాలైన వాటిని సుసాధ్యాలు చేయదలచడం దుస్సాధ్యమే అవుతుంది. ఇంతేకాదు; ఈ రీతి యత్నంవల్ల వారి మానసికాభివృద్ధి ని నిరోధించే అపాయంకూడ వాటిల్లవచ్చు. ఏదో ఒక మతానికై కృషి చేయని పురుషుణ్ణిగాని, స్త్రీనిగాని కనగొనడం సాధ్యం కాదు. ఈ యత్నంలో సంతృప్తి పొందిన వారు ఎందరున్నారు? ఉన్నా ఏ కొద్దిమంది మాత్రమేకదా ఉంటారు. ఏ కొద్దిమంది మాత్రమే కదా సత్యాన్వేషణ సమర్థులు! ఇలా ఉండటానికి కారణం ఏమిటి? కారణం ఇది: వారిలో అనేకులు అసాధ్యక్రియలను నిర్వహించడానికై ఉరుకులెత్తుతారు. ఇతరుల ఆదేశాలను తలదాల్చి, ఇతరుల నిర్బంధానికి లోబడి అందుకై వారు నడుం బిగిస్తారు. ఈ దృష్టాంతాన్ని గమనించండి; నేను పసివాడనై ఉన్నప్పుడు నా తండ్రిగారు నా చేతిలో ఒక పుస్తకాన్ని ఉంచారనుకోండి. "దేవుడు ఇలా ఉన్నాడు; అలా ఉన్నాడు" అని ఆ గ్రంథంలో వివరించబడినట్లు తలచండి. ఆ విషయాన్ని నా మనస్సులో వారు ఎందుకు దూర్చాలి? నేను ఏ విధంగా అభివృద్ధి చెందుతానో వారికెలా తెలుసు? నా స్వాభావికస్థితి పెరుగక, తన ఊహలను బలవంతంగా నా మెదడులో చొప్పించడానికై అతడు ఉద్దేశించాడని ఊహించండి. ఈ ప్రయత్నాలవల్ల నా అభివృద్ధి నిరోధించబడుతుంది కదా! అనానుకూలమైన నేలలో మీరొక మొక్కను నాటి పెంచలేరు. పసివాడు తనంతతానే నేర్చుకొంటాడు. తన దారిన తాను ముందంజవేయడానికై మీరు అతడికి తోడ్పడవచ్చు. విషయాన్ని నిర్దిష్టం చేయడం మీ పనికాదు; విఘ్నాలను, సంకెళ్ళను తొలగించడం మీ కర్తవ్యం. బాలకుడి కర్తవ్యమార్గంలోని నిరోధాలను మీరు తప్పించండి. కాని జ్ఞానం అతడి స్వకీయ ప్రకృతి ననుసరించి అబ్బుతుంది, గట్టిదైన నేలను కాస్త సడలించండి; అలాచేస్తే దాన్లోని సత్తువ పనిచేస్తుంది. మడి చుట్టూ కంచెవేయండి; మడిలోని మొక్కలను ఏ వ్యక్తిగాని, ఏ జంతువుగాని పాడుచేయకుండా కాపాడండి. అంతటితో మీ కర్తవ్యం ముగుస్తుంది. దాన్ని మించి మీరు చేయగలిగినదేదీ లేదు. తరువాత స్వతస్సిద్ధమైన శక్తి తనంత తాను వ్యక్తమవుతుంది. పసివాడి విషయంలో గమనించవలసిన విధానం ఇది. పసివాడు స్వయం శిక్షణ పొందుతాడు. మీరు నా ప్రసంగాన్ని వింటున్నారు. మీరు మీ ఇళ్ళకు వెళ్ళాక మీ నైసర్గిక పరిజ్ఞానంతో నా ప్రసంగాంశాన్ని పోల్చి చూసుకోండి. నేను తెలిపిన విషయాన్నే మీరూ యోచించారని గ్రహింపగలరు. మీ ఊహలనే నేను ప్రకటించాను. నేను మీకేమీ బోధించలేను; మీ అంతట మీరే బోధ చేసుకోవాలి. మీ మనోగతభావం వ్యక్తం కావడానికి బహుశ నేను తోడ్పడగలను.

మతాన్ని గురించి ఈ బోధనావిధానాన్ని మరింత శ్రద్ధగా పరిశీలించండి. నా మతాన్ని నేనే బోధించుకోవాలి. పలువిధాలైన అపోహలను నా బుర్రలో ప్రవేశపెట్టడానికి నా తండ్రికి ఏం హక్కు ఉంది? నా మెదడులో తమ చిత్తం వచ్చిన సరకులను దిగుమతి చేయడానికి నా ఆచార్యులకుగాని సమాజానికిగాని ఏం హక్కు ఉంది? వారి ఊహలు పెద్దవే కావచ్చు; కాని అవి నా ప్రకృతికి సరిపడేవి కాకపోవచ్చు. నా పురోభివృద్ధికి అది తోడ్పడక పోవచ్చు. నేడు ప్రపంచంలో ఎలాంటి భయంకరమైన హాని చెలరేగుతోందో ఊహించండి. అసంఖ్యాకులైన అమాయక పిల్లలు వారికి సరిపడని బోధనా పద్ధతుల వల్ల సత్యపథభ్రష్టు లై పోతున్నారు. కుటుంబ మతమని, సంఘ మతమని, జాతీయ మతమని, ఇంకా ఎన్నెన్నో రీతుల మతాలని ఆటంకజనిత భావాలను మనస్సులో చొప్పిస్తూ ఎన్నెన్నో సుందరాశయాలను అద్భుత ఆధ్యాత్మిక సత్యాలుగా పెరుగనివ్వక పుట్టుకలోనే కొందరు విధ్వంసం చేయడం లేదా? మీ బాల్యకాలపు మతాన్ని గురించీ, మీ దేశ మతాన్ని గురించీ, ఎలాంటి అంధవిశ్వాస పరంపర మెదడులలో ఇప్పుడు నిండుకొని, ఎలాంటి హాని చేస్తోందో, ఎలాంటి కీడు చేయగలదో ఊహించండి. ప్రతీ భావంలోను, ప్రతీ క్రియలోను ఎలాంటి మహత్తర శక్తి ఉందో మనిషి ఎరుగడు. "దేవతలు

అడుగుపెట్టడానికి భయపడే స్థానాలలో మూర్ఖులు ముందుకు ఉరుకుతారు" అనే ప్రాచీన నీతివచనం సత్యసంశోధితమైనది కదా. తొలినుంచీ ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకోవాలి. ఎలా? ఇష్టసిద్ధాంతం అనుసరించడంవల్లఎన్నో ఆశయాలు ఈ ప్రపంచంలో ఉన్నాయి. వాటిలో మీ ఆశయం ఏదై ఉంటుందో తెలుపడానికిగాని, ఏ ఆశయాన్నైనా నిర్బంధంగా మీ మనస్సులపై మోపడానికిగాని నాకు హక్కులేదు. నాకు తెలిసిన ఆశయాలను మీ సమక్షంలో నివేదించడం నా ధర్మం; మీ మీ స్వాభావిక మానసిక ప్రవృత్తులను అనుసరించి వాటిలో మీకు సరిపడేది ఏదో, సర్వోత్కృష్టమైనదని మీకు నచ్చినదేదో

స్వీకరించడం మీ ధర్మం. మీ దృష్టిలో మంచిదైన ఆశయాన్ని స్వీకరించి, దృఢభావంతో దాన్ని అనుసరించండి. అది మీ ఇష్టసిద్ధాంతం కావచ్చు; మీ ప్రత్యేక ఆశయం కావచ్చు.

కాబట్టిఅందరూ అనుకరించే ఒకే ఒక మతం ఉండలేదని మనం గ్రహించాం. మత విషయమైన కర్తవ్యాన్ని ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. మతాన్ని గురించి నాకొక ఆశయం ఉంది; ఇది నాకు ప్రత్యేకమైనది. దాని పవిత్రతను నేను కాపాడాలి; అది గుహ్యమై ఉండాలి. కారణం ఏమంటే, అది మీ ఆశయం కాకపోవచ్చు. నా ఊహ ఏదో అందరికి తెలియపరచి, నేనెందుకు గందరగోళం సృష్టించాలి? ఇతరులు ముందుకొచ్చి నాతో పోరాడటానికి ఢీకోవచ్చు. నా ఊహను నేను వ్యక్తీకరించకపోతే మీరలా చేయలేరు. నా తలపులను నేను బట్టబయలు చేస్తే, వారు నన్ను ఎదిరించవచ్చు? వాటిని గురించి ప్రసంగించటం ఎందుకు? కాబట్టి ఈ ఇష్ట సిద్ధాంతం రహస్యంగా ఉండాలి. అది మీకూ భగవంతుడికి మాత్రమే తెలిసివుండాలి. మతానికి సంబంధించిన తదితర సిద్ధాంతాలనన్నిటిని గురించి ప్రజల మ్రోల బోధచేయవచ్చు; మత సమాజాలలో వాటిని ఏకరువు పెట్టవచ్చు; కాని ఉదాత్తమైన మతం అందరి ముందు వ్యక్తం కాజాలదు. క్షణకాల వ్యవధిలో

నా ఆధ్యాత్మిక భావనలను నేను సిద్ధపరచి ఉంచలేను. ఈ హాస్యాయుత అనుష్ఠానంవల్ల ఈ పవిత్రస్థలంలో ద్యోతకమయ్యే ఫలం ఏమిటో ఎరుగుదురా? దీనివల్ల మతాన్ని వెక్కిరింతకు గురిచేయడమవుతుంది. దీన్ని మించిన హేయమైన ఈశ్వరనింద మరొకటి ఉండబోదు. దీని ఫలం నేడు దేవస్థానాలలో, మతసంస్థలలో మీకు కనబడుతూనే ఉంది. మానవులు మత విషయంలో ఈ రీతి నిర్బంధవిధానం ఎలా సహిస్తారు? సైనికవాడలలోని సిపాయిల పద్ధతి మాదిరి ఇది ఉంది. భుజాలమీద ఆయుధాలను ఉంచుకొని, ముందుకు వంగి, ఒక పుస్తకాన్ని చేతపుచ్చుకొని, ఒకరు చెప్పేటట్లు అంగప్రత్యంగాలను తిప్పే వ్యాయామ పద్ధతిగా ఉంది. ఐదు నిమిషాలు భావానుభూతిని పొందడం, ఐదు నిమిషాలు హేతుశక్తిని అనుసరించి సమీక్షించడం, ఐదు నిమిషాలు ప్రార్థనచేయడం మొదలైన పనులు ముందే నిర్ణయించబడుతూంటాయి. మత విషయంలో ఈ హాస్యనాటకాలు నిజమైన మతాన్ని ఎక్కడికో తరిమికొట్టాయి. చర్చిలు ఉపదేశావళిని, సిద్ధాంతాలను, తాత్త్వికాశయాలను తమ మనస్సులకు వచ్చినట్లు బోధించనీ. కాని ఆరాధన చేయవలసిన సమయంలో నిజమైన మతానుష్ఠానం ఏసు చెప్పినట్లుఉండాలి: "నువ్వు ప్రార్థ న చేసేవేళ నీ రహస్యాగారంలో ప్రవేశించు. కవాటాన్ని బంధించి రహస్యంగా నీ తండ్రిని (ఈశ్వరుణ్ణి) ఆరాధించు."

ఇది ఇష్టసిద్ధాంతం. విభిన్నస్వాభావిక ప్రకృతుల మతావశ్యకత తీర్చడానికి, పరస్పర కలహాలకు చోటు ఇవ్వకుండటానికి, ఆధ్యాత్మిక జీవితంలో నిస్తులమైన అభ్యాసాన్ని సుసాధ్యం చేసుకోవడంలో తోడ్పడే ఏకైక సిద్ధాంతం ఇదొక్కటే. కాని నా మాటలోని సత్యాన్ని గుర్తించక, అపార్థంవల్ల పరమార్గా నికిపోతూ, మీరు రహస్య సంఘాలను నెలకొల్పరాదని హెచ్చరిస్తున్నాను. పిశాచం అనేది ఉంటే, అది ఇలాంటరహస్య సంఘాలలోనే కాపురం ఉంటుందని తెలుపుతాను. రహస్య సంఘ నిర్మాణంలో అది అధివసించి ఉంటుంది. ఈ సంఘాలు పైశాచిక ప్రణాళికలను అనుసరించి నడుస్తాయి. ఇష్టసిద్ధాంతం పవిత్రసిద్ధాంతం. అది రహస్య సిద్ధాంతం కాదు. దీని భావం ఏమిటో గ్రహిస్తారుగాక! నా ఇష్ట సిద్ధాంతాన్ని గురించిన ఉదంతాన్ని నేను ఇతరుల మ్రోల ఎందుకు ఏకరువు పెట్టకూడదు? అది నాకు ప్రగతిని కూర్చే పవిత్రసిద్ధాంతం. ఇతరులకు ఇది సహకారి కావచ్చు. అది వారికి చెరుపుతెచ్చినా తెస్తుందేమో! వారికది కీడు కలిగించదని ఎలా తెలుపగలను? తన ప్రకృతిని అనుసరించి సగుణ బ్రహ్మోపాసన ఒకడికి సరిపోకపోవచ్చు; నిర్గుణోపాసన, ఆత్మోపాసన అతడికి ఇష్టమై ఉండొచ్చు. అతణ్ణిమీ ముందు నేను విడిచిపెట్టా ననుకోండి. "అనంత కల్యాణ గుణోపేతుడైన ఈశ్వరుడు లేనేలేడు; సగుణోపాసన కూడదు. మీలోను, నాలోను విరాజిల్లే భగవంతుణ్ణే విశ్వసించండి" అంటూ మీకు అతడు బోధిస్తాడు. ఆ ప్రబోధం విని మీరు ఉలిక్కిపడతారు. అతడి ఊహ పునీతమైనదే! కాని గుహ్యమైనది కాదు. ఈశ్వర

సత్యాలను బోధించడానికై రహస్య సంఘాలను నెలకొల్పిన మహనీయుడైన మతాచార్యుడు ఒక్కడూ లేడు; మహత్తరమైన మత వ్యవస్థాలేదు. ఈ రీతి గూఢసంఘాలు భారతదేశంలో లేవు. ఇవి పాశ్చాత్య సంప్రదాయంలోనివే! ఇవి బలవంతంగా భారతదేశం మీద ఆపాదించబడినవి. వాటిని గురించిన విషయమే మేం ఎరుగం. రహస్య సంఘాలు భారతదేశంలో ఎందుకు ఉండాలి? సుస్థిరంగా స్థాపించబడిన మత సంస్థకు అనుగుణంగాలేని మతోద్దేశాలను గురించి ఒక్కమాటైనా పలుకడానికి యూరప్‌లో ప్రజలకు స్వాతంత్ర్యం లేదు. కాబట్టి వారు కొండలలో ప్రవేశించి, మరుగున నివసించి, రహస్యసంఘాలను స్థాపించేవారు. ఇలా చేయడంవల్ల వారు తమతమ మనస్సులకు నచ్చినరీతిని ఈశ్వరారాధన చేసుకోవడం సాధ్యమయ్యేది. మతాన్ని గురించి స్వతంత్రభావాలున్న వ్యక్తిని బాధించే అత్యాచారం ఎన్నడూ భారతదేశంలో తల ఎత్తలేదు. గూఢమత సమితులు ఎన్నడూ భారతభూమిలో పొడసూపలేదు. అవి ఎక్కడో ఉండేవనే ఊహ మీ మనస్సులలో ఉంటే, వెంటనే దాన్ని తరిమికొట్టండి. ఈ రహస్యసంఘాలు అనవరతం భయంకర వ్యవస్థలై విజృంభిస్తాయి; అవి ఎలాంటి చెరుపును కలిగిస్తాయో పరిశీలించే అనుభూతి నాకు ఈ జగత్తులో ఉంది. అవలీలగా అవి విశృంఖల ప్రేమ సంఘాలుగాను, పైశాచిక సమితులుగాను మారడం నేనెరుగుదును. వీటివల్లకొందరు అభాగ్యులు ఇతరుల (వీరు మగవారు కావచ్చు, మగువలు కావచ్చు) చేతుల్లోపడిపోతారు. ఆ అభాగ్యుల మానసికాభివృద్ధీ , క్రమాభివృద్ధీ, భావికాలజీవితాభివృద్ధీ ధ్వంసమవుతూంటుంది; ఈ అరిష్టం ఇంకా బహుముఖాల చెలరేగుతుంది. ఈ రీతిగా నేను ప్రసంగించడం మీలో కొందరికి ఇష్టంలేకపోవచ్చు. కాని సత్యాన్ని వచించడం నా విధ్యుక్తధర్మం. బహుశ స్త్రీ పురుషులు ఆరుగురు మాత్రమే నా యావత్తు జీవితంలో నన్ను అనుసరిస్తారేమో! కాని వారు సత్యారాధకులైన పవిత్రజీవులై ఉంటారు. పెద్దగుంపుమీద నేను చూపు నిలుపను. గుంపులు చేయగలిగేదేమిటి? ప్రపంచ చరిత్ర ఏ కొద్దిమందివల్లో నిర్మితమైంది. వీరిది దజన్ల సంఖ్యే! వీరిని వేళ్ళమీద లెక్కించవచ్చు. ఇతరులు ఒట్టిమూకలు మాత్రమే. ఈ గూఢసంఘాలన్నీ, ఈ మిథ్యాసంఘాలన్నీ స్త్రీ పురుషులను నీతిబాహ్యులను చేసివేస్తాయి. వారికి మానసిక దుర్బలత ఏర్పడుతుంది; వారి దృక్పథం ఎంతో హ్రస్వమై ఉంటుంది. మానసిక దుర్బలుల సంకల్పశక్తి శూన్యమైపోతుంది. క్రియాంగణంలో వారు ముందంజ వేయలేరు. అందుచేత అలాంటి సంఘాల సమీపానికి కూడ పోవద్దు; కాని ప్రసక్తి లేకనే ఉండండి. గుప్తమతవాదం మీది ప్రీతి మీ మనస్సులలో ప్రవేశించగానే దాన్ని ధ్వంసం చేసివేయండి. ఎవడి మనస్సులో ఆవగింజంత మాలిన్యం చేరిందో అతడు మతబాహ్యుడవుతాడు. చీము నెత్తురులతో దుర్గంధం వేసే పుళ్ళను గులాబి దొంతరలతో కప్పివేయపూనుకోవద్దు; మీరు ఈశ్వరుణ్ణి మోసగించగలమని ఊహిస్తున్నారా? ఎవ్వరూ దేవుణ్ణి వంచించలేరు. కపటం ఎరుగని ఒక పురుషుణ్ణి గాని, స్త్రీనిగాని నాకు ప్రసాదించండి చాలు. ఈశ్వరా! పెనుభూతాలనుంచి, ఎగురగలిగే దేవతలనుంచి, పిశాచాల నుంచి నన్ను కాపాడు. అనుదినం సామాన్యప్రజలై, నిర్మలచేతస్కులై ఉండండి.

మనలో సహజ ప్రవృత్తి అనేదొకటి ఉంది. ఈ నైసర్గిక ప్రవృత్తి పశువులకూ ఉంది. ఈ ప్రవృత్తివల్లశ రీరం అప్రయత్నంగా చలిస్తుంది. దాన్ని మించిన శక్తి హేతుశక్తి — మేధాశక్తి లోక విషయాలను పరిశీలించి, వాటినుంచి సిద్ధాంతాలను గావించుకొంటుంది. సహజ ప్రవృత్తికంటే ఈ శక్తి మన జీవితంలో విశేష సహకారి కాగలదు. ఈ శక్తిని మించిన మహత్తరశక్తి మరొకటి ఉంది. అది ప్రకృతికి అతీతమైనది. ఆధ్యాత్మిక ప్రభావం గలది. అది హేతుపంథాను అనుసరించదు. దాని ప్రభావంవల్ల ఆకస్మిక కాంతిలా జ్ఞా నం మానస దిగ్వలయం మీద తళుక్కుమంటుంది. దానివల్ల సర్వోత్కృష్టప్రజ్ఞా నం లభిస్తుంది. సహజ ప్రవృత్తివల్లదాన్నెలా గ్రహించగలం? ఇది ఎంతో కష్ట మైంది. ఈ రోజుల్లోప్రతివ్యక్తీ మీ సమక్షానికి వచ్చి, తనకు దివ్యప్రేరణ కలిగిందని చెబుతాడు. తనకున్న అతిలోక ప్రభావాన్ని గురించి గొప్పగా కబుర్లు చెబుతూంటాడు. నిజమైన దివ్యప్రేరణకూ, ప్రపంచానికీ ఉన్న వ్యత్యాసాన్ని గ్రహించడం ఎలా? ఆధ్యాత్మికోద్వేగశక్తి (ఈశ్వర ప్రేరితజ్ఞానం) హేతుశక్తికి విరుద్ధమై ఉండకూడదు. ఇది ముందుగా మనం గ్రహించవలసిన విషయం. వృద్ధుడు, శిశువు వేరుకారు; అతడు పెరిగిన శిశువే! మనం ఉల్లేఖించే దివ్య ప్రేరణ హేతుశక్తియొక్క ప్రవృద్ధే! హేతుశక్తి ద్వారా ఈ దివ్య ప్రేరణ అలవడుతోంది. సహజ ప్రవృత్తివల్ల కలిగే శారీరక సంచలనం హేతుశక్తికి విరుద్ధ ం కాదు. మీరొక వీథిని దాటేటప్పుడు, చాలా వేగంగా వచ్చే మోటారుకారనుంచి కాపాడుకోవడానికై మీ శరీరాలను ఎలా ఆకస్మికంగా చలింప చేస్తారో ఎరుగుదురు కదా! మీ దేహాలను అలాంటివిపత్తులనుంచి సంరక్షించుకోవడం తెలివితక్కువ పనిగా మీ మనస్సులు

మిమ్ము ఆక్రోశిస్తాయా? అలా చేయవు. అదే రీతిగా దైవప్రభావం హేతుకశక్తికి ప్రతికూలమై విజృంభించదు. అలా ప్రతికూలంగా విజృంభిస్తే అది దైవీప్రభావ సమన్వితశక్తి కాబోదు. ఈ ఆధ్యాత్మికశక్తి సర్వజనాభ్యుదయాన్ని కలిగించేది; ఇది పేరు ప్రాకులాటకుకాని, వ్యక్తిగత లాభంకోసంగాని వినియోగం కాదు. ఇది సదా ప్రపంచకల్యాణానికై తోడ్పడుతుంది; దీన్లో ఆవగింజంత స్వార్థచింత లేదు. అప్పుడే అది ఆధ్యాత్మికోద్వేగశక్తి అని మీరు నిశ్చయంగా తెలుసుకోవచ్చు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో పదిలక్షల మందిలో ఒక్కరికైనా ఈ అద్భుతశక్తి లేదని మీరు గ్రహించాలి. ఈ పరిస్థితిలో పరివర్తన కల్గుతుందని విశ్వసిస్తున్నాం. మనం ఇప్పుడు మత్తంతో ఆటలాడుతున్నాం. అతిప్రకృతశక్తి, పూర్వోక్త ఆధ్యాత్మిక విభూతి మనకు అలవడిన శుభగళ ముహూర్తంలో మనలో మతావిర్భావం గోచరిస్తుంది. "మనం ఇప్పుడు ఒక గాజుగుండా చూస్తున్నాం. దానిగుండా అది అంత స్పష్టంగా కనబడటంలేదు. అయినా అది సన్నిహిత ముఖవీక్షణమే" అని సెయింట్ పాల్ తెలిపిన వాక్కు సత్యదీపితమైనది. ప్రస్తుత ప్రపంచ స్థితిలో ఆ ఉదాత్తశక్తిని అలవరచుకొన్నవారు శుద్ధపూజ్యులు. కాని మాలో ఆధ్యాత్మికశక్తి ఉందని దంభాలు పలికేవారు ఈ కాలంలోనే ఎక్కువ! ఈ దృఢోక్తులు మిథ్యాప్రలాపాలే! స్త్రీలలో స్వజాతశక్తులు అధికంగా పనిచేస్తాయనీ, పురుషులు మాత్రం హేతుశక్తిద్వారా మెల్లమెల్లగా ఉదాత్తమైన స్థితిని చేరుకొంటారనీ కొందరి అభిప్రాయం. ఈ మాట సత్యమని నమ్మవద్దు. ఈ శక్తిగలవారి సంఖ్య స్త్రీ పురుషులలో సమానమే. కాని బహుశ స్త్రీలలో పలువురిలో స్నాయవిక దౌర్బల్యయుక్త వ్యాధీ, వివిధ రీతుల హిస్టీరియా ప్రకోపమూ విజృంభిస్తూంటుంది. గారడీ విద్యను ప్రదర్శించేవారి చేతుల్లోను, వంచకుల చేతుల్లోను చిక్కడంకంటే మీరు నాస్తికులై మరణించటం మేలు. వినియోగానికై హేతుశక్తి మీకు ప్రసాదించబడింది. ఈ శక్తిని మీరు సక్రమంగా వినియోగించామని రూఢి పరచండి. అప్పుడే ఉదాత్తాశయాల దిస మీరు అగ్రేసరులు కాగలరు.

భగవంతుడు ప్రేమ అనే సంగతిని మనమంతా జ్ఞప్తిలో ఉంచుకోవాలి. "గంగాతీరాన వసిస్తూ, నీటికోసం చిన్నబావిని తవ్వేవాడు నిజానికి మూర్ఖుడు. వజ్రాలగని వద్ద వసిస్తూ గాజుముత్యాలను సేకరించడంలో తన జీవితాన్ని వెచ్చించేవాడు నిజానికి మూర్ఖుడు." భగవంతుడు వజ్రాలఖని, ఈశ్వరుణ్ణిపరిత్యజించి, భూతాలను గురించిన పుక్కిటి పురాణాలకోసమూ, ఇక్కడా అక్కడా పుట్టే పిశాచాల గాథలకోసమూ ఎగబడితే మనమూ బుద్ధి హీనులమే అవుతాం. ఆ ప్రవర్తన ఒక వ్యాధి అవ్వాలి; రోగభూయిష్ఠమైన వాంఛ అలా వ్యక్తమవుతూంటుంది. ఈ వ్యాధి జాతిని అధోగతిలో కూలదోస్తుంది; దీనివల్ల శరీరంలోని నరాలూ, ధమన స్నాయువులూ, మెదడూ శక్తివిహీనాలవుతాయి. పిశాచగణాన్ని గురించిన నిరంతరభీతీ, ఆశ్చర్యజనక క్రియలను గురించిన పిపాసా, తీవ్రవాంఛాప్రకోపమూ, భయంకరకథాపఠనమూ మనస్సులో దారుణోద్రేకాన్ని పుట్టిస్తాయి. ఈ రీతిగా ఉత్తేజితమైన జాతి అధోగతి పాలవుతుంది. ఇది ఆకస్మిక పతనం కాకపోవచ్చు. కాని ఇది సునిశ్చిత పతనమే. ఈశ్వరుణ్ణి పరిత్యజించటం, నిర్మలజీవితానికి నీరు వదలడం, పవిత్రత అంటే కళ్ళు ఎర్రచేయటం, ఆధ్యాత్మిక చింతకు ఆంక్ష పెట్టడం, పనికిరాని విడ్డూరాలకై గుక్కిళ్ళు మింగటం – ఇవి మనిషిని అధోగతికి ఈడ్చే దుష్టప్రవృత్తులు. ఇతరుల మనస్సులలోని ఊహలను గ్రహించి చెప్పడం ప్రశంసనీయమవుతోంది. ఇతరుల మనస్సులలోని తలపులను ఒక్కుమ్మడిగా ఐదు నిమిషాలలో తెలుసుకోదలస్తే, నేను ఉన్మత్తుడనవుతాను. శక్తిసమన్వితులవండి; లేచి నిలబడండి; ప్రేమనారాయణుణ్ణిఅ న్వేషించండి. ఇలా చేస్తే మీకు సర్వోత్కృష్ట మైన శక్తి అలవడుతుంది. పవిత్రతకున్న శక్తికంటే ఘనతరమైన శక్తి ఏది? ప్రేమ, పవిత్రతా ప్రపంచాన్ని ఏలుతాయి. శక్తిహీనులకు ఈశ్వర ప్రేమ అలవడదు. కాబట్టి శారీరకంగాగాని, మానసికంగాగాని, నైతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని శక్తిహీనులు కాకండి. ఈశ్వరుడొక్కడే సత్యం; ఈశ్వరుడు కానిదంతా మిథ్య, భగవంతుడికోసమై అన్యవస్తువులనన్నిటిని పరిత్యజించండి. అవి వ్యర్థాలు; వ్యర్థవిజృంభణం కేవలం దంభయే. దంభాలలో దంభం – సమస్తమూ దంభం. ఈశ్వరుణ్ణి సేవించండి; ఈశ్వరుణ్ణే సేవించండి. అంతా మంచే జరుగుతుంది.

# భక్తి

ఈశ్వరుడు సగుణుడు అన్న భావం ఏవో కొన్ని మతాలలో తప్ప, దాదాపు అన్ని మతాలలోను ఉంది. బౌద్ధ, జైన మతాలలో లేదు కాని ప్రపంచంలోని తక్కిన సమస్త మతాలలోను దేవుడు సగుణుడు అన్న భావం ఉంది. దీన్ని అనుసరించి భక్తి, పూజ అనే భావం కలిగింది. బౌద్ధులకూ జైనులకూ ఈశ్వరుడు లేకపోయినా వారు తమ తమ స్థాపకులను దేవుణ్ణిగా

భావించి పూజిస్తారు. బదులు ప్రేమను మానవుడికి చూపగలిగే ఒక పరతత్త్వం పట్ల భక్తి చూపడంలో ప్రయత్నమేర్పడుతుంది అనే ఆశయాల విశ్వాసం. వివిధ మతాలలో ఈ ప్రేమ, భక్తి వివిధ దశలలో, వివిధ పరిమాణాలలో వ్యక్తమవుతున్నాయి. కర్మకలాపాలతో కూడిన దశ ఎంతో సామాన్యమైనది, చివరిది. ఈ దశలో సుసూక్ష్మాశయాలు దాదాపు అసంభవాలే. అవి అట్టడుగుస్థాయికి కొనిపోబడి స్థూలరూపం పొందబడతాయి. రూపాలు వాటితోపాటు వివిధ సంకేతాలు ప్రాముఖ్యానికి వస్తాయి. భావాతీతమైనదాన్ని రూపకల్పన మూలాన, సంకేతాల సాయంతోను గ్రహించడానికి మానవుడు యత్నిస్తూండటం ప్రపంచచరిత్ర అంతటిలోను కానవస్తుంది. గంటలు, వాద్యాలు, కర్మలు, గ్రంథాలు, ప్రతిమలు అనే మతబాహ్యరూపాలన్నీ ఈ శీర్షిక కిందికి వస్తాయి. ఇంద్రియ ప్రీతికరాలైనవన్నీ అప్రత్యక్షమైనదానికి ప్రత్యక్షరూపకల్పన చేయడానికి మానవుడికి సాయపడేవన్నీ స్వీకరించబడినవి, పూజింపబడినవి.

సంకేతాలనన్నింటిని, కర్మలనన్నింటిని ప్రతిఘటించిన సంస్కర్తలు ప్రతీ మతంలోను అప్పుడప్పుడు ఉండే ఉన్నారు. కాని వారి ప్రతిఘటన నిష్ప్రయోజనమే అవుతూంటుంది. ఎందుకంటే మనిషి మనిషిగా ఉన్నంత కాలం — అంటిపెట్టుకోవడానికి స్థూలమైన ఒకదాని ఆవశ్యకత, తమ ఆశయాలకు ఒక ఆశ్రయావశ్యకత, తమ మానసిక రూపకల్పనలకు అన్నిటికి కేంద్రంగా ఉండగలదాని ఆవశ్యకత అధికసంఖ్యాకులకు సదా ఉంది. కర్మకలాపాలకు స్వస్తిచెప్పడానికే మహమ్మదీయులు, ప్రొటస్టెంట్లు చేసిన భగీరథ ప్రయత్నాలు. కాని కర్మకలాపాలు వారి ఆచారాలలోనే చొచ్చుకొన్నాయనడం మనకు ప్రత్యక్షం. వాటిని పరిత్యజించడం సాధ్యం కాదు; సుదీర్ఘకాలం పెనగులాడి జనం ఒక సంకేతంనుంచి మరొక సంకేతానికి మారుతారు అంతే. మహమ్మదీయుడు కానివాడు ఉపయోగించే ప్రతీ కర్మా, ప్రతీ రూపమూ, విగ్రహమూ, క్రతుమా దుష్టాలని భావించే మహమ్మదీయుడు తాను కాబా వద్దకు వచ్చినప్పుడల్లాఅలా అనుకోడు. మతానుష్ఠానపరుడైన ప్రతీ మహమ్మదీయుడు తానెక్కడ ప్రార్థన చేసినా తాను కాబాకు అభిముఖంగా నిలబడి ఉన్నాననే భావించాలి. అక్కడికతడు తీర్థయాత్రకు వెళ్ళినప్పుడు ఆ ఆలయపు గోడలోని నల్లని రాయిని ముద్దుపెట్టుకోవాలి. ఆ రాయిమీద ముద్రితాలైన లక్షోపలక్షల యాత్రీకుల ముద్దులు భగవంతుడు తీర్పుచేప్పే చివరిరోజు విశ్వాసవంతులకు అనుకూలురైన సాక్షులుగా రూపొంది నిలుస్తాయి. ఇంతేకాక 'జింజిం' బావి ఒకటి ఉంది. ఆ బావినుంచి ఎవరైనా కొంచెం నీరు తోడితే వారి పాపాలు క్షమింపబడుతాయనీ, పునరుత్థాన దినం తరువాత వారు కొత్తదేహం దాలుస్తారనీ, వారు శాశ్వతంగా జీవిస్తారనీ మహమ్మదీయులు విశ్వసిస్తారు. ఇతరుల విషయంలో సంకేతాలు భవనాల రూపం దాల్చడం కనిపిస్తుంది. ఇతర స్థలాలకంటే 'చర్చ్' లు పవిత్రాలని ప్రొటెస్టెంటుల నమ్మకం. చర్చే ఇక్కడ సంకేతమవుతోంది. లేదా గ్రంథం ఉంది. సంకేతాలన్నిటికంటే వారికి 'గ్రంథం' ఎంతో పవిత్రతరమైనది.

సంకేతాలను ఖండిస్తూ బోధచేయడం నిష్ప్రయోజనం. అసలు వాటిని ఖండించి ఎందుకు బోధించాలి? మానవుడు సంకేతాలను ఉపయోగించరాదనడానికి కారణం లేదు. వాటి వెనుకవున్న భావాలను స్ఫూర్తిమంతం చేయడానికై మానవులు సంకేతాలను ఉంచుకొన్నారు. ఈ విశ్వమే ఒక సంకేతం. దీన్లోను, దీని ద్వారా ఇది సూచించే విషయాన్ని గ్రహించడానికి మనం ప్రయత్నిస్తున్నాం. ఆ సూక్ష్మవిషయం దీని వెనుకా, దీనికి అతీతంగాను ఉంది. గమ్యం ఆత్మేకాని స్థూలద్రవ్యం కాదు. రూపాలు, ప్రతిమలు, గంటలు, దీపాలు, గ్రంథాలు, చర్చ్‌లు, దేవాలయాలు — ఈ పవిత్ర సంకేతాలన్నీ చాలా మంచివే; ప్రవర్ధమానమైన ఆధ్యాత్మికత అనే అంకురానికి ఎంతో సాయపడేవే. కాని, అంతవరకే, అంతకు మించరాదు. అనేకుల విషయంలో చూశామంటే మొక్క పెరుగడం లేదు. 'చర్చ్‌లో పుట్టుక చెందడం చాలా మంచిదేకాని చర్చ్‌లోనే మరణించడం' ఎంతో శోచనీయం. ఆధ్యాత్మికత అనే చిన్న మొలకకు తోడ్పడే కొన్ని ఆచారాల అవధులకు లోబడి మానవుడు పుట్టడం చాలా మంచిదే కాని ఆ ఆచారాల అవధులలోనే అతడు మరణించాడంటే, అతడు ఎదగలేదని ఆత్మకు ఎలాంటి వికాసమూ

కలుగలేదని ఆ మరణం సూచిస్తుంది.

కాబట్టి సంకేతాలను, కర్మకలాపాలను, ఆచారాలను శాశ్వతంగా ఉంచుకోవలసిందని ఎవరైనా చెబితే అది తప్పు. సంకుచిత, వృద్ధిరహిత ఆత్మ ఉన్నప్పుడు, దాని వృద్ధికి ఈ సంకేతాలూ క్రతువులూ తోడ్పడుతాయని ఒకడు అన్నాడంటే అది సరి. ఆత్మాభివృద్ధిఅంటే బుద్ధి వికాసం కాబోలునని మీరు పొరపడకూడదు, ఒకడు మహామేధావిగా ఉండవచ్చు. అయినా ఆధ్యాత్మికంగా అతడు శిశువుగానే ఉండొచ్చు. దీన్లోని నిజాన్ని మీరిప్పుడు తెలుసుకోవడానికి వీలవుతుంది. సర్వవ్యాపి అయిన దేవుడిలోని నమ్మకం మీ అందరికి గరపబడివుంది. ఆ విషయం ఆలోచించి చూడండి. సర్వవ్యాపకత అంటే ఏమిటో భావించగలవారు మీలో ఎంత కొద్దిమంది! శ్రమపడి ప్రయత్నించారంటే 'మహాసముద్రం', 'ఆకాశం', 'విశాలమైన పచ్చిక బయలు', 'ఎడారి' — వీటిలో ఏదైనా ఒకదాని తలంపును పోలినది మీకు స్ఫురిస్తుంది. ఇవన్నీ భౌతిక ప్రతిమలు. భావాతీతమైనదాన్ని భావాతీతంగానే, లక్ష్యాన్ని లక్ష్యంగానే మీరు భావించలేకున్నంత వరకు ఈ రూపాలను, ఈ భౌతిక ప్రతిమలను ఆశ్రయించక తప్పదు. ఈ ప్రతిమలు మనస్సులోనివైనా, వెలుపలివైనా ఎక్కువ భేదమేమీ లేదు. మనమందరం విగ్రహారాధకులుగానే జన్మించాం. విగ్రహపూజ మానవప్రకృతిలోనే ఉంది. కాబట్టిఅ ది మంచిదే. దాన్ని ఎవరు దాటిపోగలరు? పరిపూర్ణుడైన వ్యక్తే, దివ్యావతారమూర్తే దాటగలడు. తక్కినవారందరూ విగ్రహారాధకులే. రూపాలతో, ఆకృతులతో కూడిన ఈ విశ్వాన్ని మనం చూస్తున్నంత కాలం మనమందరమూ విగ్రహారాధకులమే. విశ్వం మనం పూజిస్తూన్న ఒక మహత్తర సంకేతం. 'దేహమే నేను' అని పలికేవాడు జన్మతః విగ్రహారాధకుడు. మనం ఆత్మస్వరూపులం; ఆకృతి, అంతంలేని దివ్యాత్ములం. ఆత్మ అనంతం, జడం పరిమితం. కాబట్టి భావాతీతమైనదాన్ని గ్రహించలేనివాడు,

దేహంవంటి స్థూలద్రవ్యంలోను స్థూలద్రవ్యంగుండానూ కాక ఆత్మస్వరూపాన్ని భావించుకోలేనివాడు విగ్రహారాధకుడే. ఇలా తయువుండి జన్మం ఒకరినొకరు విగ్రహారాధకులని పరస్పరం విమర్శించుకుంటున్నారు! అంటే ప్రతివ్యక్తీ తన విగ్రహమే కచ్చితమైనదని ఇతరుల విగ్రహాలు సరైనవి కావని అంటున్నాడు.

కాబట్టి మనం ఇలాంటి పసితనపు భావాలను వదలించుకోవాలి. మతమంటే వ్యర్థ ప్రసంగంలో, సిద్ధాంతాలతో కూడిన విధానాలు అని భావించేవారి మాటలను దాటిపోవాలి. వారికి మతమంటే బుద్ధిచేత అవుననో కాదనో చేసే నిర్ణయం మాత్రమే; వారికి మతమంటే తమ పురోహితులు చెప్పే మాటలను నమ్మడమే; వారికి మతమంటే, తమ పూర్వులు నమ్మినదే; వారికి మతమంటే తాము అంటిపెట్టుకొనివుండే కొన్ని అభిప్రాయాల, మూఢవిశ్వాసాల సమూహమే. వారు వాటిని అంటిపెట్టుకొని ఉండటానికి కారణం అవి దేశీయులందరికీగల మూఢవిశ్వాసాలు అవడమే. ఇలాంటి వీరి ప్రలాపాలను మనం దాటిపోవాలి. మానవకోటిని సర్వాంగసంపన్నమూ ఏకైకమూ అయిన పెద్ద నిర్మాణంగా, మెల్లగా వెలుతురు వంకకు వస్తూన్నదానినిగా తీసుకోవాలి. మానవతని ఒక అద్భుత అంకురంగా భగవంతుడనే అద్భుత సత్యానికి

అభిముఖంగా, మెల్లగా వికసిస్తున్న ... దాని మొదటి పరిభ్రమణాలు, తొలి చలనాలు ఎప్పుడూ స్థూలద్రవ్యంగుండానూ, కర్మకలాపాల ద్వారానూ మాత్రమే జరుగుతాయి.

ఈ క్రతుకలాపాలకు అన్నిటికీ హృదయమూ, తక్కిన అన్నిటికంటే ముఖ్యమైన ఆశయం — నామభజన మీలో ప్రాచీన క్రైస్తవాచారాలను పరిశీలించిన వారూ లోకంలోని తక్కిన మతాలను పరిశీలించినవారూ వాటి అన్నిట్లోను ఈ ఆశయాన్ని ఈ నామభజనను గుర్తించి ఉంటారు. నామం పరమపావనమని చెప్పబడింది. పావన భగవన్నామం పవిత్రతలో సాటిలేనట్టిదనే ప్రమాణం బైబిల్లో చూస్తున్నాం. నామాలన్నిటిలో అదే పవిత్రతమం. ఆ నామమే భగవానుడనీ భావించబడింది. అది ముమ్మాటికీ నిజమే. ఈ జగత్తు నామరూపాత్మకం కాక మరేమిటి? మాటలు లేకుండా మీరు ఆలోచించగలరా? శబ్దార్థాలను పరస్పరం వేరుచేయడం అసాధ్యం. వాటిని వేరుచేయ వీలవుతుందేమో మీలో ఎవరైనా ప్రయత్నించి చూడండి. మీరెప్పుడు భావించినా నామరూపాలగుండానే భావిస్తూంటారు. ఒకటి మరొకదాన్ని స్ఫురింపచేస్తుంది; భావం శబ్దాన్ని శబ్దం భావాన్ని స్ఫురింపచేస్తాయి. ఇలా ఈ విశ్వమంతా భగవంతుడి బాహ్యసంకేతం. దాని వెనుక ఉన్నది మహిమాన్వితమైన భగవన్నామం. ప్రతీ దేహం ఒక రూపం. ఆ దేహానికి వెనుక దాని నామం ఉంది. మీ ఫలానా మిత్రుణ్ణి తలచుకోగానే మీ భావవీథిలో అతడిదేహం వచ్చి నిలుస్తుంది. మిత్రుడి దేహాన్ని తలచుకోగానే అతడి

నామం స్ఫురిస్తుంది. ఇది మానవ తత్త్వంలోనే ఉంది. అంటే మనస్తత్త్వశాస్త్రానుసారం మానవుడి మనస్సులో రూప స్ఫూర్తిలేని నామస్ఫూర్తి ఉండదు, నామస్ఫూర్తిలేని రూపస్ఫూర్తి ఉండదు. అవి విడదీయరానివి; ఒకే కెరటం యొక్క బాహ్యాంతర రూపాలు అవి. కాబట్టి విశ్వం అంతటా నామాలను గొప్పచేయడమూ, భజించడమూ జరుగుతూ వస్తోంది. తెలిసో తెలియకో మానవుడు నామమహిమను కనుగొన్నాడు.

అనేక మతాలలో పవిత్రాత్ములను పూజించడం చూస్తున్నాం. కృష్ణుణ్ణి పూజిస్తారు. బుద్ధు ణ్ణి పూజిస్తారు. జీసస్ ను పూజిస్తారు. ఇంకా అలాంటి వారిని పూజిస్తారు. యోగులను పూజించడమూ కద్దు. లోకం అంతటా వందలాది యోగులు పూజింపబడుతున్నారు. ఔను, మరి ఎందుకు పూజించబడకూడదు? కాంతి స్పందనం సదా ఉండే ఉంటుంది. గుడ్లగూబ దాన్ని రాత్రులలో చూస్తుంది. అంటే అప్పుడు మనిషి చూడలేకపోయినా అదేమో ఉన్నదన్నమాట. మనిషికి ఆ కాంతి స్పందనం దీపం, సూర్యుడు, చంద్రుడు మొదలైన వాటిలో మాత్రమే కనిపిస్తుంది. భగవంతుడు అన్నిచోట్లా ఉన్నాడు. అతడు తనను తాను ప్రతి జీవిలోను వ్యక్తం చేసుకొంటున్నాడు; కాని మానవులకు మాత్రం అతడు మానవుడిలోనే కనిపిస్తాడు, మానవుడిలోనే గుర్తింపబడతాడు. దేవుడి వెలుగు, దేవుడి సాన్నిధ్యం, దేవుడి తత్త్వం మానవుడి ముఖతా ప్రకాశించినప్పుడే మానవుడు దాన్ని గ్రహించగలడు. ఈ విధంగా మానవుడు దేవుణ్ణిమానవరూపంలో అనాదిగా ఉపాసిస్తున్నాడు. మానవుడు మానవుడిగా ఉన్నంత కాలం అలా చేయవలసిందే. మానవుడు ఈ పద్ధతిని ఖండించవచ్చు; ప్రతిఘటించవచ్చు. కాని దేవుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నించగానే దేవుణ్ణిమానవుడిగా సంభావించడం తన ప్రకృతికి అనివార్యమని గుర్తిస్తాడు.

కాబట్టి దాదాపు ప్రతీ మతంలోను దేవుడి పూజ విషయంలో మూడు ముఖ్యవిషయాలున్నాయి — విగ్రహాలు (సంకేతాలు); నామాలు, దివ్యపురుషులు. ఇవి మతాలన్నిటిలోను ఉన్నాయి. కాని మతాలు పరస్పరం కలహింపగోరుతున్నాయన్న సంగతి మనం గమనిస్తున్నాం. ఒకడు, “నేను జపించే నామమే నామం; నేను మన్నించే రూపమే రూపం; నేను పూజించే మహాత్ములే లోకంలోకల్లా మహాత్ములు; మీవన్నీ వట్టి కల్ల లు” అని చెబుతాడు. ఈ కాలంలోని క్రైస్తవమతాచార్యులు కాస్త కనికరం గలవారైనారు. ప్రాచీన మతాలన్నిటిలోని వివిధ పూజావిధానాలన్నీ క్రైస్తవ విధానానికే పూర్వరూపాలని ఒప్పుకొంటారు. క్రైస్తవమతమే ఏకైక మార్గమని వారు పరిగణిస్తారు. దీనికి మునుపు దేవుడు తనను తాను పరీక్షించుకొన్నాడు; వివిధ మార్గాలను సృజించి తన శక్తులను పరీక్షించుకొన్నాడు. అవన్నీ చివరకు క్రైస్తవంలోని పూర్ణత్వం పొందాయి. ఇలా అనుకోవడంకూడ గొప్ప పురోగతే. ఏభై ఏళ్ళక్రితం ఇంతైనా వారు ఒప్పుకోలేదు. తమ మతం తప్ప మరేదీ సత్యంకాదు. ఇలా అనుకొంటున్నవారు ఏ ఒక్క మతంలోనో, జాతిలోనో, వర్ణంలోనో ఉన్నవారు మాత్రమే కారు. ‘తాము ఏం చేస్తున్నారో అదే అందరికీ ఆచరణీయం’ అనే జనం సదా తలపోస్తుంటారు. ఈ విషయంలోనే విభిన్న మతాల పరిశీలనం మనకు తోడ్పడేది. మనకు మాత్రమే చెందినవని మనం అనుకొంటున్న ఆశయాలే వందలాది [illegible] ఇతరులలోను ఉన్నాయనీ, ఒక్కొక్కప్పుడు మనలో వ్యక్తం అయినంతకంటే కూడ మేలుగా ఇతరులలో వ్యక్తమైఉన్నాయని ఈ పరిశీలన మనకు చూపిస్తుంది.

ఇవి భక్తికి బాహ్యరూపాలు. వీటిద్వారా మానవుడు సాగిపోవాలి. సాధకుడు ఆర్జవం కలిగి, సత్యాన్ని చేరుకోవాలని నిజంగా కోరుకొంటే అతడు వీటిని అతిక్రమించి, రూపాలు ఒక లెక్కకాదు అనుకొనే అంతస్తునందుకొంటాడు. మత రంగంలో దేవాలయాలు కాని, చర్చిలుకాని, గ్రంథాలుకాని, విగ్రహాలుకాని పసిబిడ్డల తోటబడి వంటివి. ఆధ్యాత్మిక శిశువు పుష్టిచెంది ఉన్నత పథాలను అందుకోవడానికి ఇవి సహాయపడతాయి; ఈ ప్రాథమిక సోపానాలు మతాన్ని కోరేవారికి అవసరమే. భగవంతుడికోసం తృష్ణ, వ్యాకులత కలగడంతో నిజమైన భక్తి జనిస్తుంది. ఈ తృష్ణఎవరికి ఉంది? అదే అసలు ప్రశ్న. మతం సిద్ధాంతాలలోను, సూత్రాలలోను, ప్రజ్ఞావాదాలలోను లేదు. మతమంటే మన స్థితీ, మన పరిణతే. మతమంటే సాక్షాత్కారానుభవమే. దేవుణ్ణిగురించి, ఆత్మను గురించి, సృష్టి రహస్యాలను గురించి ఎందరో ప్రసంగిస్తూంటారు. మనం వింటూంటాం. వారిని ఒక్కొక్కరినిగా “నువ్వు భగవత్సాక్షాత్కారం పొందావా? నీ ఆత్మను దర్శించావా?” అని అడగండి. ఔనని జవాబిచ్చే వారెందరు? అయినా వారు పరస్పరం పోరాడుకొంటూనే ఉన్నారు! ఒకప్పుడు భారతదేశంలో వివిధ మతశాఖల ప్రతినిధులు సమావేశమై వాదులాడుకోసాగారు. శివుడొక్కడే దేవుడని ఒకడన్నాడు; విష్ణువొక్కడే దేవుడని

మరొకడన్నాడు. ఇలాగే ఒక్కొక్కరు ఒక్కొక్కరిని దేవుడన్నారు. ఈ వివాదాలకు అంతులేకపోయింది. ఒక జ్ఞాని ఆ దారిన పోతున్నాడు. వివాదాన్ని పరిష్కరించవలసిందిగా వారు అతణ్ణి కోరారు. శివుడే పరాత్పరుడని వాదించిన వ్యక్తిని అతడు, "నువ్వు శివుణ్ణి చూశావా? నీకు అతడితో పరిచయం ఉందా? లేకుంటే అతడే పరాత్పరుడని నీకెలా తెలుసు?" అని ప్రశ్నించాడు. తరువాత ఆ జ్ఞాని విష్ణుభక్తుడి వైపు తిరిగి, "నువ్వు విష్ణువును చూశావా?" అని అడిగాడు. వారందరిని ఇదే ప్రశ్నను అడిగి వారిలో ఎవరికీ దేవుణ్ణిగురించి ఏమీ తెలియదని గ్రహించాడు. తెలియదు కాబట్టే వాదులాడుకొంటున్నారు.

వారికి నిజానికి తెలిసివుంటే వాదులాడుకొనేవారు కారు. కడవను నీటితో నింపేటప్పుడు బుడబుడ శబ్దమవుతుంది. కడవ నిండాక శబ్దం రాదు. అదేవిధంగా వివిధ మతశాఖలవారి ఈ వాదులాటలు, పోరాటాలు వారికి మతాన్ని గురించి ఏమీ తెలియదని స్పష్టీకరిస్తున్నాయి. వారికి మతమంటే పుస్తకాలలో రాసివుంచిన వ్యర్థప్రలాపాలు. దొరికిన ప్రతి పుస్తకం నుంచి సంగతులు తస్కరించి, ఎలాంటి కృతజ్ఞతా చూపకే ప్రతివాడూ గ్రంథం రచించడానికి ఉద్యుక్తుడవుతాడు, ఆ గ్రంథాన్ని వీలైనంత విస్మృతింప చూస్తాడు. తరువాత ఆ గ్రంథకర్త తన పుస్తకాన్ని లోకంలోకి పంపిణీ చేసి ఇదివరకే ఉన్న అశాంతికి మరికొంత అశాంతిని చేరుస్తాడు.

జనులలో అత్యధిక సంఖ్యాకులు నాస్తికులు. ఆధునిక కాలంలో పాశ్చాత్య ప్రపంచంలో మరొక వర్గపు నాస్తికులు తయారైవున్నందుకు నాకు సంతోషం, నేను చెప్పదలచింది అనాత్మవాదులను గురించి. వారు ఋజుత్వం గల నాస్తికులు. వారు ఆస్తికులమని చెప్పుకొనే నాస్తికులకంటే మేలే. ఈ ఆస్తికులు దాంభికులు; 'మతం' 'మతం' అంటూ వీరు వాదులాడుతూంటారు. పోరాడుతూంటారు. కాని అనాత్మవాదులకు దాన్లోఅ క్కరలేదు. దాన్ని అర్థ ం చేసుకోవడానికి

వీరెప్పుడు ప్రయత్నించరు. సాక్షాత్కరించుకోవడానికి ప్రయత్నించరు. క్రీస్తు సూక్తులను స్మరించండి: "అడుగు, నీకు ఇవ్వబడుతుంది; అన్వేషించు, నువ్వు కనుగొంటావు; తట్టు, తెరువబడుతుంది." ఈ మాటలు అలంకారాలు కావు, అసత్యాలు కావు. ప్రతీ అక్షరం నిజం, అవి మన లోకంలో అవతరించిన ఈశ్వరపుత్రులలో అందరికంటే మహోన్నతుడైన వ్యక్తి హృద్రక్త పరీవాహమే. మీరూ, నేనూ ఈ భవనాన్ని చూస్తున్నదానికంటే నూరింతలెక్కువ గాఢంగా దేవుణ్ణి స్వయంగా తాకి, అనుభవించి, దేవుడితో మాట్లాడి, దేవుడితో వసించిన వ్యక్తి సాక్షాత్కారానుభవం నుంచి పుట్టిన వాక్కులవి. దేవుడు ఎవరికి కావాలి! ఇదే అసలు ప్రశ్న. లోకంలోని జనమంతా దేవుణ్ణి కోరుతున్నారనికాని, అతణ్ణి పొందలేకపోతున్నారనికాని నీ అభిప్రాయమా? కోరుకొనీ పొందలేకపోవడం పొసగదు. కోరబడే వస్తువు బాహ్యజగత్తులో లేనే లేకపోతే, ఏ కోరిక ఉంటుంది? మానవుడు గాలి పీల్చకోరతాడు; బయట గాలి సిద్ధంగావుంది. మనిషి తినగోరతాడు; తినడానికి ఆహారం ఉంది. ఈ కోరికలను కలిగించేది ఏది? బాహ్యవస్తువులే. వెలుతురు చేతనే చూపు కలుగుతోంది. శబ్దంచేతనే శ్రవణం కలుగుతోంది. మనిషిలోని ప్రతీ వాంఛనూ బాహ్యంలో అంతకుముందే ఉన్న వస్తువులు కలుగచేశాయన్నమాట. పరిపూర్ణత కావాలనే కోర్కె, ప్రకృతిని అతిక్రమించాలనే కోర్కె, లక్ష్యాన్ని అధిగమించాలనే కోర్కె, — ఈ కోర్కెను ఏదో పుట్టించి, మానవుడి ఆత్మకు పట్టించి దాన్ని అక్కడ ఉంచినది, లేకుంటే అది అక్కడ ఎలా కలిగింది? కాబట్టి ఎవడిలో ఈ తృష్ణ రేకెత్తించబడిందో అతడు లక్ష్యాన్ని చేరుకొంటాడు. కాని మనం దేవుణ్ణితప్ప తక్కిన సర్వాన్ని కాంక్షిస్తాం. నీ చుట్టూ నువ్వు చూస్తున్నది పారమార్థికపరత కాదు. నేనుండే ఇంటి యజమానురాలికి గది నిండుగా, ప్రపంచంలో అన్ని ప్రాంతాలనుంచి తెప్పించుకొన్న కుర్చీలు, బల్లలు మొదలైన సామాన్లున్నాయి. జపాన్ వస్తువులను కొనడం నేటి ఫ్యాషన్; కాబట్టి ఆమె ఒక జపాన్ పాత్రను కొని గదిలో ఉంచుతుంది. ప్రజలలో అత్యధిక సంఖ్యాకుల పారమార్థికపరత ఇలాంటిదే; అన్ని రకాల భోగవస్తువులూ వారికున్నాయి. కాని దానికి కొంత (పారమార్థిక) రుచిని కూర్చనిదే, జీవితం బాగుండదు. ఎందుకంటే సమాజం ఆక్షేపిస్తుంది. అది ఉండాలని సమాజం ఆశిస్తుంది; కాబట్టి వారిలో పారమార్థి కపరతకూడ కొంత కనిపించాలి. లోకంలో ఇప్పుడున్న పారమార్థికపరత్వపు స్థితి ఇది.

ఒక శిష్యుడు తన గురువువద్దకెళ్ళి, "గురుదేవా, నాకు భగవత్సాక్షాత్కారానుభవం కావాలి" అన్నాడు. గురువు ఆ యువకుడికేసి చూశాడు, ఏమీ మాట్లాడలేదు, మందహాసం చేశాడు. యువకుడు ప్రతీరోజు వస్తూ తనకు భగవత్సాక్షాత్కారం కావాలని చెబుతూనే ఉన్నాడు. యువకుడికి తెలిసిన దానికంటే ఎక్కువ తెలిసినవాడు కదా వృద్ధుడు. ఒకనాటి మిడిమిడి ఎండవేళ గురువు తనతో నదికి స్నానానికి రమ్మని శిష్యుణ్ణిపిలిచాడు. యువకుడు నీటిలో మునుకవేశాడు. వృద్ధు డు అతడి

వెంటేవెళ్ళి అతడి తలను నీటిలో బలంగా అదిమిపెట్టాడు. యువకుడు కాస్సేపు గిలగిల తన్నుకొన్న తరువాత గురువు విడిచిపెట్టాడు. తరువాత, "నీటిలో ఉన్నప్పుడు నీకు అన్నింటికంటే ఆవశ్యకమై ఉండినది ఏది?" అని అతడు శిష్యుణ్ణి అడిగాడు. "పీల్చడానికి గాలి" అని శిష్యుడు బదులు చెప్పాడు. "భగవంతుడికోసం నీకు అలాంటి ఆత్రం ఉందా? ఉంటే నువ్వు అతణ్ణి ఈ క్షణమే దర్శించగలవు" అని గురువు చెప్పాడు. అంతటి తృష్ణ , తహతహ ఉంటేనేతప్ప కేవలం మేధాశక్తితోను, గ్రంథాలతోను, ఆచార విధానాలతోను ఎంత శ్రమపడ్డా సాక్షాత్కారానుభవం నీకు దక్కదు. నీలో ఆ తృష్ణ

మేలుకొనేవరకు నువ్వు నాస్తికుడికంటే మేలైనవాడవు కావు; నాస్తికుడికి ఋజుత్వమైనా ఉంది; నీకు అదీ లేదు.

ఒక మహాజ్ఞాని ఇలా చెబుతూండేవాడు: "ఒక గదిలో ఒక దొంగ ఉన్నాడనీ, దాని పక్కగదిలో పెద్దసువర్ణరాసి ఉన్నసంగతి అతడికి తెలుసనీ, ఈ రెండు గదులకూ మధ్య ఒక పలుచని గోడ ఉందనీ అనుకో. ఆ దొంగ మనోస్థితి ఎలా ఉంటుంది? నిద్రపట్టదు. అన్నం తినలేడు. ఏమీ చేయలేడు. ఆ సువర్ణరాసిని అపహరించడంలోనే అతడి మనస్సు పూర్తిగా లగ్నమై ఉంటుంది". సౌఖ్యనిధి, ఆనందవిధానం, తేజోఖని (= భగవంతుడు) అందుబాటులో ఉన్నాడనే నమ్మకం జనం అందరికి నిజానికి ఉంటే వారు భగవంతుణ్ణి పొందడానికి ప్రయత్నించక ఇప్పుడు వ్యవహరిస్తున్నట్లే వ్యవహరిస్తారనుకొన్నావా? "భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం మనిషికి కలుగడంతోనే అతణ్ణి పొందాలన్న కాంక్షతో పిచ్చెత్తిపోతాడు. ఇతరులు వారిదారిన వారు పోవచ్చుగాక. కాని ఇక్కడ తాను గడుపుతున్న జీవితంకంటే మహోన్నతమైన జీవితం ఉందన్న నమ్మకం మనిషికి కలిగిన మరుక్షణమే, ఇంద్రియాలే సర్వస్వం కాదనీ, నిత్యమూ, అమరమూ, అనశ్వరమూ అయిన ఆత్మానందంతో పోల్చిచూస్తే పరిచ్ఛిన్నమైన ఈ భౌతికదేహం లెక్కలోది కాదనీ గట్టినమ్మకం మనిషికి

కలిగిన తక్షణమే ఆ ఆనందాన్ని తాను పొందేవరకు అతడికి పిచ్చెత్తిపోతుంది. ఈ పిచ్చే, ఈ తృష్ణే, ఈ వెర్రే పారమార్థిక
జగత్తులో నిద్రలేవడం (ప్రబోధం) అనబడుతుంది. అది కలిగినప్పుడు మనిషిలో పారమార్థికపరత ప్రారంభం అవుతూన్నదన్నమాట. కాని ఇందుకు చాలాకాలం పడుతుంది. ఈ ఆచారాలు, కర్మకలాపాలు, ఈ ప్రార్థనలు, యాత్రలు, ఈ గ్రంథాలు, గంటలు, దీపాలు పురోహితులు అందునిమిత్తం తోడ్పడే సన్నాహమే. ఇవి ఆత్మమాలిన్యాన్ని క్షాళనం చేస్తాయి. ఆత్మ నిర్మలమైనప్పుడు సహజంగానే అది నైర్మల్యఖని అయిన భగవంతుణ్ణేచేరుకోగోరుతుంది. ఇనుప తునుక శతాబ్దా లుగా మట్టిలో పూడుకొని ఉన్నందువల్ల చెంతనేవున్న అయస్కాంతంచేత అది ఆకర్షి ంపబడకపోవచ్చు. కాని మట్టిని కడిగి వేయగానే అది అయస్కాంతంచేత ఆకర్షింపబడుతుంది; అదేవిధంగా యుగ యుగాలుగా దుమ్ముతో, మాలిన్యంతో, క్రౌర్యంతో, పాపాలతో ఆవరించబడిన మానవాత్మ అనేక జన్మల ఆచార నిష్ఠలచేత, కర్మకలాపాలచేత, పరోపకారాలచేత, పరులను ప్రేమించడంచేత విశుద్ధి చెందుతుంది. అప్పుడు దానికి స్వతస్సిద్ధ మైన ఆధ్యాత్మికాకర్షణ కలుగుతుంది. అది మేలుకొని ఈశ్వరుడికేసి దారిచేసుకొంటూ పోతుంది.

ఈ ఆచారాలు సంకేతాలు అన్నీ కేవలం ప్రాథమిక దశలోనివే కాని నిజమైన భగవత్ప్రేమ కాదు. ప్రేమ ప్రేమ అనే
పలుకులు అన్నిచోట్ల మనకు వినిపిస్తుంటాయి. ప్రతివారూ, దేవుణ్ణి ప్రేమించండి అంటూ ఉంటారు. ప్రేమ అంటే ఏమిటో మానవులకు తెలియదు. తెలిస్తే అంత తేలికగా మాట్లాడరు. ప్రతీ పురుషుడూ తాను ప్రేమించగలనని చెబుతాడు. తన ప్రకృతిలో ప్రేమ లేదని తెలుసుకోవడం అతడికి ఎంతోకాలం పట్టదు. ప్రతీ స్త్రీ కూడ తాను ప్రేమించగలనని చెబుతుంది. తనకది సాధ్యం కానిపని అని త్వరలోనే ఆమె తెలుసుకొంటుంది. ప్రేమను గురించి లోకం అంతటా మాటలు వినవస్తున్నాయి. కాని ప్రేమించడం కష్టం. ప్రేమ ఎక్కడ ఉంది? ప్రేమ ఉన్నదని నీకెలా తెలుసు? బేరమాడటం ప్రేమకు తెలియనిది. ఇదే ప్రేమకు మొదటి లక్షణం. ఒకడు మరొకణ్ణిఅతడి వద్ద నుంచి ఏదో పొందగోరి ప్రేమిస్తే అది ప్రేమే కాదు. కాబట్టిదేవుణ్ణి , "ఇది ఇవ్వు, అది ఇవ్వు" అని ప్రార్థించడం ప్రేమకాదు. అది ప్రేమ ఎలా అవుతుంది? నేను నిన్ను ప్రార్థిస్తాను. నువ్వు నాకు ప్రతిఫలంగా ఏదో ఇస్తావు; అదే జరుగుతోంది; అదే వ్యాపారం.

ఒకానొక మహారాజు వేటకు అడవికి వెళ్ళాడు. అక్కడ అతడొక జ్ఞానిని కలుసుకోవడం జరిగింది. ఆ జ్ఞానితో కాస్సేపు

[illegible]

నిర్మలసెలయేళ్ళు నాకు కావలసిన నీటిని ఒసగుతున్నాయి; నేనీ గుహలలో నిద్రిస్తాను. నువ్వు చక్రవర్తివి కావచ్చుగాని నీ కానుకలు నాకెందుకు?" అని అతడు పలికాడు. "కేవలం నన్ను పునీతుణ్ణి చేయడానికి, నన్ను సంతోషపెట్ట డానికి నాతోపాటు నగరానికి విచ్చేసి, ఏదో ఒక కానుకను స్వీకరించండి" అంటూ రాజు పరిపరి విధాల బతిమాలుకొన్నాడు. చివరికి ఆ జ్ఞాని మహారాజు వెంటపోవడానికి సమ్మతించాడు. అతడు రాజప్రాసాదానికి పిలుచుకొని పోబడ్డాడు. అక్కడ బంగారం, నగలు, చంద్రకాంత శిలలు, అనేక మహాద్భుత వస్తువులు ఉన్నాయి. ఐశ్వర్యం, ప్రభావం సర్వత్రా ప్రత్యక్షమవుతోంది. మహారాజు తాను ప్రార్థనచేసి వచ్చేవరకు ఒక నిమిషం జ్ఞానిని వేచివుండమని, తానొక మూలకు వెళ్ళి, "ప్రభూ, నాకు ఇతోధికంగా ఐశ్వర్యం ఇవ్వు, ఇంతకంటే ఎక్కువ సంతానం ఇవ్వు, ఇంకా అధికంగా రాజ్యం ఇవ్వు" అంటూ ప్రార్థన చేయసాగాడు. ఇంతలో జ్ఞాని లేచిపోసాగాడు. జ్ఞాని పోతూండటం చూసి మహారాజు అతణ్ణివెంబడించి, "నిలువండి స్వామీ, నా కానుకను స్వీకరించలేదే, పోతున్నారేమిటి?" అన్నాడు. జ్ఞాని రాజు వైపు తిరిగి, "ఓయీ బిచ్చగాడా, నేను బిచ్చగాళ్ళను యాచించను. నువ్వు ఏం ఇవ్వగలవు? నువ్వే ఇంతసేపు యాచిస్తున్నావే" అన్నాడు. ప్రేమ భాష ఇది కాదు. ఇది ఇమ్మని, అది ఇమ్మని నువ్వు దేవుణ్ణి యాచిస్తే ప్రేమకూ వ్యాపారానికి వ్యత్యాసం ఏమిటి? బేరమాడకపోవడమే ప్రేమకు మొదటి లక్షణం. ప్రేమ సర్వదా ఇచ్చేదే కాని పుచ్చుకొనేది కాదు. ఈశ్వర పుత్రుడు ఇలా అంటాడు: "దేవుడు కోరితే నా సర్వస్వం అతడికి ఇచ్చివేస్తాను. నేను మాత్రం అతణ్ణిఏమీ కోరను. ఈ విశ్వంలో ఏదీ నాకక్కర్లే దు. అతణ్ణి ప్రేమించడం నాకిష్టం. కాబట్టేప్రేమిస్తాను. ప్రేమకు ప్రతిఫలంగా నేనేమీ ఆశించను. దేవుడు సర్వశక్తియుతుడా కాదా అనేది గమనార్హ ం కాదు. శక్తిని ఇవ్వమని కాని, శక్తిని చూపమని కాని దేవుణ్ణినేను అడగను. అతడు ప్రేమనాథుడైన దేవుడు, నాకది చాలు. వేరే ప్రశ్నలు నేను అడగబోను."

నిర్భయత్వం ప్రేమ రెండవ లక్షణం. దేవుడు మేఘాలకు ఆవల కూర్చుని, ఒక చేత్తో బహుమతులిస్తూ, మరొక చేత్తో శిక్షలు విధించేవాడని భావిస్తూన్నంతకాలం ప్రేమకు అవకాశం లేదు. నువ్వు భయపెట్టి ప్రేమింపచేయగలవా? గొర్రెపిల్ల సింహాన్ని ప్రేమిస్తుందా? ఎలుక పిల్లిని ప్రేమిస్తుందా? బానిస తన యజమానిని ప్రేమిస్తాడా? బానిసలు ఒక్కోసారి ప్రేమను అభినయిస్తారు. కాని అది ప్రేమ అవుతుందా? ఎప్పుడుగాని భయంతో ప్రేమను అభినయిస్తారు. కాని అది ప్రేమ అవుతుందా? ఎప్పుడుగాని భయంలో ప్రేమను ఎక్కడ చూస్తావు? అది బూటకం. ప్రేమతో భయం ఏనాడూ చేరదు. వీథిలో ఒక యువమాత వెళుతోందనుకోండి, కుక్క మొరిగితే ఆమె సమీపంలోని ఇంట్లోకి పారిపోతుంది. మరునాడు ఆమె బిడ్డనెత్తుకొని వీథిలో ఉన్నదనుకోండి. అప్పుడు సింహం బిడ్డమీదికి ఉరికితే ఆమె ఎక్కడ ఉంటుంది? సింహం నోటికి అడ్డంగా నిలబడి బిడ్డను కాపాడే ప్రయత్నంలో ఉంటుంది. సమస్త భయాన్ని ప్రేమ జయించింది. భగవంతుడిపట్ల ప్రేమ విషయంకూడ ఇంతే. దేవుడు బహూకరిస్తూన్నాడా, దండిస్తూన్నాడా అనడం ఎవరికి లక్ష్యం? ఆ తలంపు ప్రేమించే వ్యక్తికి ఉండదు. స్వగృహానికి వచ్చినప్పటి న్యాయమూర్తిని గురించి యోచించండి. భార్యకతడు ఎలా కనిపిస్తాడు? న్యాయమూర్తిగా కాదు, బహుమతి ప్రదాతగా కాదు, దండనాధికారిగా కాదు; పెనిమిటిగా, ప్రియుడుగా కనిపిస్తాడు. తన పిల్లలకతడు ఎలా అగపడతాడు? తమను ప్రేమించే తమ తండ్రిగా కనిపిస్తాడేకాని దండనాధికారిగా కనిపించడు, బహుమతి ప్రదాతగా కనిపించడు. అలాగే దేవుడు తన బిడ్డలకు శిక్షకుడుగా, ప్రతిఫలప్రదాతగా ఎన్నడూ అగుపడడు. ప్రేమను ఎన్నడూ చవిచూడనివారికే భయమూ, కంపమూ కలుగుతాయి. సకల విధాలయిన భయాన్ని పరిత్యజించు — దేవుడు దండనాధికారి, ప్రతిఫలప్రదాత అనే భయంకర ఆశయాలకొక విలువ అనాగరికుల మనస్సులలో ఉండొచ్చు. కొందరు వరిష్ఠ ధీమంతులైవుండీ ఆధ్యాత్మికంగా ఆటవికులుగానే ఉంటారు. అలాంటి వ్యక్తులకు ఆ భావాలు ఒకవేళ తోడ్పడవచ్చునేమో. పారమార్థికపరులైన వారికి, పారమార్థికపరతను సమీపిస్తున్నవారికి, పారమార్థిక పరిజ్ఞానం మేలుకాంచుతూన్న వారికి మాత్రం ఆ భావాలు కేవలం పసిప్రాయపు ఊహలుగా, మూఢభావాలుగా తోస్తాయి. వారు భయాశయాలను నెట్టివేస్తారు.

ప్రేమకున్న మూడవ లక్షణం ఇంకా పైమెట్టుది. ప్రేమ సదా పరమోన్నతాదర్శం. మొదటి రెండు దశలను అతిక్రమించిపోయాక, బేరమాడే చిత్తవృత్తిని, భయప్రవృత్తిని పరిత్యజించిన పిదప ప్రేమ పరమోన్నత లక్ష్యమని గ్రహించనారంభిస్తాడు. రూపవతి అయిన యువతి కురూపి అయిన యువకుణ్ణి ప్రేమించడం లోకంలో తరచూ మనం చూడటం లేదా! సుందర పురుషుడు విరూపిణి అయిన స్త్రీని ప్రేమించడం మనం ఎన్నిసార్లు చూడటం లేదు! ఏమా

ఆకర్షణం! చూపరులకు కనపడేది కురూపి అయిన పురుషుడు, విరూపిణి అయిన స్త్రీ మాత్రమే. కాముకులకు కనిపించేది వారు కాదు; ప్రేమించేవారి దృష్టికి ప్రేమించబడేవారిలో లోకాతీతసౌందర్యం కానవస్తూంటుంది. ఇదెలా? కురూపి అయిన పురుషుణ్ణి ప్రేమించే స్త్రీ తన మనస్సులోని ఆదర్శసౌందర్యాన్ని పుచ్చుకొని, దాన్ని కురూపి అయిన పురుషుడి మీదికి చాచుతుంది; ఆమె పూజించేదీ ప్రేమించేదీ తన ఆదర్శాన్నేగాని కురూపి అయిన పురుషుణ్ణి కాదు. ఇంతకీ అతడి రూపం కేవలం ఒక సూచన. దాని మీదకి ఆమె తన లక్ష్యాన్ని పరపి, దాన్ని కప్పుతుంది; అది ఆమెకు ఆరాధ్య వస్తువవుతుంది.

మనం ప్రేమించే ప్రతిచోటా ఇది అన్వయిస్తుంది. మనలో అనేకుల అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములు చాలా సామాన్యరూపం గలవారే. కాని మన అన్నదమ్ములు మన అక్కచెల్లెళ్ళు అనే ఆశయమే వారిని మన కంటికి అందంగా కనిపింపచేస్తుంది.

దీన్లోఇమిడివున్న తత్త్వరహస్యం ఇది: ప్రతి వ్యక్తీ తన లక్ష్యాన్నే బయటకు సాచి, దాన్నే పూజిస్తాడనటం. బాహ్యజగత్తు కేవలం ఒక సూచకజగత్తే. మనం చూస్తూన్నదంతా మన మనస్సులలోనుంచి మనం వెలికి చూచుకొన్నవే. ఇసుక రేణువొకటి గుల్లచేపలోకి కొట్టుకొనిపోయి, చీకాకు కలిగిస్తుంది. ఈ చీకాకువల్ల చేపలో స్రావం పుడుతుంది. అది ఇసుక రేణువును కప్పివేస్తుంది. తరువాత అందమైన ఆణిముత్యం రూపొందుతుంది. ఈ విధంగా మనకు సూచనలనిస్తుంది. వాటిమీదికి మనం మన ఆదర్శాలను పరపుతాం. మన వస్తువులను రూపొందించుకొంటాం. ఈ లోకం దుష్టులకు కేవలం ఒక నరకంగా కానవస్తుంది. సజ్జనులకు కేవలం స్వర్గంగా అగపడుతుంది. ప్రేమించే వారికి ఈ జగత్తు ప్రేమపూర్ణంగా కనిపిస్తుంది; ద్వేషించేవారికి ద్వేషపూర్ణంగా కనిపిస్తుంది. కలహప్రవృత్తి గలవారికి కలహం తప్ప మరొకటి కనబడదు. శాంతిప్రియులకు శాంతి తప్ప మరేదీ కానరాదు. పరిపూర్ణుడికి ఇక్కడ భగవంతుడు తప్ప ఇంకేదీ కనిపించదు. కాబట్టి

మనం సదా మన పరమోన్నతాదర్శాన్నే ఉపాసిస్తాం. ఆదర్శం ఆదర్శంగా ప్రేమించే స్థాయిని మనం అందుకొన్నప్పుడు సకల సందేహాలూ, వాదాలూ శాశ్వతంగా సమసిపోతాయి. దేవుణ్ణి నిరూపించడానికి వీలుంటుందా లేదా అనే సంగతి ఎవరికి కావాలి? ఆదర్శం ఎప్పటికీ పోజాలదు. ఎందుకంటే ఆదర్శం మన ప్రకృతిలో భాగమే. నా ఉనికిని సందేహించినప్పుడే నా ఆదర్శాన్ని సందేహిస్తాను. నా ఉనికిని శంకించలేను కాబట్టినా ఆదర్శాన్ని శంకించలేను. భగవానుడు ఏకకాలంలోనే సర్వశక్తిగాను, సర్వదయాళువుగాను ఉండటం శక్యమా కాదా అనే సంగతి ఎవరికి పట్టింది? మానవాళికి ప్రతిఫలాన్ని ప్రసాదించేది దేవుడేనా, మనమీది దేవుడి చూపు దయాసంపన్నుడైన ప్రభువు చూపా, క్రూరప్రభువు చూపా — అనే సంగతి ఎవరికి పట్టింది?

కాముకుడు ఈ అన్నిటినీ దాటినాడు. బహుమతులు, శిక్షలు, భయాలు, సందేహాలు, వైజ్ఞానిక నిరూపణలు, తదితర నిరూపణలు — వీటికి అతీతుడతడు. ప్రేమాదర్శం అతడికి చాలు. విశ్వం ఈ ప్రేమావిష్కృతే అన్న విషయం తనంతట తేటతెల్లమయింది కదా! సూక్ష్మాణువును సూక్ష్మాణువును, స్థూలాణువును స్థూలాణువును, కలిపేది ఏది? గ్రహాలను ఒండొక

దానివంకకు ఉరవడింపచేస్తున్నదేది? మనిషి మరొక మనిషివైపుకు ఆకర్షితుడుకావడం, అలాగే స్త్రీకి పురుషునివైపు ఆకర్షణ, పురుషునికి స్త్రీ వైపు ఆకర్షణ, ఒక జంతువుకు మరొక జంతువుపట్ల ఆకర్షణ — ఇలా వీటన్నిటినీ ఒకదానివైపు మరొకటి ఆకర్షింపచేస్తున్నది ఏమిటి? ఈ విశ్వాన్నంతటిని ఒక్క కేంద్రంకేసి ఆకర్షిస్తూన్నదేది? అదే ప్రేమ అనబడేది. అది పరమాణువునుంచి బ్రహ్మవరకు అన్నిట్లోను వ్యక్తమై ఉంది. ఈ ప్రేమ సర్వశక్తిమంతమైనది, సర్వోపగతమైనది. వ్యష్టిలోను, విశ్వంలోను, చేతనలోను, అచేతనలోను ఆకర్షణరూపాన వ్యక్తమవుతూంది భగవంతుడి ప్రేమే. విశ్వంలో ఉన్న ఏకైకమైన ఇచ్ఛాశక్తి అదే. ఆ ప్రేమ ప్రేరణచేతనే క్రీస్తు మానవకోటికై తన ప్రాణం అర్పించాడు. బుద్ధభగవానుడు ఒక చిరుజంతువుకోసం సైతం జీవితం ధారపోశాడు; బిడ్డకోసం తల్లీ, భర్తకోసం భార్య చేసే త్యాగాన్ని పురికొల్పేదీ ఆ ప్రేమే. ఆ ప్రేమ మహిమవలననే జనులు తమ దేశంకోసం ప్రాణాలు అర్పించ సిద్ధపడుతున్నారు. ఇంకా విచిత్రమైన విషయం ఏమంటే, ప్రేమ మహిమచేతనే దొంగ దొంగతనం చేస్తున్నాడు; హంతకుడు హత్యచేస్తున్నాడు. వీటిలో సైతం ప్రేరకం అదే. అది వ్యక్తమయ్యే తీరుమాత్రమే వేరు. విశ్వంలోని ఏకైక ప్రేరకశక్తి అదే. దొంగకు బంగారంపట్ల ప్రేమ; ప్రేమ దాన్లో ఉంది. కాని అది పెడదోవ పడుతోంది. సకల దుష్కార్యాలకూ, సకల సత్కార్యాలకూ వెనుక ఉంది, నిత్యప్రేమ. ఒకడు న్యూయార్క్ లోని పేదసాదల సహాయార్థం వెయ్యి డాలర్లకు చెక్కు రాసి ఇస్తాడనుకోండి. అదే సమయంలో ఆ గదిలోనే మరొకడు మిత్రుడిపేర దొంగసంతకం చేశాడనుకొందాం. ఇద్దరు రాసిందీ ఒక్క దీపపు వెలుగులోనే. ఆ వెలుగును ఎవరు

వినియోగించుకొన్న తీరుకు వారు బాధ్యులు. ప్రస్తుతించవలసిందిగాని, దూషించవలసింది గాని వెలుతురును కాదు. దేనిలోను సంగం లేక సమస్తంలోను ప్రకాశిస్తూన్నది, ప్రేమ. అదే విశ్వంలోని ప్రేరకశక్తి. అదే లేకుంటే విశ్వమంతా క్షణమాత్రంలో తుత్తునియలయిపోతుంది. ఈ ప్రేమే భగవానుడు.

"ప్రేయసీ, భర్తకోసమే భర్తను ఎవరూ ప్రేమించరు. భర్తలోని ఆత్మకోసమే భర్తను ప్రేమిస్తుంది; ఓ ప్రియా, భార్యకోసమే భార్యను ఎవడూ ఎప్పుడూ ప్రేమించడు. భార్యలోని ఆత్మకోసమే భార్యను ప్రేమిస్తాడు. ఆత్మకోసమేకాని మరి దేని నిమిత్తమూ దేన్నీ ఎవ్వరూ ప్రేమించరు." అంతగా నిందించబడే ఈ స్వార్థపరత్వం సైతం ఆ ప్రేమావిష్కారమే. ఈ లీలకు తటస్థుడవుగా ఉండు. దాన్లోకలిసిపోక అద్భుతమైన ఈ సర్వదిగ్ద ర్శక చిత్రాన్ని, రంగం తరువాత రంగంగా సాగుతున్న ఈ మహత్తర నాటకాన్ని ఈ అద్భుత స్వరమేళనాన్ని పరికించు; అన్నీ ఒక్క ప్రేమ దాల్చే రూపాలే. స్వార్థపరత్వంలో సైతం ఆ ఆత్మ అనేకమై అంతకంతకు వృద్ధిపొందుతుంది. ఒక్క ఆత్మ, ఒక్క పురుషుడు వివాహితుడైన తరువాత ఇద్దరవుతారు, పిల్లలు పుట్టినప్పుడు పలువురవుతారు. యావత్ప్రపంచం, అఖిలవిశ్వం తానే అన్న అనుభవం కలిగే వరకు అతడు వృద్ధిచెందుతూంటాడు. విశ్వప్రేమ పుంజంగా, అనంతప్రేమగా భగవత్స్వరూపమైన ప్రేమగా అతడు విరివిచెందుతాడు.

మనం ఈ విధంగా పరాభక్తి దశకు వస్తాం. ఈ దశలో రూపాలు, సంకేతాలు రాలిపోతాయి. ఈ స్థితిని చేరుకొన్న వ్యక్తి ఏ ఒక్క శాఖకూ చెందదు. అన్ని శాఖలూ అతడిలో ఇముడుతాయి, అతడు దేనికి చెందుతాడు? అన్ని దేవళాలు, ఆలయాలు అతడిలోనే ఉన్నాయి. అతణ్ణిఇముడ్చుకోగలంత పెద్ద 'చర్చ్ ' ఎక్కడ ఉంది? అలాంటి వ్యక్తి ఏవో కొన్ని పరిమిత రూపాలకు కట్టుపడలేడు. అనంతమైన ప్రేమతో అతడు ఐక్యమొందాడు. ఆ ప్రేమకు అంతు ఏదీ? ప్రేమాదర్శాన్ని అవలంబించిన ప్రతి మతంలోను దాన్ని వ్యక్తీకరించడానికై సాగే పెనగులాట మనకు కానవస్తుంది. ఈ ప్రేమకు అర్థం మనకు తెలుసు. అనురాగాలతో, ఆకర్షణలతో కూడిన ఈ ప్రపంచంలోని ప్రతివస్తువు ఆ అనంతప్రేమ దాల్చే రూపమే. దాన్ని వ్యక్తం చేయడానికి వివిధ దేశాలకు చెందిన జ్ఞానులు, యోగులు ప్రయత్నించారు. అయినా క్షుద్రాలైన ఇంద్రియవాంఛారూపాలను సైతం దివ్యప్రేమగా రూపించి చిత్రించడానికి భాషకున్న సర్వశక్తులను వారు వినియోగిస్తూండటం మనం చూస్తాం.

హీబ్రూ రాజయోగి ఈ విధంగా కీర్తించాడు. భారతీయులు ఈ తీరుగానే కీర్తించారు: "ఓ ప్రియా! అధరాస్వాదం, ఒక్కమారు ప్రసాదించుమా! నువ్వొక్కసారి ముద్దుపెట్టుకొన్నావా, నీ కోసమైన తృష్ణనిరంతరం వృద్ధి పొందుతుంది! సమస్త దుఃఖాలు అంతరిస్తాయి. భూతవర్తమానభవిష్యత్తుల మరపు కలుగుతుంది. నిన్ను గురించిన ధ్యానమే కలుగుతుంది."* కోర్కెలన్నీ నశించాక ప్రియుడికి పట్టే పిచ్చిలాంటిది. "మోక్షం ఎవరికి కావాలి? రక్షించబడటానికి ఆత్రపడే వారెవ్వరు? పరిపూర్ణత్వం పొందడం మాత్రం ఎవరికి లక్ష్యం? విమోచన కోరేవారెవ్వరు?" అని ప్రియుడంటాడు. "నాకు ఐశ్వర్యం అక్కర్లేదు. ఆరోగ్యమూ నాకు అవసరం లేదు. నాకు సౌందర్యం అవసరం లేదు. నాకు అపార మేధాశక్తి అక్కర్లేదు; లోకంలోని సమస్త పాపాలకూ మధ్య నన్ను మళ్ళీమళ్ళీ జన్మించనివ్వు; నేనేమి ఫిర్యాదు చేయను. కానీ, నిన్ను ప్రేమించనివ్వు. ప్రేమ కోసమే ప్రేమించనివ్వు".*

ఈ కీర్తనలలో వ్యక్తమయ్యే ప్రేమోన్మాదం అలాంటిది. మానవప్రేమలలో అత్యుదాత్తమైనది, అత్యంత ప్రకాశమైనది, బలిష్ఠమైనది, అత్యాకర్షకమైనది మగువకూ మగవాడికీ మధ్య ఉండే ప్రేమ. కాబట్టిగభీరతమమైన భక్తిని ప్రకటించడానికి ఆ భాష వ్యవహరించబడింది. మానవప్రేమలోని ఈ ఉన్మాదం భక్తయోగుల ప్రేమోన్మాదపు అస్పష్టతమమైన ప్రతిఫలనమే. నిజమైన ఈశ్వరభక్తులు ఉన్మాదం పొందగోరతారు: ఈశ్వర ప్రేమచేత మత్తిల్లఅభిలషిస్తారు; దైవోన్మత్తులు కాగోరతారు. ప్రతి మతానికి చెందిన ఈ జ్ఞానులూ, యోగులూ పాత్రలనిండుగా తయారుచేసిన ప్రేమను సేవించగోరతారు. ఆ పాత్రలో జ్ఞానులూ, యోగులూ, తమ హృదయసారాన్ని పోసారు. దాన్లో ప్రతిఫలం ఆశించక ప్రేమకోసమే ఈశ్వరుణ్ణి ప్రేమించిన భక్తుల ఆశలు కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రేమకు ప్రతిఫలం ప్రేమే. ఎలాంటి ప్రతిఫలం అది! అదొక్కటే సమస్త దుఃఖాలను బాపేది. ఆ ప్రేమపానం చేయడంచేతనే భవరోగాలు మటుమాయమవుతాయి. మానవుడు దైవోన్మత్తుడై తాను మానవుడనన్న మాటే మరచిపోతాడు.

చివరికి ఇక వివిధ విధానాలన్నీ పరిపూర్ణఐక్యం అనే ఒక్క కేంద్రం వైపుకే సాగుతాయి. ప్రారంభంలో మనం సర్వదా

ద్వైతులుగానే ఉంటాం. దేవుడు వేరే తత్త్వం. నేను వేరే తత్త్వం. ఇద్దరికి మధ్య ప్రేమ ప్రకాశిస్తుంది. అప్పుడు మానవుడు దేవుణ్ణి సమీపించ నారంభిస్తాడు. దేవుడూ మానవుణ్ణి సమీపించ ప్రారంభించినట్లు ంటుంది. మానవుడు దేవుణ్ణి తండ్రిగా, తల్లి గా మిత్రుడుగా, ప్రియుడుగా, జీవితంలోని వివిధ బాంధవ్యాలను అవలంబిస్తాడు. చిట్టచివరి దశలో అతడు ఉపాస్యవస్తువుతో ఒక్కటవుతాడు. "నేను నువ్వే, నువ్వు నేనే; నిన్ను ఉపాసించడం మూలంగా నన్ను నేను ఉపాసించుకొంటున్నాను. నన్ను నేను ఉపాసించుకోవడంలో నిన్ను ఉపాసిస్తూన్నాను." మానవుడు దేనితో ప్రారంభిస్తాడో దాని పరమావధి అందులో చూస్తాం. ప్రారంభంలో అది తనకోసం ప్రేమ. తన పరిమిత వ్యక్తిత్వంకోసమే అవడంచేత ప్రేమ స్వార్థపరమైనది; చివరిదశలో నిండువెలుగు ఆవిష్కారమైనది. అప్పుడు ఆత్మ అనంతమైనది. ఆరంభంలో దేవుడెక్కడో ఒక వ్యక్తిగా ఉన్నాడు. అతడు ఇప్పుడు అనంతప్రేమ అయినాడు. మానవుడుకూడ రూపాంతరం పొందాడు. అతడు దేవుణ్ణి సమీపిస్తున్నాడు. ఇదివరకు తనలో పుష్కలంగావున్న నిరర్థక వాంఛలనన్నిటినీ అతడు భక్తితత్త్వము విసర్జిస్తున్నాడు. కోర్కెలు పోగా వాటితోపాటు స్వార్థచింతన కూడా మటుమాయమైనది. చివరకు ప్రేమకూ ప్రేమప్రభవానికీ ప్రేమలక్ష్యానికీగల ఐక్యం అతడికి ప్రత్యక్షమైనది.

# Footnotes

1. యా ప్రీతిరవివేకానాం విషయేష్వనపాయినీ ।

త్వామనుస్మరతః సా మే హృదయాన్మాపసర్పతు ॥

– విష్ణుపురాణం, I.xx.19

1. ఆహారశుద్ధౌసత్త్వశుద్ధి ః సత్వశుద్ధౌధ్రువా స్మృతిః ।

– *ఛాందోగ్య ఉపనిషత్ 7.26*

1. నాహం తిష్ఠామి వైకుంఠే యోగినాం హృదయే న చ ।

మద్భక్తా యత్ర గాయంతి తత్రతిష్ఠామి నారద ॥

1. నాయమాత్మా ప్రవచనేన లభ్యో

న మేధయా న బహునా శ్రుతేన ।

యమేవైష వృణుతే తేన లభ్యః

తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ ॥

– *కఠోపనిషత్ I.ii.23*

1. వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్రవ్యాఖ్యానకౌశలం ।

వైదుష్యం విదుషాం తద్వత్ భుక్తయే న తు ముక్తయే ॥

వివేకచూడామణి, 58.

1. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।

అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥

– *శ్రీమద్భగవద్గీత 4.7*

2. అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।

పరం భావ మజానన్తో మమ భూత మహేశ్వరమ్ ॥

*– శ్రీమద్భగవద్గీత 9.11*

1. సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్.

*– ఛాందోగ్య ఉపనిషత్, 6.2.1*

1. సర్వే వేదా యత్పదమామనన్తి
తపాంసి సర్వాణి చ యద్వదన్తి ।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తే పదం సంగ్రహేణ బ్రవీమి ఓమిత్యేతత్ ॥

*– కఠోపనిషత్తు 1.2.15*

2. ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।

ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ॥

*– కఠోపనిషత్తు 1.2.16*

1. శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః
శృణ్వన్తో–పి బహవో యం న విద్యుః ।
ఆశ్చర్యో వక్తా కుశలో–స్య లబ్ధా
ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥

*– కఠోపనిషత్తు 1.2.7*

1. సురతవర్ధనం శోకనాశనం స్వరితవేణునా సుష్ఠుచుమ్బితమ్ ।
ఇతరరాగవిస్మారణం నృగాం వితర వీర నస్తే–ధరామృతమ్ ॥

*– భాగవతం 10:31.14*

1. న ధనం న జనం న సుందరం కవితాం వా జగదీశకామయే ।
మమజన్మని జన్మనీశ్వరే భవతాద్ భక్తిరహైతుకత్వయి ॥

*శిక్షాష్టకం, 4.*